# పారిస్ కమ్యూన్ 150

కారల్ మార్క్స్ | వి.ఐ. లెనిన్ | బెర్టోల్ట్ బ్రెక్ట్

పరిచయం : విజయ ప్రసాద్

PSBH

NTPH

# పారిస్ కమ్యూన్ 150

కారల్ మార్క్స్ | వి.ఐ. లెనిన్ | బెర్టోల్ట్ బ్రెక్ట్

పరిచయం : విజయ ప్రసాద్

అనువాదం:

ఎస్. వెంకట్రావు

గుడిపూడి విజయరావు


PSBH

ప్రజాశక్తి బుక్‌హౌస్

విజయవాడ -2

Nava Telangana Publishing House

నవతెలంగాణ పబ్లిషింగ్‌హౌస్

హైదరాబాద్ -20

**27** అంతర్జాతీయ ప్రచురణ సంస్థలచే సంయుక్తంగా
**18** భాషలల్లో ముద్రింపబడింది. తెలుగులో ప్రజాశక్తి బుక్‌హౌస్, నవతెంగాణా
పబ్లిషింగ్ హౌస్‌లు సంయుక్తంగా ప్రచురించాయి.
ప్రచురణ సంస్థల పేర్లు పక్క పేజీలో చూడగలరు.

| | | |
|---|---|---|
| Publication No | : | 1680 |
| First Edition | : | 28-05-2021 |
| Cover Design | : | Jorge Luis Aguilar(Cuba) |
| Back Cover | : | Junaina Muhammed(India, Student Federation of India/ Young Socialist Artists) |

For Copies :
**Prajasakthi Book House**
27-1-54, Karl Marx Road,
Governorpet, Vijayawada-2, Ph : 0866-2577533

**Nava Telangana Publishing House**
M.H. Bhavan, Plot No. 21/1, Azamabad,
Near RTC Kalyana Mantapam,
Hyderabad-500 020. Ph : 9490099378

Prajasakti Book House Branches **:**
Vijayawada, Guntur, Visakhapatnam, Tirupati, Ongole, Nellore,
Kakinada, Karnool, Vijayanagaram, Eluru, Anantapuram.

Nava Telangana Publishing House Branches **:**
Hyderabad (Chikkadapalli); Baghlingampalli (SVK) ; Nalgonda,
Hanmakonda, Karimnagar, Khammam, Nizamabad and Mahaboobnagar

Printed at
Prajasakti Daily Printing Press, Vijayawada
website : www.psbh.in
Prajasaktipublishinghouse@gmail.com

Price : **₹. 100/-**

151711

Batalla de Ideas (Argentina)
www.batalladeideas.com.ar

Bharathi Puthakalayam (India)
www.thamizhbooks.com

Centro Social y Librería Proyección (Chile)

Chintha (India)
www.chinthapublishers.com

Editorial Caminos (Cuba)
ww.ecaminos.org

El Colectivo (Argentina)
www.editorialelcolectivo.com

Expressao Popular (Brasil)
www.expressaopopular.com.br

Fondo Editorial Fundarte (Venezuela)
www.fundarte.gob.ve

Idea (Romania)

Gonoprokashon (Bangladesh)

Janata Prasaran Tatha Prakashan
Public Limited (Nepal)

Insituto Simón Bolívar (Venezuela)
www.isb.ve

Janashakti Prakashan (India)

Kriya Madyama (India)

LeftWord (India)
www.mayday.leftword.com

Naked Punch (Pakistan)
www.nakedpunch.com

National Book Agency (India)
www.nationalbookagency.com

Marjin Kiri (Indonesia)
www.marjinkiri.com

Nava Telangana (India)
www.navatelanganabooks.com

Ojas: Vidyarthi Ni Pahel (India)

Prajasakti (India)
www.psbh.in

Red Star Press (Italy)
www.redstarpress.it

Studia Humanitatis (Slovenia)
www.studia-humanitatis.si

Tricontinental: Institute of Social Research
www.thetricontinental.com

Vam Prakashan (India)
mayday.leftword.com/vaam-prakashan/

Yordam Kitap (Turkey)

Založba /*cf (Slovenia)
www.zalozbacf.si

# విషయసూచిక


9 పరిచయం :
ఆదర్శ ప్రపంచానికి తెరుచుకున్న ద్వారాలు : విజయ ప్రసాద్

23 ప్రకాశవంతమైన పుష్పం : టింగ్ చాక్

27 1871 ఫ్రాన్సు అంతర్యుద్ధంపై అంతర్జాతీయ కార్మిక సంస్థ
జనరల్ కౌన్సిల్ ప్రసంగం
యూరోప్, అమెరికాలలోని
కార్మిక సంస్థ సభ్యులందరికి : కారల్ మార్క్స్

77 రాజ్యం, విప్లవం. అధ్యాయం – III
1871 పారిస్ కమ్యూన్ అనుభవం,
మార్క్సు విశ్లేషణ : వి.ఐ. లెనిన్

103 పారిస్ కమ్యూన్ ఆర్టిస్టుల ఫెడరేషన్ ప్రణాళిక

109 కమ్యూనార్డుల తీర్మానం : బెర్టోల్ట్ బ్రెక్ట్


Debout! les damnés de la terre. Debout! les forçats de la faim
La raison tonne en son cratère, C'est l'éruption de la fin.
Du passé faisons table rase. Foule esclave, debout! Debout!
Le monde va changer de base. Nous ne sommes rien, soyons tout!
শেষ যুদ্ধ শুরু আজ কমরেড
এসো মোরা মিলি একসাথ গাও
ইন্টারন্যাশনাল মিলাবে মানবজাত।।

## పరిచయం :

# ఆదర్శ ప్రపంచానికి తెరుచుకున్న ద్వారాలు

*విజయ ప్రసాద్*

1871లో డెబ్బెయ్ రెండు రోజుల పాటు పారిస్ ప్రజలు ఒక ఆదర్శ ప్రపంచానికి ద్వారాలు తెరిచారు. ఫ్రాన్స్ పాలక వర్గాలు దేశాన్ని వినాశకర యుద్ధంలోకి నెట్టి, ప్రష్యాకు దాసోహం చేయడంతో పారిస్ కార్మికులంతా ఒకటయ్యారు. నగరాన్ని శత్రువుల బారిన పడకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి రక్షించుకోవాలని, తమ స్వంత ప్రజాతంత్ర సూత్రాలతో స్వంత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. పాలక వర్గాలు సృష్టించిన సమస్యలను పరిష్కరించుకోడానికి ప్రయత్నించారు. “ఈ పారిస్ ప్రజల్లో ఏమా చాకచక్యం, ఏమా చారిత్రక చొరవ, ఏమా త్యాగనిరతి...” అని 1871 ఏప్రిల్ 12న కారల్ మార్క్స్ తన స్నేహితుడు కుగెల్మాన్‌కు ఉత్తరం రాస్తూ హర్షాతిరేకం ప్రకటించాడు.[1] ‘వారు బయటి శత్రువు కన్నా అంతర్గత విద్రోహం వల్ల ఆరు మాసాల ఆకలి, విధ్వంసాలను ఎదుర్కొంటూ కూడా, ప్రష్యా సైన్యాల బాయ్‌నెట్‌ల నీడలో, ఫ్రాన్స్–జర్మనీల మధ్య యుద్ధాన్ని లక్ష్య పెట్టకుండా ఉవ్వెత్తున తిరుగుబాటు చేశారు. అంతటి గొప్ప ఉదాహరణను చరిత్ర ఎన్నడూ చూడలేదు’ అని ఆయన పేర్కొన్నాడు.

1789 ఫ్రెంచ్ విప్లవానికీ, 1848 తిరుగుబాటుకూ వారసుల్లా ఈ పారిస్ కార్మికులు నగర వీధుల్లో నడిచారు. ప్రపంచ శ్రామిక ప్రజలు తామే రూపొందించుకుని, తామే నిర్వహించుకునే ఒక ప్రపంచాన్ని సృష్టించవచ్చుననే ఆశతో ప్రతి అడుగూ స్వర్గంవైపు వేశారు. అయితే ప్రతి సారీ వారి తిరుగుబాటును ఒక చిన్న శక్తివంతమైన వర్గం – బూర్జువా వర్గం – మోసంతో వమ్ముచేస్తూ వచ్చింది. లేక సాయుధ తిరుగుబాటును తన స్వంత ప్రయోజనాలకు వినియోగించుకుంది. లేకుంటే తన

శత్రువర్గాలకు (బూర్జువాలతో సహా) చెందిన ప్రభుత్వం హింసాకాండతో అణచివేసింది. నెపోలియన్ 1, నెపోలియన్ 3లు కొద్దిమంది శక్తిమంతుల చేతుల్లో పావులుగా మారి విస్తారమైన ప్రజల ఆశలపై నీళ్లు పోశారు.[2] 1789, 1848 ఓటములు ఆ కార్మికులను ఎంతమాత్రం నిలువరించ లేకపోయాయి. 1871 పోరాటం మరింత కష్టసాధ్యమైనదనివారికి తెలుసు. అయినా సాయుధ పోరాటంలోకి ఉరికారు. అది ఓడిపోయింది. ఫ్రెంచ్ బూర్జువా వర్గం లక్ష మంది స్త్రీపురుషులను ఊచకోత కోసి చంపింది.

## హోటల్ డి విల్లె మీద ఎర్ర జెండా

ఈ డెబ్బయ్‌రెండు రోజుల అనుభవమే పారిస్ కమ్యూన్. దాన్ని 'కమ్యూన్' అని ఎందుకన్నారంటే, 1792లో విప్లవ కారులు తమ అధీనంలోని నగరాలను స్వంత సూత్రాలతో కూడిన స్థానిక స్వయంపరిపాలనా కేంద్రాలుగా మార్చుకున్నారు. ఆ ప్రజా ప్రభుత్వ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ పారిస్‌లో జరిగిన తిరుగుబాటు కూడా పారస్ కమ్యూన్ అనే పేరు పెట్టుకుంది. పారిస్ నగరంలోని ప్రతి వార్డు (ఎర్రోండైజ్‌మెంట్)లో కమ్యునార్డులు (కమ్యూన్ మద్దతుదారులు) భద్రతా కమిటీలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి కమిటీ నలుగురు సభ్యులను పారిస్ కమ్యూన్ సెంట్రల్ కమిటీకి పంపిస్తుంది. పారిస్ ప్రతినిధులంతా కార్మికవర్గం నుండి వచ్చిన వారే, ముఖ్యంగా 1871కి ముందు దశాబ్దాలపాటు జరిగిన వివిధ విప్లవోద్యమాలకు చెందిన వారు. మున్సిపల్ అధికారులను ఎన్నుకోవాలని, ఎన్నికైన ప్రతినిధుల నియంత్రణలో పోలీసులు ఉండాలని, న్యాయవ్యవస్థ కూడా ఎన్నికద్వారానే రావాలని, పత్రికా స్వేచ్ఛ, సభలు, సమావేశాలు జరుపుకునే స్వేచ్ఛ ఉండాలని, నగరాన్ని రక్షించుకోడానికి పౌరులకు కూడా ఆయుధాలు ఇవ్వాలని ఈ కేంద్ర కమిటీ డిమాండ్ చేసింది.[3]

కమ్యూన్ ఒక దేశభక్త ఆశయంతో, ప్రష్యన్ సైన్యం నుండి పారిస్‌ను రక్షించుకోడానికి ప్రారంభమైంది. కాని ప్రజల మానసిక స్థితి, విప్లవ గ్రూపుల ప్రభావంతో అది చాలా త్వరలోనే మరింత రాడికల్, ప్రజాతంత్ర లక్షణాన్ని సంతరించుకుంది. కమ్యూన్ గురించి ప్రోస్పెర్–ఓలివీర్ లిస్సగరే సవివరంగా రాశారు. ఆయన కూడా కమ్యూన్ సభ్యుడే. 'అనామకులైన' వారు కూడా కమ్యూన్‌లో ఉన్నత స్థానాలకు చేరుకున్నారని అది ఒంటెత్తుగా కాకుండా 'అందరికీ' చోటిచ్చిందనీ అందువల్లనే అది శక్తివంతమైందని ఆయన రాశారు. విప్లవం ప్రారంభమైన మరునాడు

మార్చి 19న లిస్సాగరే ఇలా రాశారు: "హోటెల్ డి విల్లె మీద ఎర్ర జెండా ఎగిరింది. సైన్యం, ప్రభుత్వం, పరిపాలనా యంత్రాంగం అన్నీ ప్రభాత వేళ పొగమంచులో కొట్టుకుపోయాయి. బాస్టిల్లే లోతుల్లోనుండి, రూ బాస్‌ఫ్రో చీకట్ల నుండి లేచిన కేంద్ర కమిటీ ప్రపంచంలోని అత్యున్నత శిఖరాలకు చేరుకున్నది.[4] మార్చి 27న కేంద్ర కమిటీ వివిధ సంస్థలకు ఎన్నికలు నిర్వహించింది. మరునాడే ఎన్నికైన సభ్యులు తమ స్థానాలు ఆక్రమించారని లిస్సాగరే రాశారు. ఆయన ఇలా రాశారు :

> రెండు లక్షల మంది ''దౌర్భాగ్యులు''.. బెటాలియన్ డ్రమ్ములు వాయించుకుంటూ, బ్యానర్లు పట్టుకుని, ఫ్రిజియన్ టోపీలు, ఎరుపురంగు అంచులుగల తుపాకులు ధరించి హోటల్ డి విల్లెకు వచ్చారు. వారి ప్రతినిధులను ఎన్నుకున్నారు. సైనికులు పెద్ద ఎత్తున వారితో వచ్చి కలిశారు. పారిస్ నగరానికి విశ్వాసపాత్రులైన ఫిరంగి దళ సైనికలు, మెరైన్‌లు వీధుల్లో నడుచుకుంటూ అనేక ఉపనదులు ఒక నదిలో వచ్చి కలిసినట్లు ప్లేస్ డి గ్రేవె కు చేరుకున్నారు.

ఎన్నికయిన ప్రతినిధులు భుజాల మీద ఎర్రటి కండువాలతో ముందుకొచ్చారు. వివిధ స్థానిక సంస్థలకు ఎన్నికయిన వారికి కచ్చితమైన నిబంధనలున్నాయి. ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా పాలించకపోతే వారిని స్వేచ్ఛగా, వెనువెంటనే వెనక్కు పిలవచ్చు అనేది అందులో ఒకటి. 'ప్రజల పేరున కమ్యూన్ ప్రకటించబడింది' అని పింగాణీ మీద పెయింటు వేసే కార్మికుడు గ్రాబ్రియేల్ రాన్వీర్ ప్రకటించాడు. 'వివె లా కమ్యూన్' అని ప్రజలు ముక్త కంఠంతో నినదించారు. 'బాయ్‌నెట్‌ల చివర టోపీలు తగిలించారు, పతాకాలు గాలిలోకి లేచాయి' అని లిస్సాగరే రాశాడు. 'అక్కడున్న హృదయాలన్నీ హర్షాతిరేకాలతో ఎగిసిపడ్డాయి, ఆనందంతో కళ్లు చెమర్చాయి' అని పేర్కొన్నాడు. ప్రతీఘాత విప్లవ ఏజెంట్లు వెర్సయిల్స్‌లోని తమ బాస్‌ల దగ్గరకు హుటాహుటిన వచ్చి 'నిజంగా ఈ ఆనందోత్సాహాల్లో మొత్తం పారిస్ పాల్గంది' అని చెప్పారు.

## కమ్యూన్ యొక్క కార్మిక వర్గ లక్షణం

ప్యారిస్ కమ్యూన్ జారీ చేసిన డిక్రీలు (చట్టాలు) పరిశీలిస్తే దాని కార్మిక వర్గ లక్షణం చాలా స్పష్టంగా కనిపిస్తుంది. ఆ డిక్రీలు ఇలా ఉన్నాయి: మూతపడేసిన ఫ్యాక్టరీలను కార్మికులు ఆక్రమించుకుని నడపాలి. కార్మికులపై విధించిన జరిమానాలు

రద్దు చేయాలి. బేకరీల్లో రాత్రిపూట పనిని నిషేధించాలి. చర్చి ఆస్తులను స్వాధీనం చేసుకుని సామాజిక అవసరాల కోసం ఉపయోగించాలి. కార్మికవర్గానికి ఒకరకమైన భద్రత కలిగించే తాకట్టు దుకాణాలను మార్పు చేయాలి. 'తాకట్టు దుకాణాలను తొలగించే ముందు ఉద్యోగాల నుండి తొలగించబడిన కార్మికులకు సరైన రక్షణలు కల్పించే సామాజిక సంస్థ ఏర్పాటు చేయాలన్న విషయం అందరికీ అర్థమయింది. కమ్యూన్ ఏర్పాటుతో పెట్టుబడి దోపిడీ నుండి కార్మికులను రక్షించే సంస్థలు అవసరమైనాయి' అని ఒక కమ్యునార్డ్ రాశాడు.

కొత్త సమాజంలో కార్మికవర్గంలోని ప్రతి సభ్యుణ్ణి – చివరికి కమ్యూన్‌కు వ్యతిరేకంగా పోరాడిన వాళ్లను కూడా ఇముడ్చుకోవాలని కమ్యూన్ అభిప్రాయపడింది. 'మమ్మల్ని చంపుతున్న 92 మంది వ్యక్తుల భార్యలకు కమ్యూన్ రొట్టెలు పంపించింది' అని ప్రజా భద్రత బ్యూరో అధిపతి ప్రకటించాడు. 'భర్తలు కోల్పోయిన ఇద్దరు ఏ పార్టీకీ చెందరు. కష్టాల్లోఉన్న వారందరికీ రొట్టె ఇవ్వాలి. అనాధలందరినీ చేరదీయాలి' అని పేర్కొన్నాడు. అంతర్జాతీయ కార్మిక మహిళల సంఘానికి చెందిన మేడమ్ ఆంద్రీ లియో గ్రామీణ వ్యవసాయదారుల మానిఫెస్టోలో ఇలా రాశారు: 'సోదరా! నీవు మోసగించబడ్డావు. మన ప్రయోజనాలు ఒక్కటే. నేను నిన్ను కోరేదేమంటే నీవు కూడా అదే కోరుకో. మనం పొందే స్వేచ్ఛ నీది. పారిస్ (కమ్యూన్) కోరుకుంటున్నది రైతుకు భూమి, కార్మికునికి పనిముట్టు.'

కమ్యూన్ పతనమైన రెండు రోజుల తరువాత అంతర్జాతీయ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్‌లో ప్రసంగిస్తూ కారల్ మార్క్స్ ఇలా అన్నాడు: 'సారాంశంలో ఇది కార్మికవర్గ ప్రభుత్వం. దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం నుండి ఉద్భవించిన ప్రభుత్వం. చివరికి కార్మికుల ఆర్థిక విముక్తికి మార్గం వేసే రాజకీయ రూపం అది.' (ఈ ప్రసంగాన్ని ఈ పుస్తకంలోనే ఇస్తున్నాం).

రాచరికంలో అసమర్ధంగా పనిచేసిన వివిధ విభాగాల అధికారులను మరింత ఉత్పాదకతతో పనిచేయించడానికి ప్రయత్నించారు. కంచు పనిచేసే జెఫిరిన్ కమెలినాట్ మింట్‌కు ఆర్డరు తీసుకొచ్చాడు. ముద్రణ పనిచేసే ఆల్బెర్ట్ థీస్జ్ పోస్టల్ డిపార్ట్‌మెంటులో గందరగోళాన్ని సరిచేశాడు. (కమెలినాట్ 1924లో ఫ్రెంచ్ కమ్యూనిస్టు పార్టీ తరఫున అధ్యక్షపదవికి పోటీ చేశారు). బూర్జువా వర్గం వదిలిపెట్టిన గందరగోళాన్ని సరిచేయడంలో ఇంకా అనేక మంది కృషి చేశారు. వారిలో కొందరు: పబ్లిక్ అసిస్టెన్స్

విభాగంలో కమిల్లె త్రీల్లార్డ్, పోస్ట్ ఆఫీస్‌లో జూల్స్ ఫోంటయిన్, పన్నుల విభాగంలో మారియస్ రెక్లస్, బెంజమిన్ గాస్టిన్యూ, జాతీయ ప్రింటింగ్ ప్రెస్‌లో లూయిస్–గిల్లౌమె డిబాక్. ఎలీ రెక్లస్, బెంజమిన్ గాస్టిన్యూలు జాతీయ లైబ్రరీని ప్రజలు ఉపయోగించుకునే విధంగా తీర్చిదిద్దారు. కళాకారుల సమాఖ్య చూసిన గెస్టావె కోర్బెట్, మ్యూజియంను ప్రజల వినోదం కోసం తెరిచాడు. కొద్దిమాసాలే ఉన్నా వారి కృషి శ్రామిక ప్రభుత్వ సామర్థ్యాన్ని కళ్లకు కట్టింది. మట్టి చేతులు వివిధ విభాగాలను కొద్ది మంది కోసం కాకుండా ప్రజలందరి ప్రయోజనాల కోసం ఏ విధంగా నడపగలరో చూపించింది.

## కమ్యూన్ పరిమితులు

ఈ కమ్యూన్ నాయకులంతా వివిధ రాజకీయ నేపథ్యాలనుండి వచ్చారు. లూయిస్ ఆగస్టె బ్లాంకి అనుయాయులున్నారు. పీర్రె–జోసెఫ్ ప్రౌధాన్ అనుచరులున్నారు. లూయిస్ మైఖేల్‌ను అనుసరించేవారున్నారు. మార్క్స్‌ను అనుసరించేవారు, ఇంటర్నేషనల్ సభ్యులు కొద్ది మంది మాత్రమే ఉన్నారు. కమ్యూన్ సభ్యులు వారివారి దృక్పథాలనుండి అనేక రకాల సంస్కరణలు తెచ్చారు. కాని వారికి ఒక సమగ్రమైన, స్పష్టమైన కార్యక్రమం మాత్రం లేదు.

ఇటువంటి కార్యక్రమం లేని విషయం బ్యాంక్ ఆఫ్ ఫ్రాన్స్ ద్వారాల వద్ద స్పష్టంగా కనిపించింది. లిస్సగరే ఇలా రాశాడు: 'మార్చి 19 నుండి బ్యాంకు గవర్నర్లు చావునీడలో బితుకుబితుకు మంటూ గడిపారు. డబ్బు ఎత్తుకుపోవడం ఖాయం అని వారు ప్రతిరోజూ అనుకునేవారు.' బ్యాంకులో కోట్లాది ఫ్రాంకులు మూలుగుతున్నాయి. దాన్నంతటినీ వెర్సైయిల్స్‌లోని ప్రతిఘాత – విప్లవ భూభాగానికి తరలించాలనే అలోచనే బ్యాంకర్లలో లేదు. వారి మీద ఎంతటి ఒత్తిడి ఏర్పడిందంటే బ్యాంకు గవర్నర్ గుస్తావ్ రౌలాండ్ మార్చి 23న పారిస్ వదిలి పారిపోయాడు. ఆయన బ్యాంకు భవనాన్ని అతని డిప్యూటీ అలెగ్జాండ్ర్ డి ప్లోక్‌కు వదిలిపెట్టేశాడు. ఎన్నికైన కమ్యూన్ నాయకుల పరిమితులను డి ప్లోక్ కనిపెట్టాడు. ఆయన చెప్పే లెక్కలు విని వారిలో చాలా మంది నోరెళ్లబెట్టారు. ఆయన వారికి ఒక్కో ఫ్రాంకు ఇచ్చాడు. కమ్యూన్ పనిని విస్తరించడానికీ, అది విఫలం కాకుండా చూడ్డానికీ కావలసినంత డబ్బుందన్న విషయం ఆయన వారికి అర్థమయ్యేట్లు చెప్పాడు.

డి ప్లోక్‌తో చర్చించడానికి ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ సభ్యుడు, పారిస్ కమ్యూన్ ప్రభుత్వ సీనియర్ సభ్యుడు చార్లెస్ బెస్లే వెళ్లాడు. బ్యాంకులో 'మీ దేశ సంపద' ఉంది, దాన్ని పవిత్రంగా చూడాలి. ఎంత పవిత్రంగా అంటే చర్చి ప్రజల నుండి లాక్కున్న సంపద కన్నా ఎక్కువ పవిత్రంగా చూడాలి అని డి ప్లోక్ చెప్పాడు. వెంటనే హోటల్ డి విల్లె లోని తన తోటి కమ్యూన్ సభ్యుల దగ్గరకు బెస్లే వచ్చాడు. వారికి ఈ క్రింది లంగుబాటు నోట్ సమర్పించాడు: 'బ్యాంకు దేశ సంపద. అది లేకపోతే పరిశ్రమలు పెట్టడం సాధ్యం కాదు. వాణిజ్యం ఉండదు. దాన్ని గనుక మీరు ఉల్లంఘిస్తే ఆ నోట్లన్నీ కేవలం చెల్లని–కాగితాలయిపోతాయి.' బ్యాంకును ఆక్రమించే ధైర్యం కమ్యూన్‌కు లేకపోయింది. దాన్ని ప్రజాతంత్ర నియంత్రణ కిందకు తెచ్చి దానిలోని సంపదను సామాజిక ప్రయోజనాల కోసం వాడే ధైర్యం చెయ్యలేకపోయింది. తరువాత దీనిపై ఏంగెల్స్ ఇలా రాశాడు: 'బ్యాంక్ ఆఫ్ ఫ్రాన్స్ గేట్ల బయటే వాళ్లు భక్తిపూర్వకంగా తలవంచుకుని నిలబడి పోవడం ఒకపట్టాన అర్థంకాని విషయం అయిపోయింది'.[5] అసలు విషయం ఏమంటే కమ్యూన్ సభ్యుల్లో ప్రబలంగా ఉండిన ఊహాజనిత సోషలిజం భావన వల్ల వారు ఆర్థిక వనరులు ప్రజాతంత్ర ప్రభుత్వానికి లోబడి ఉండాలనీ, బూర్జువా వర్గ హృదయ స్పందన అయిన సంపదను కార్మికవర్గం చేతుల్లోకి తీసుకోవాలనీ అర్థం చేసుకోలేకపోయారు.

## రాజ్యాన్ని ధ్వంసం చేయాలి

బ్యాంక్ ఆఫ్ ఫ్రాన్స్ పట్ల గౌరవభావంతోపాటు ఫ్రెంచ్ రాజ్య వ్యవస్థ పట్ల నమ్మకం కూడా ముందుకొచ్చింది. ఈ సందర్భంగా కారల్ మార్క్స్.. 1789 విప్లవం తరువాత తదుపరి విప్లవం సాధించాలంటే "బ్యూరాక్రాటిక్ సైనిక యంత్రాంగాన్ని ఒక చేతి నుండి మరో చేతికి మార్చడం కాదు దాన్ని ధ్వంసం చేయాలి' అని తను రాసిన '18వ బ్రూమైర్ ఆఫ్ లూయిస్ ***బోనపార్టీ***' గ్రంథంలో పేర్కొన్న విషయాన్ని క్రుగెల్‌మాన్ దృష్టికి తీసుకువచ్చాడు.

రాజ్యానికి చెందిన సంస్థల్లో వర్గ ఛాదస్తాలు ఘనీభవించాయి. ఆఫీసు నియమ నిబంధనల బంధనాల్లో అధికారులు అచేతనమైపోయారు. 72 రోజుల్లో వీటన్నిటినీ మార్చడం సాధ్యం కాకపోవచ్చు కానీ కమ్యూన్ దానికోసం ప్రయత్నం కూడా చేయలేదు. కమ్యూన్ కూలిపోయాక మార్క్స్ దీని గురించి ఇంటర్నేషనల్ నుద్దేశించి ఇలా చెప్పాడు: 'కార్మిక వర్గం రెడీమేడ్‌గా ఉన్న రాజ్య యంత్రాంగాన్ని

చేతబట్టుకుని తను స్వంత అవసరాలకు ఉపయోగించుకోవడం సాధ్యం కాదు.' అటువంటి యంత్రాంగం ప్రతీఘాత – విప్లవానికి దొంగతనంగా తోడ్పడే సాధనం (ట్రోజన్ హార్స్)గా మారిపోతుందని ఆయన హెచ్చరించాడు. ఎందుకంటే కొత్త ప్రభుత్వం ఎంతటి చిత్తశుద్ధితోనైనా ఉండనీ అది ప్రజల కోర్కెలకు అనుగుణంగా మార్పు చెందదు. మార్క్స్ ప్రసంగాన్ని 1891లో ఏంగెల్స్ ఒక కరపత్రంలో తన ముందు మాటతో పునర్ముద్రించాడు. అది ఈ పాయింటును మరింత స్పష్టంగా ఇలా చెప్పింది :

> కార్మిక వర్గం ఒకసారి అధికారాన్ని చేపట్టిన తరువాత పాత రాజ్య యంత్రంతో పనులు నిర్వహించలేదన్న విషయాన్ని కమ్యూన్ తెలుసుకున్నది. తను న్యాయబద్దంగా సాధించుకున్న ఆధిపత్యాన్ని తిరిగి పోగొట్టుకోకుండా ఉండాలంటే కార్మిక వర్గం గతంలో తనమీద ప్రయోగించబడిన పాత అణచివేత యంత్రాంగాన్ని వదిలించుకోవాలి. మరోవైపు ఎన్నికైన ప్రతినిధులను ఎటువంటి మినహాయింపులు లేకుండా ఏ క్షణంలోనైనా తిరిగి వెనక్కు పిలవచ్చునని ప్రకటించడం ద్వారా ఆ ప్రతినిధులు, అధికారుల నుండి తమను తాము రక్షించుకోవాలి.

ఆ తరువాత ఏంగెల్స్ సైద్ధాంతికంగా ఈ విషయాన్ని ఇలా ముగించాడు: 'వాస్తవానికి రాజ్యం అనేది ఒక వర్గం మరో వర్గాన్ని అణచి వేసే సాధనం మినహా మరేమీ కాదు. ప్రజాతంత్ర రిపబ్లిక్కులో కూడా అది రాచరికం కన్నా తక్కువగా ఏమీ ఉండదు.'

రెండు దశాబ్దాల తరువాత 1917 అక్టోబర్ విప్లవం మధ్యలో విఐ లెనిన్, కమ్యూన్‌పై మార్క్స్ చెప్పిన విషయాన్ని పునరుద్ఘాటిస్తూ వారసత్వంగా వచ్చిన రాజ్య యంత్రపు ప్రమాదాల గురించి విడమరిచాడు. పార్లమెంటరీ వ్యవస్థను కాదు పాత రాజ్య సంస్థలను ధ్వంసం చేసి వాటి స్థానంలో కార్మిక వర్గ ప్రభుత్వ కొత్త సంస్థలను స్థాపించుకోవాలి అని ఆయన రాశాడు. జారు చక్రవర్తి పాలనలో 1905 రష్యన్ విప్లవంలో రష్యన్ కార్మికులు సోవియట్‌లు అనే ప్రాతినిధ్య ప్రభుత్వాలను, పరిపాలనను సృష్టించుకున్నారు. 1908లో కమ్యూన్ గురించీ, 1905 రష్యన్ విప్లవం గురించీ లెనిన్ ఇలా రాశాడు: 'సోషలిస్టు విప్లవ లక్ష్యాలను నిర్దిష్టంగా ప్రకటించాల్సిన అవసరాన్ని గురించి ఐరోపా కార్మికవర్గానికి కమ్యూన్ బోధించింది.' విప్లవం అనేది తక్షణ ప్రజాస్వామిక ఆశలను నెరవేర్చడం, మానవ అవసరాలను తీర్చడం అనే సమస్యలను పరిష్కరించాలి.[6] కమ్యూన్ అనేది గొప్ప ముందడుగు అయితే సోవియట్

ఆ కమ్యూన్‌నుండి మరింత ముందుకు వెళ్లింది. 'రాజ్యం, విప్లవం' అనే గ్రంథంలో లెనిన్ కమ్యూన్ యొక్క ప్రజాస్వామిక విధానాలను గురించి ఇలా వివరించాడు :

> అందువల్ల, కమ్యూన్ అనేది ధ్వంసం చేయబడ్డ రాజ్య యంత్రం స్థానంలో 'కేవలం' పూర్తిస్థాయి ప్రజాస్వామ్యాన్ని ప్రవేశపెట్టింది. రెగ్యులర్ సైన్యాన్ని రద్దు చేసింది. అధికారులందరూ ఎన్నికవ్వాలని, వారిని తిరిగి వెనక్కి పిలవచ్చునని నిర్దేశించింది. కాని వాస్తవంగా ఈ 'కేవలం' అనేది కొన్ని సంస్థల స్థానంలో మౌలికంగా భిన్నమైన సంస్థలను నెలకొల్పడాన్ని సూచించింది. 'పరిణామాత్మక మార్పు గుణాత్మక మార్పుకు దారితీస్తుందన్న దానికి' ఇది కచ్చితమైన ఉదాహరణ. అన్ని స్థాయిల్లో ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా, నిరంతరాయంగా ప్రవేశపెట్టడం వల్ల బూర్జువా ప్రజాస్వామ్యం కాస్తా కార్మికవర్గ ప్రజాస్వామ్యంగా రూపాంతరం చెందింది. రాజ్యం (= ఒకానొక వర్గాన్ని అణచి వేసే ప్రత్యేక శక్తి) కాస్తా ఇంకెంతమాత్రం రాజ్యం కాని రూపానికి మారింది.

కమ్యూన్ గురించి కుగెల్‌మాన్‌కు రాస్తూ : 'చరిత్రలో ఇటువంటి మహత్తర ఉదాహరణ మరొకటి ఉండదు' అని కారల్ మార్క్స్ పేర్కొన్నాడు. అయితే ఇక్కడ ఆయన ఒక పొరపాటు పడ్డాడు. పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా కార్మికవర్గం అత్యంత వీరోచితంగా చేసిన పోరాటాలు, అణచివేత ప్రభుత్వాల స్థానంలో కొత్త ప్రజాతంత్ర రూపాలు గల ప్రభుత్వాలు ప్రతిష్టాపించడానికి ప్రయత్నాలు అనేకం జరిగాయి. 18వ శతాబ్దం చివరిలో హైతీ కార్మిక వర్గం ప్లాంటేషన్ పెట్టుబడిదారులపై తిరుగుబాటు చేసి ప్లాంటేషన్ యజమానుల పాలన నుండి విముక్తి సాధించారు. వారు కొత్త ప్రభుత్వ రూపాలను సృష్టించడానికి ప్రయత్నించారు. ఇటువంటి పరిపాలనల్లో కొన్ని అప్పటికే వెట్టిచాకిరి నుండి తప్పించుకుని తమదైన శైలిలో ఏర్పాటు చేసుకున్న సమసమాజాలను పోలి ఉన్నాయి. కార్మికవర్గ తిరుగుబాట్ల కాలంలో ప్రజాతంత్ర సంస్థలు ఎలా పుట్టుకొస్తాయో ఈ ఉదాహరణలు మనకు తెలియజేస్తాయి. హైతీ (1804) నుండి షాంఘై కమ్యూన్ వరకు వరుసగా అనేక ప్రయోగాలు జరిగాయి. ఇటువంటి ఉదాహరణలను మనం క్షుణ్ణంగా అధ్యయనం చేసినప్పుడే మనకు మౌలిక, కార్మికవర్గ విప్లవాల పరిమితులేమిటో, కార్మికవర్గ ప్రజాస్వామ్యాన్ని ఇంకా మెరుగుగా ఎలా నిర్మించవచ్చో అర్థమవుతుంది.

## ఆగిపోయిన విప్లవం

కార్మికులు పారిస్‌నైతే స్వాధీనం చేసుకున్నారు గానీ దాని బ్యాంకును స్వాధీనం చేసుకోలేదు. అంతే కాకుండా వారు తమ శక్తులన్నిటినీ కూడగట్టి బూర్జువా ప్రభుత్వాన్ని లంగదీసుకోడానికి వెర్సయిల్స్‌ను ముట్టడించలేదు. అడోల్ఫ్ థయర్స్ ప్రభుత్వాన్ని కొనసాగనివ్వడం ద్వారా పారిస్ కమ్యూన్ తన విధ్వంసాన్ని తనే కొని తెచ్చుకుంది. కమ్యూన్ ఏర్పడిన కొద్ది వారాలకే ఈ పరిణామాల పట్ల మార్క్స్ ఆగ్రహానికి గురయ్యాడు. ఆయన కుగెల్‌మాన్‌కు ఇలా రాశాడు :

> వారు ఓడిపోతే దానికి కారణం వారి మంచితనమే అవుతుంది. వాళ్లు వెనువెంటనే వెర్సయిల్స్‌కు దండయాత్రకు వెళ్లాల్సింది. అప్పుడు పారిస్ నేషనల్ గార్డ్స్‌కు చెందిన అభివృద్ధి నిరోధక సెక్షన్లు వెనక్కు తగ్గేవి. మనఃస్సాక్షి సృష్టించిన అడ్డంకులతో వాళ్లు మంచి తరుణాన్ని చేజార్చుకున్నారు. ఒకవైపు జిత్తులమారి థయర్స్ పారిస్ పౌరులను నిరాయుధులను చేయడం ద్వారా అంతర్యుద్ధాన్ని ప్రారంభించాడు కాని వాళ్లు మాత్రం అంతర్యుద్ధాన్ని ప్రారంభించ లేదు.

కమ్యూన్ అచేతనత్వం వల్ల థయర్స్ ప్రభుత్వం, దాని సాయుధ దళాలు వెర్సైయిల్స్‌ను స్వాధీనం చేసుకున్నాయి. వెర్సయిల్స్ దళాలు పారిస్ వదిలి వెళ్లకుండా కమ్యూనార్డ్స్ అడ్డుకోవలసింది. వాళ్లను నగరంలోనే ఉంచేసి ఉంటే సైనికుల్లో మెజారిటీ కమ్యూన్‌వైపు వచ్చేసేవారు. కానీ ఇది జరగలేదు.

దీని గుణపాఠం ఇతర విప్లవకారులపై ముద్ర వేసింది. అక్టోబర్ విప్లవం తరువాత అభివృద్ధి నిరోధక పాత వర్గాల, సామ్రాజ్యవాద సైన్యానికి వ్యతిరేకంగా సోవియట్లు కార్మిక రైతాంగ సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. విప్లవ శక్తులు ప్రతిపక్షాలను చీలదీసి, తమ శక్తిని పెంచుకోకపోతే విప్లవం నాశనమైపోతుందన్న విషయం స్పష్టం. పారిస్ కమ్యూన్ విధ్వంసం మనకు నేర్పుతున్న కీలకమైన గుణపాఠం ఇది.

థయర్స్, ఆయన అభివృద్ధి నిరోధక ప్రభుత్వం ప్రష్యన్లతో రాజీకి వచ్చి, వారి ఆధీనంలోని ఫ్రెంచ్ సైన్యాన్ని తిరిగి తీసుకుని, తన స్వంత సైన్యాన్ని బలపరుచుకుని, పారిస్ మీద దాడికి దిగింది. కమ్యూనార్డ్‌లు బారికేడ్లు నిర్మించి దాడిని కాచుకోడానికి సిద్ధమైనారు. మే 22, మే 28 మధ్య జరిగిన ఈ దాడిని వారు

నిలువరించలేకపోయారు. నగరంపై పట్టు కోల్పోయారు. నగరంలోని ప్రతి వీధి యుద్ధ భూమిగా మారింది. కానీ ప్రతి యుద్ధంలోనూ కమ్యూనార్డ్లు ఇంకా ఇంకా వెనక్కు తగ్గాల్సి వచ్చింది. బూర్జువా సైన్యం కర్కశంగా వ్యవహరించింది. కమ్యూనార్డ్లను దొరికిన వారిని దొరికి నట్లు చంపేశారు. వీధులను రక్తంలో నింపేశారు. వెర్సయిల్స్ సైనికులు 'ఒక్కొక్క హంతకుడుగా మారిపోయారు' అని లిస్సాగరే రాశాడు. మోంట్‌మర్ట్రె వద్ద మహిళా కమ్యూనార్డ్లు కొన్ని గంటల పాటు శత్రువును నిలువరించారు. జనరల్ జస్టిన్ క్లించాంట్ దళాలు వారిని ఓడించాయి. ఆ ప్రాంత కమ్యూనార్డ్ల నాయకుణ్ణి వెర్సయిల్స్ దళాల ముందుకు తెచ్చారు. 'నీ వెవరు' అని కమాండింగ్ ఆఫీసర్ అడిగాడు. 'నా పేరు లెవెక్యూ. తాపీ పనివాడిని. కేంద్ర కమిటీ సభ్యుణ్ణి' అని సమాధానం చెప్పాడు. 'తాపీ పనోడు ఫ్రాన్స్ పాలించాలనుకుంటున్నాడు' అని ఘీంకరించాడు కమాండింగ్ ఆఫీసర్. బూర్జువా వర్గపు తలపొగరు అలా ఉండింది. లివెక్యూ ముఖం మీద కాల్చేశారు.

కమ్యూనార్డ్లను సైన్యం పెరె లాచైస్ శ్మశానవాటికకు తీసుకుపోయారు. అక్కడ వారిని వరుసలో నిలబెట్టి కాల్చేశారు. జెనరల్ గాస్టోన్ అలెగ్జాండ్రె ఆగస్టె మార్క్విస్ డి గాల్లిఫెట్ ఈ నరహంతక మూకలకు నాయకత్వం వహించాడు. తరువాత అతన్ని ఆల్జీరియాలో నియమించారు. అతను కమ్యూనార్డ్లపై తను ప్రదర్శించిన మారణకాండ నైపుణ్యాలను ఉత్తర ఆఫ్రికాలోని నైజీరియాలో ఫ్రాన్స్ సామ్రాజ్యవాద విస్తరణకోసం ప్రజలపై ప్రదర్శించాడు. పారిస్ స్మశాసన వాటికలో 'కమ్యూనార్డ్ల గోడ' పూర్తిగా వారి రక్త చారికలతో నిండిపోయింది. ఈ మారణకాండ జరిగిన 150 సంవత్సరాల తరువాత కూడా అక్కడ బుల్లెట్ రంధ్రాలు ఇప్పటికీ కనిపిస్తాయి. వెర్సయిల్స్ సైన్యం ఒక్క వారంలోనే 40,000 మంది పారిస్ పౌరులను వధించాయి. 'అంత పెద్ద సంఖ్యలో మృతదేహాలను పాతిపెట్టడం చాలా కష్టం అయిపోయింది' అని లిస్సాగరే రాశాడు. 'వాటిని గోడలకు అనుకొని ఉన్న గదుల్లో దహనం చేశారు. కానీ గాలి లేకపోవడం వల్ల మంటలు మధ్యలోనే ఆగిపోయి మృత దేహాలు గుజ్జులా మారిపోయాయి. బట్టెస్ చామోంట్‌లో మృత దేశాలు పెద్ద పెద్ద గుట్టలుగా పడ్డాయి. వాటి మీద పెట్రోలియం పోసి బహిరంగంగాంగానే తగలబెట్టారు' అని రాశాడు.

రక్తమోడిన పారిస్ వీధుల్లో అడోల్ఫ్ థియెర్స్ తిరుగాడుతూ 'పారిస్ నేల వారి శవాలతో నిండిపోయింది. పారిస్ కమ్యూన్ పక్షాన తిరుగుబాటు చేయాలనుకున్న

వారికి ఈ భయంకర దృశ్యం ఒక గుణపాఠంగా మిగులుతుంది' అని అన్నాడు. అది మే 25న జరిగింది. మూడు రోజుల తరువాత మే 28న పారిస్ కమ్యూన్ పతనమైంది.

## ప్రతి ఓటమీ కార్మికవర్గానికి ఒక పాఠమే

కమ్యూన్ కేవలం రెండు మాసాలు మాత్రమే ఉంది. కమ్యూనార్డ్‌ల మృతదేహాల మీద ఫ్రెంచ్ బూర్జువా వర్గం పవిత్ర హృదయం (సాక్రె క్యూయెర్) అనేక ఒక మహా బేసిలికా నిర్మించింది. 'పారిస్ కమ్యూన్ నేరాలను ప్రాయశ్చిత్త పరచడం' కోసం ఈ బేసిలికా నిర్మిచినట్లు కాథలిక్ చర్చి పేర్కొన్నది. ఈ రోజు పారిస్‌లో కనిపించే ఈ భారీ నిర్మాణం వెనుక నున్న క్రూరమైన చరిత్రను గురించి మాత్రం చెప్పడం లేదు. బూర్జువాల దృష్టిలో తిరుగుబాటు చేయడమే కమ్యూనార్డ్‌ల పాపం, అందువల్ల వారి చావుకు వారే కారణం. కానీ తిరుగుబాటు తనంత తాను చనిపోలేదు. దాన్ని ప్రతికారేచ్ఛతో రగిలిపోయిన బూర్జువా వర్గం చంపేసింది. కార్మికవర్గం ఎంతో తీవ్రంగా పోరాడి సాధించుకున్న సార్వభౌమత్వాన్ని వాళ్లు తమ చేతుల్లోకి లాక్కుని తమ స్వంత ప్రయోజనానికి అనుగుణంగా నిర్మించదలుచుకున్నారు. పారిస్ కమ్యూన్ సాధించిన ప్రజాతంత్ర విజయాలను పక్కన పెట్టేయదలచుకున్నారు. వాటి జ్ఞాపకాలను బేసిలికా కింద పాతరేయదలచుకున్నారు.

కుగెల్మాన్‌కు మార్క్స్ రాసిన ఉత్తరాల సంకలనానికి లెనిన్ ముందుమాట రాస్తూ ఈ విధంగా పేర్కొన్నాడు: 'ప్రజల పోరాటాలు, అవి ఎంత నిరాశాజనకమైన లక్ష్యంకోసమైనా జరగనీ, ఆ ప్రజలు భవిష్యత్తులో పాఠాలు నేర్చుకోడానికీ, తదుపరి పోరాటాలకు శిక్షణ పొందడానికీ ఉపయోగపడతాయి అని మార్క్స్ హర్షించాడు'.[7] కమ్యూన్ గుణపాఠం కేవలం పారిస్ ప్రజలకూ, ఫ్రాన్స్‌కు మాత్రమే పరిమితమైనది కాదు. అది మొత్తం అంతర్జాతీయ కార్మిక వర్గానికి గొప్ప పాఠం. మానవాళి సంశయాలను తీర్చి సోషలిజానికి పురోగమించే క్రమంలో ఇదో సెల్ఫ్-ఎడ్యుకేషన్. ఈ తిరుగుబాటు 40వ వార్షికోత్సవం సందర్భంగా 1911లో లెనిన్ ఇలా రాశాడు: 'కమ్యూన్ లక్ష్యం సామాజిక విప్లవం, కార్మికుల పరిపూర్ణ రాజకీయ, ఆర్థిక విముక్తి. అది మొత్తం ప్రపంచ కార్మికవర్గ లక్ష్యం. ఆ విధంగా చూసుకున్నప్పుడు దానికి చావులేదు.'[8]

# నోట్స్


1. లుడ్విగ్ కుగెల్మాన్‌కు కారల్ మార్క్స్ రాసిన లేఖ, 1871 ఏప్రిల్ 12, కుగెల్మాన్‌కు ఉత్తరాలు, కారల్ మార్క్స్, న్యూయార్క్: ఇంటర్నేషనల్ పబ్లిషర్స్, 1934.

2. కారల్ మార్క్స్, 'ది ఎయిటీన్త్ బ్రూమైర్ ఆఫ్ లూయిస్ **బోనపార్టీ**', 1852 మరియు కారల్ మార్క్స్ 'ది క్లాస్ స్ట్రగుల్స్ ఇన్ ఫ్రాన్స్, 1848–1850', 1895.

3. జాక్వెస్ రోగెరీ, 'లా కమ్యూనె దా 1871, పారిస్ : ప్రెస్సెస్ యూనివర్సిటైర్స్ డి ఫ్రాన్స్, 2014; జాక్వెస్ రోగెరీ, పారిస్ లిబ్రె 1871, పారిస్: ఎడిషన్స్ డు సెయుల్ 2004.

4. ప్రోస్పెర్‌ఓలివీర్ లిస్సాగరే, 'హిస్టాయిరే డి లా కమ్యూన్ డి 1871,' 1876, ఎలీనోర్ మార్క్స్ అనువదించినది. ఎవరు పేర్కొన్నారో చెప్పకుండా ఇందులో ఉటంకించిన కొటేషన్లన్నీ ఈ పుస్తకం నుండి గ్రహించినవే.

5. కారల్ మార్క్స్, 'ఫ్రాన్స్‌లో అంతర్యుద్ధం, 1891'కి ఫ్రెడరిక్ ఎంగెల్స్ చేసిన కూర్పు.

6. వి.ఐ. లెనిన్ 'కమ్యూన్ గుణపాఠాలు', జెగ్రనిచెన్యా గజెటా, నెం 2, మార్చి 1908.

7. 'కుగెల్మాన్‌కు ఉత్తరాలు' పుస్తకానికి వి.ఐ. లెనిన్ రాసిన ముందుమాట.

8. వి.ఐ. లెనిన్, 'కమ్యూన్ జ్ఞాపకాల్లో', రబోచయా గజెటా, నెం 4–5 ఏప్రిల్ 1911.


പഴമതൻ വിലങ്ങു പൂട്ടിയിടുകയില്ല നമ്മളെ
അടിമകൾ നുകം വലിച്ചെറിഞ്ഞുയർത്തെണീക്കുവിൻ,
പുതിയതാം തറയ്ക്കു മീതെയുലകമിനിയുയർന്നിടും.
ഇന്നലെവരെയൊന്നുമല്ല നമ്മൾ, ഇന്നു തൊട്ടു നമ്മളാകുമെല്ലാം.
*Agrupémonos todos, en la lucha final,*
*y se alcen los pueblos,*
*por la Internacional.*

# ప్రకాశవంతమైన పుష్పం

## టింగ్ చాక్

1871 మే 16న నెపోలియన్ సామ్రాజ్యవాద కాలం నాటి నిర్మాణం, వెడోమ్ కాలమ్ కమ్యూనార్డ్ల వశమైంది. ఆ భవనం పేరును వారు 'ప్లేస్ ఇంటర్నేషనేల్' అని మార్చారు.

దానికి రెండు దశాబ్దాల పూర్వం 'పద్దెనిమిదవ బ్రూమెయిర్ ఆఫ్ లూయిస్ బోనపార్టె (1852) గ్రంథంలో కారల్ మార్క్స్ ఈ విధంగా చెప్పాడు: 'కానీ సామ్రాజ్యం చివరికి లూయిస్ బోనపార్టె భుజాలమీదకు ఒరిగినప్పుడు వెండోమ్ కాలమ్ శిఖరం నుండి నెపోలియన్ కంచు విగ్రహం నేల కూలిపోతుంది.' నిజంగానే అది నేల కూలింది.

దాన్ని కూల్చినవారిలో ఫ్రెంచ్ సోషలిస్టు పెయింటర్, కమ్యూన్ కార్యకర్త గుస్టావ్ కోర్బెట్ (1819-1877) ఒకడు. ఆయన విలాసవంతమైన బూర్జువా జీవన సరళిని విమర్శిస్తూ, రైతాంగ శ్రమైక జీవనాన్ని దృశ్యీకరిస్తూ చేసిన రచనలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. కోర్బెట్ జీవితం, కృషిలో రెండు ప్రధానమైన పరిణామాలున్నాయి. మొదటిది 1848 ఫ్రెంచి విప్లవం. అందులో కార్మికవర్గం తనంత తాను ఒక శక్తిగా ఎదిగింది. రెండవది, 1871 పారిస్ కమ్యూన్. దీన్ని ఆయన 'అందమైన కల'గా వర్ణించాడు. పారిస్ కమ్యూన్‌లో కళాకారుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడుగా, కార్మికవర్గ నాయకత్వంలోని ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిగా ఆయన ఎన్నికయ్యారు. ఈ సామ్రాజ్యవాద - వ్యతిరేక చర్యకుగాను ఆయనకు ఆరుమాసాల జైలు శిక్ష  అనేకరకాల జరిమానాలు విధించారు. జరీమానాలు కట్టలేక ఆయన జీవితాంతం అప్పులపాలైనాడు.

కమ్యూన్ కాలంలో కోర్బెట్ నాయకత్వంలోని కళాకారుల ఫెడరేషన్.. విద్య మీద, పాత స్మారక భవనాలు కూల్చి వాటి స్థానంలో కొత్త స్మారకాల నిర్మాణ పద్ధతులు, వాటి సౌందర్యం ఎలా ఉండాలి, నిర్మిణం ఎలా చేయాలి అన్న దాని మీద అనేక చర్చలు జరిపింది, ముసాయిదా పత్రాలు తయారు చేసింది. కార్మికవర్గ ఉద్యమం సాంస్కృతిక, సైద్ధాంతిక, సంస్థాగత పునాదుల మీద కూడా జరుగుతుందని వారికి బాగా తెలుసు. విప్లవోద్యమంలో కళాకారులు కూడా ఇతరులతోపాటు మిలిటెంట్లుగా ఉండాలని వారు అర్థం చేసుకున్నారు.

పారిస్ తిరుగుబాటుకు కొన్ని మాసాల ముందు జర్మనీ సైన్యాన్ని, కళాకారులను ఉద్దేశించి కోర్బెట్ ఇలా రాశాడు: 'వినండి: మీ ఫిరంగులు మాకు విడిచిపెట్టండి వాటిని మేమంతా కలిసి కరిగించి మాకు ఫిరంగులుగా మార్చుకుంటాం. చిట్ట చివరి ఫిరంగిని తల్లకిందులుచేసి దాని మీద ఫ్రిజియన్ టోపీ కప్పి దాన్ని మూడు ఫిరంగి గుళ్లతో చేసిన పీఠం మీద పెడతాము. వెండోమ్ ప్లేస్‌లో మేమందరం కలిసి నెలకొల్పే ఈ మహత్తర స్మారక చిహ్నం మీకోసం, మాకోసం. అది ప్రజల స్మారక చిహ్నం.' పాత చిహ్నాల స్థానంలో కొత్తవి నెలకొల్పాలనేది వారి సంకల్పం. ప్రపంచ కార్మికుల కోసం 'సామాజిక సంపదను ఆవిష్కరించాలి' అని వారు భావించారు.

47 మంది చిత్రకారులు, శిల్పకారులు, నిర్మాణ నిపుణులు, అలంకరణ కళాకారులు ఏకమై తమ లక్ష్యాన్ని ప్రకటించారు. విద్య, చిహ్నాలు, మ్యూజియంల ద్వారా భవిష్యత్తును పునరుద్ధరించడం కోసం గత కాలపు సంపదను కాపాడ్డం, ప్రస్తుత అవసరాలపై దృష్టి సారించడం తమ లక్ష్యమని ప్రకటించారు. కళాకారుల సమాఖ్య వ్యవస్థాపక సభ్యుల్లో కవి యూజిన్ పోట్టర్ కూడా ఉన్నాడు. 72 రోజుల కార్మిక రాజ్యాన్ని 1871 మే 28న పరిసమాప్తం చేసిన క్రూర ఊచకోతను గురించి పోట్టర్ కవిత రాశాడు. ఈ కవితే ప్రపంచంలో అత్యధిక మంది గానం చేసిన 'అంతర్జాతీయ గీతం'. లెక్కలేనన్ని భాషల్లోకి తర్జుమా అయిన ఈ గీతం యొక్క కొన్ని భాషానువాదాలను ఈ పుస్తకం చివరిలో ఇవ్వడం జరిగింది. పారిస్ కమ్యూన్ నాటి నుండి ఈ గీతం అనేక దేశాల్లో పోరాటాలకు స్ఫూర్తినిస్తూ ఉన్నది. అన్ని భాషల్లోనూ ఆలపించడం ద్వారా ఈ గీతం పరిపూర్ణతను సాధించింది. నిజమైన అంతర్జాతీయ గీతంగా వెలుగొందుతోంది.

ఈ ఊచకోత జరిగిన అర్ద శతాబ్దం తరువాత పారిస్ కమ్యూన్ 55వ వార్షికోత్సవం సందర్భంగా 10,000 మంది చైనా కార్మికులు, రైతులు దక్షిణాదిలోని గువాంగ్ డాంగ్ రాష్ట్రంలో సమీకృతులయ్యారు. కమ్యూన్ స్ఫూర్తితో రైతులు, కార్మికులు, విప్లవ సైనికుల మధ్య ఏర్పడిన సంఘటన 1927లో అనేక ప్రజా తిరుగుబాట్లకు నాయకత్వం వహించింది. ఈ తిరుగుబాట్లు శతాబ్దపు విప్లవ పోరాటాన్ని మలుపుతిప్పింది. విపరీతమైన వర్షంలో కూడా కమ్యూన్ జ్ఞాపకార్థం జరిగిన మహా ప్రదర్శనలో వారు 'అంతర్జాతీయ గీతాన్ని' ఆలపించారు. వివె లా కమ్యూన్ డి పారిస్ (పారిస్ కమ్యూన్ వర్థిల్లాలి) అంటూ నినాదాలు చేశారు. మావో జె డాంగ్ ప్రసంగంలో కమ్యూన్ ఓటమి గురించి మాట్లాడలేదు. దాని స్ఫూర్తిని గుర్తు చేసుకున్నాడు. పారిస్ కమ్యూన్ ఒక 'ప్రకాశవంతమైన పుష్పం' అయితే అక్టోబర్ విప్లవం దానికి పూచిన 'ఆనందకర ఫలం' అని ఆయన పేర్కొన్నాడు. చైనా ప్రజలనూ, దేశాన్నీ విప్లవంవైపు నడింపించడానికి 23 సంవత్సరాల ముందు ఆయన ఈ మాటలు చెప్పాడు.

ఈ పుస్తకంలో మీరు ఈ సంప్రదాయాన్ని పదాల ద్వారా, చిత్రాలు, పాటల ద్వారా తెలియజెప్పే ఎన్నో విషయాలను గమనిస్తారు. పాత సామ్రాజ్యవాదపు శిధిలాల్లో మనకు 'ప్రకాశవంతమైన పుష్పం' కనిపిస్తుంది. ఈ పుష్పం నుండి అనేక ఫలాలు వచ్చాయి, ఇక ముందు కూడా వస్తాయి. 'మన ఆదేశాలతోనే మన భవిష్యత్తు నిర్మించబడాలి' అని బ్రెచ్ట్ తన 'కమ్యూనార్డ్ల విప్లవం' అన్న గీతంలో పేర్కొన్నట్లు ప్రజాపోరాట చిహ్నాలుగా ప్రజా కళలు ఆ ఉజ్వల భవిష్యత్తుకు దారి చూపుతాయి.


தொன்றுதொட்டு ழைத்ததொழி லாளிகள் விவசாயிகள்
தோழராயினோம் உழைபோர் யாவரேனும் ஓர்குலம்
உண்டு நம் உழைப்பிலே உயர்ந்தவர்க்குச் சொல்லுவோம்
உழைப்பவர்கள் யாவருக்கும் சொந்தமிந்த உலகெளாம்
So comrades, come rally
And the last fight let us face
The Internationale unites the human race.

# 1871 ఫ్రాన్సు అంతర్యుద్ధంపై అంతర్జాతీయ కార్మిక సంస్థ జనరల్ కౌన్సిల్ ప్రసంగం

## యూరోప్, అమెరికాలలోని కార్మిక సంస్థ సభ్యులందరికి

**- కారల్ మార్క్స్**

1870 సెప్టెంబరు 4న, పారిస్‌లోని కార్మిక ప్రజలు, రిపబ్లిక్‌ను ప్రకటించారు. యూరప్‌లోని యావన్మంది వెన్వెంటనే ఒక్క మినహాయింపు లేకుండా ఇందుకు హర్షం వెలిబుచ్చారు. అదే సమయంలో, అధికారం కోసం అర్రులు చాచే కొందరు న్యాయవాదుల ముఠా, హోటల్ డీ విల్లెని స్వాధీనం చేసుకున్నారు. వారి రాజకీయ నాయకుడు థయర్స్, వారి సేనాని ట్రోచు. అన్ని చారిత్రక సంక్షోభ సమయాల్లోనూ ఫ్రాన్సు తరపున ప్రాతినిధ్యం వహించే అర్హత పారిస్ నగరానికి మాత్రమే ఉన్నదని వారు దృఢంగా విశ్వసించారు. ఒకప్పుడు పారిస్ ప్రతినిధులుగా ఉండడమే ఇప్పుడు ఫ్రాన్స్ గవర్నర్లుగా ఉండడానికి తమకు లభించిన ఆర్హత అని వారు భావిస్తారు. తిరుగుబాటు జరిగిన అయిదు రోజుల తరువాత, గత యుద్ధాన్ని గురించి మేము చేసిన రెండవ ప్రసంగంలో ఈ వ్యక్తుల స్వభావం ఏమిటో మీకు వివరించాను. ఆనాటి ఆకస్మిక ఘటనల నేపథ్యంలో, కార్మికవర్గ నిజమైన నాయకులు ఇంకా బోనపార్టిస్టు జైళ్ళలోనే మగ్గుతున్న సమయంలో వీరు అధికారం చేపట్టినప్పుడు ఆ అధికారాన్ని వాళ్లు దేశ రక్షణ కోసం ఉపయోగిస్తారన్న ఏకైక నమ్మకంతో పారిస్ ప్రజలు సహించారు. కానీ కార్మికులను సాయుధం చేయకుండా, వారిని సమర్థవంతమైన శక్తిగా రూపొందించకుండా, యుద్ధం ద్వారానే వారికి తరిఫీదు

ఇవ్వకుండా, పారిస్‌ను శత్రుదాడినుండి రక్షించుకోవటం సాధ్యం కాదు. కాని పారిస్‌ను సాయుధం చేయడమంటే విప్లవాన్ని సాయుధం చేయడమే. ప్రష్యన్ దురాక్రమణ దారునికి వ్యతిరేకంగా ఫ్రెంచి కార్మికులు విజయం సాధించడమంటే, ఫ్రెంచి పెట్టుబడి దారులపైనా, ప్రభుత్వంలోని వారి పరాన్నభుక్కులైన ప్రతినిధులపైనా ఫ్రెంచి కార్మికవర్గం విజయం సాధించడమే. జాతీయ రక్షణ, వర్గప్రయోజనాల మధ్య ఏర్పడిన ఈ ఘర్షణలో, జాతీయ రక్షణకై ఏర్పడిన ప్రభుత్వం, ఒక్క క్షణకాలం కూడా తటపటాయించకుండా జాతీయ విద్రోహ ప్రభుత్వంగా మారిపోయింది.

వారు మొట్టమొదటిగా యూరపులోని అన్ని దేశాలకు థయర్స్‌ను సంచార రాయబారిగా పంపారు. రిపబ్లిక్ స్థానంలో రాజును గద్దెనెక్కించే ప్రాతిపదికపై రాజీకి దురాక్రమణ దారులను ఒప్పించ వలసిందిగా ఆ దేశాధినేతలను ప్రాధేయపడ్డారు. ముట్టడి ప్రారంభమైన నాలుగు నెలలకు ట్రోచు మొదటిసారిగా లొంగుబాటు సంకేతం పంపాడు. పారిస్, నగర మేయర్ల (వార్డు సభ్యుల) నుద్దేశించి జూల్స్ ఫవ్రె సమక్షంలో ట్రోచు ఇలా అన్నాడు :

"సెప్టెంబరు 4వ తేదీ సాయంత్రం నా సహచరులు నాకు వేసిన మొదటి ప్రశ్న ఏమంటే, ప్రష్యన్ సైన్యం ముట్టడిని పారిస్ జయప్రదంగా నిలువరించగలదా అని. నిలువరించలేదు అని నేను నిర్మొహమాటంగా సమాధానం చెప్పాను. ఇక్కడ సమావేశమైన సహచరులలో కొందరు నా మాటలోని నిజాయితీని విశ్వసిస్తారని, నా అభిప్రాయ తీవ్రతను మన్నిస్తారని ఆశిస్తున్నాను. ప్రస్తుత పరిస్థితులలో ప్రష్యన్ సైన్యం ముట్టడిని ప్రతిఘటించ ప్రయత్నించడం కేవలం తెలివితక్కువ అవుతుందని నేను వారికి చెప్పాను.. నేనింకా ఇలా అన్నాను : నిస్సందేహంగా అది సాహసంతో కూడిన తెలివి తక్కువ పని ఔతుంది. దాంతో ఆఖరైపోతుంది... తరువాత జరిగిన ఘటనలు (ఇవన్నీ వారు సృష్టించినవే), నా మాటలు సత్యమని నిరూపించాయి."

ట్రోచు చేసిన ఈ చిన్న ప్రసంగాన్ని ఆ సమావేశానికి హాజరైన యం.కార్బన్ అనే ఒక మేయర్ ఆ తర్వాత ప్రచురించాడు.

ఆ విధంగా రిపబ్లిక్ ప్రకటించబడిన మొదటి సాయంత్రమే, ట్రోచు పారిస్ లొంగుబాటుకు "పథకం" వేస్తున్నాడని అతని సహచరులకు తెలిసిపోయింది. జాతీయ రక్షణ అనే నినాదం థయర్స్ స్వంత ప్రభుత్వానికి ఒక ముసుగు మాత్రమే. సెప్టెంబర్ నాలుగున తిరుగుబాటులో అకస్మాత్తుగా ప్రత్యక్షమయిన ఫవ్రె అతని ముఠా 5 తేదీకి చేతులెత్తేసేవారు. పారిస్ ప్రజలను ట్రోచు 'ప్లాన్'లో పావులుగా మార్చేవారు. వెంటనే లొంగిపొండి లేక మీ చావు మీరు చావండి అని పక్కకు తప్పుకునే వారు.

కాని వారు ఇవేమీ చేయలేదు. ఈ వంచకులు పారిస్‌ను కరువు కాటకాల పాలు చేశారు. ఈతిబాధలకు గురిచేశారు. మరోవైపు "ఏదిఏమైనా పారిస్ గవర్నరైన నేను లొంగిపోను" అని ట్రోచు, "ఒక్క అంగుళం భూభాగాన్ని కూడా వదిలిపెట్టను. కోటలలోని ఒక్క రాతి ముక్కను కూడా వదలుకోను" అని విదేశాంగ మంత్రి జూల్స్ ఫెవ్రే బూటకపు ప్రకటనలు చేశారు.

గాంబెట్టాకు రాసిన లేఖలో ఈ జూల్స్ ఫెవ్రే తన నిజ స్వభావాన్ని బట్టబయలు చేశాడు. ప్రష్యన్ సైనికులకు వ్యతిరేకంగా కాక, పారిస్ కార్మికులకు వ్యతిరేకంగా తాము రక్షణ చర్యలు సాగిస్తున్నామని అతడు ప్రకటించాడు. పారిస్ సైన్యం మీద అధిపత్యం కలిగిన ఈ బోనపార్టిస్టు హంతకులు, ముట్టడిలో ఉన్న పారిస్ రక్షణ పట్ల ఎంతో ఏహ్య భావంతో, అపహాస్యంతో ఉన్నారు. (ఉదాహరణకు, పారిస్ రక్షణ సైన్యంలోని ఫిరంగి దళ సర్వసేనాని ఆల్ఫోన్స్ సైమన్ గుయడ్, ఫిరంగి దళంలోని సేనాని అయిన సుసానేకు వ్రాసిన లేఖలు చూడండి. ఇవి కమ్యూన్ ఆధికార పత్రికలో15 ప్రచురితమైనాయి). చివరకు మోసపూరితమైన ఈ ముసుగును 1871 జనవరి 28న వదలేశారు. అత్యంత అవమానకరమైన రీతిలో జాతీయ రక్షణ ప్రభుత్వం బిస్మార్క్ ఆమోదంతో నడిచే ఫ్రెంచ్ లొంగుబాటు ప్రభుత్వంగా మారింది. ఈ పరిస్థితి ఎంత అవమానకరమైనదంటే, సెడాన్‌లో లూయీ బోనపార్టీయే దీన్ని నిరాకరించాడు. మార్చి 18 ఘటనల తర్వాత, వర్సెయిల్స్ నగరానికి పారిపోయే సందర్భంలో, ఈ లొంగుబాటు దారులు తమ విద్రోహానికి సంబంధించిన పత్రాలను వదలి వెళ్ళారు. వీరి విద్రోహాన్ని గురించి కమ్యూన్ తన కరపత్రంలో ఇలా తెలియజేసింది. "పారిస్ నగరాన్ని ముక్కచెక్కలు చేసి, రక్త సముద్రంలో ముంచటానికి సైతం ఈ విద్రోహులు వెనకాడరు."

ఇలాంటి విద్రోహానికి పాల్పడటంలో, జాతీయ రక్షణ ప్రభుత్వ సభ్యులకు తమ ప్రత్యేక కారణాలు కూడా ఉన్నాయి. ఇవి చాలా విచిత్రంగా ఉంటాయి.

సంధి ఒప్పందం కుదిరిన వెంటనే జాతీయ శాసన సభలో, పారిస్ తరఫున ఒక ప్రతినిధిగా ఎన్నికైన యం.మిల్లీరి కొన్ని అధికార పూర్వక న్యాయ సంబంధమైన పత్రాలను ప్రకటించాడు. మిల్లీరిని ఆ తర్వాత, జూల్స్ ఫేవ్రె ఆదేశం మేరకు కాల్చివేశారు. ఆ పత్రాలలో ఉన్నదేమంటే జూల్స్ ఫేవ్రె ఆల్జీర్స్‌లోని ఒక త్రాగుబోతువాని భార్యతో అక్రమ సంబంధం కలిగి ఉన్నాడు. తద్వారా కొందరు పిల్లలు కలిగారు. వారి పేరుతో ఫోర్జరీ పత్రాలను సృష్టించి పెద్ద ఆస్తికి తాను వారసుడైనాడు. ఆ ఆస్తికి అసలు వారసులు ఇతనిపై దావా వేశారు. బోనపార్టిస్టు న్యాయమూర్తుల కమిటీ

సాయంతో మాత్రమే ఈ వ్యవహారమంతా బైట పడకుండా అతను తప్పించుకో గలిగాడు. ఎంత వాగాడంబరపు ఉపన్యాసాలు చేసినా, ఖచ్చితమైన ఈ పత్రాలను వదలించుకోవటం సాధ్యం కాదు కనుక మొట్టమొదటిసారిగా, జూల్స్ ఫేవ్రె అంతర్యుద్ధం ప్రారంభమయ్యేవరకు నోరు మూసుకుని పడి ఉన్నాడు. అంతర్యుద్ధం ప్రారంభం కావడంతోనే ఒక్కసారిగా పారిస్ ప్రజలపై తిట్ల వర్షం కురిపించడం మొదలు పెట్టాడు. వీరందరూ తప్పించుకు పారిపోయిన ఖైదీలనీ, కుటుంబం, మతము, ఆస్తి, శాంతి భద్రతలకు వ్యతిరేకులనీ వాదించడం ప్రారంభించాడు. ఈ మోసకాడు సెప్టెంబరు 4వ తేదీన అధికారంలోకి వచ్చాడో లేదో వెంటనే పిక్ ట్రైలిఫిర్ అనే ఖైదీలను సానుభూతితో వదలి సమాజంపై ప్రయోగించాడు. వీరు అవమానకరమైన ఎటెండార్డ్16 వ్యవహారంలో సామ్రాజ్య పాలనలోనే, తప్పుడు పత్రాలు సృష్టించారనే అభియోగంపై నిర్బంధించబడినవారు. వీరిలో ఒకడైన ట్రైలిఫర్, కమ్యూన్ కాలంలో పారిస్‌లో ప్రవేశించటానికి సాహసించాడు. వెంటనే కమ్యూన్ అధికారులు అతనిని జైలులో పెట్టారు. సరిగ్గా అప్పుడు జూల్స్ ఫేవ్రె, జైలులోని నేరస్తులందరినీ ప్రభుత్వం విడుదల చేస్తున్నదంటూ జాతీయ శాసన సభలో గగ్గోలు పెట్టాడు.

జాతీయ రక్షణ ప్రభుత్వంలో తనకు తానే విదేశాంగ మంత్రిగా ప్రకటించుకున్న ఎర్నెస్ట్ పికార్డ్ మరొకరు. ఈయన 18వ శతాబ్దపు ఆంగ్లేయ నటుడు జో మిల్లర్ 17 లాంటి వాడు. సామ్రాజ్యానికి హోంశాఖా మంత్రి కావాలని ఇతడు ఎంతగానో ప్రయత్నించాడు. ఇతడు ఆర్థరీ పికార్డ్ అనే వ్యక్తికి సోదరుడు. ఈ వ్యక్తి పారిస్ బోర్స్ నుండి దొంగకూలీగా బహిష్కరించబడ్డాడు. (1867 జూలై 13వ తేదీ పోలీసు సర్వాధికారి నివేదిక చూడండి). అంతేగాక జనరల్ సొసైటీ శాఖలలో ఒకటైన రూ పాలెస్ట్రో, 5వ నెంబరు శాఖలో మేనేజరుగా ఉంటూ 3 లక్షల ఫ్రాంకులు అపహరించాడు. ఈ నేరాన్ని అతడే అంగీకరించాడు. అందుకుగాను శిక్షితుడయ్యాడు. (1868 డిసెంబరు 11, పోలీసు సర్వాధికారి నివేదిక చూడండి) ఈ ఆర్థర్ పికార్డ్‌ను, సోదరుడైన ఎర్నెస్ట్ పికార్డ్ తన పత్రిక, ఎలెక్టోర్ లెబ్రీకి సంపాదకుడ్ని చేశాడు. ఫైనాన్స్ శాఖ అధికార ప్రకటన చెప్పిన అబద్ధాలలో మామూలు వాటాదార్లంతా అటూ, ఇటూ పరుగులెత్తుతుండగా, అర్థర్ పికార్డ్ ఫైనాన్స్ శాఖకు, బోర్సుకు మధ్య అటూఇటూ పరుగెత్తుతూ ఫ్రెంచి సైనిక పరాజయాలను కప్పిపుచ్చటానికి యత్నించాడు. గౌరవనీయులైన ఈ ఇద్దరు సోదరుల, ఆర్థిక ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ కమ్యూన్ అధికారుల చేతుల్లో పడ్డాయి.

సెప్టెంబరు 4వ తేదీకి పూర్వం పైసా కూడా లేని జూల్స్ ఫెర్రీ అనే బారిస్టరు ముట్టడి సమయంలో పారిస్‌కు మేయర్‌గా ఉండి కరువులో నుండి కనక రాసులు

పోగు చేసుకున్నాడు. అతడి దుష్పరిపాలన కంతా సమాధానం చెప్పవలసిన రోజే వస్తే అప్పుడు అతడికి జైలుశిక్ష ఖాయం.

పారిస్ నాశనమౌతుంటే ఇలాంటి మనుషులందరూ పారిపోవటానికి సన్నాహాలు చేసుకున్నారు. బిస్మార్కుకు కావలసిన మనుషులు వీరే. ఇంతవరకూ, ప్రభుత్వానికి రహస్య తోడ్పాటు నిస్తున్న థయర్స్ ఇప్పుడు దానికి అధిపతి. ఈ పలాయన వాదులందరూ అతనికి మంత్రులైనారు.

భయంకర రాక్షసుని వంటి థయర్స్ ఫ్రెంచి బూర్జువావర్గాన్ని అర్థ శతాబ్దంపాటు సమ్మోహితుడ్ని చేశాడు. ఏమంటే బూర్జువా వర్గ అవినీతికి అత్యంత సమర్థవంతమైన, మేధోపరమైన వ్యక్తీకరణకు అతడే చిహ్నం. రాజకీయవేత్త కాక ముందే చరిత్రకారుడుగా అసత్య ప్రలాపనలలో తన సామర్థ్యాన్ని అతడు నిరూపించుకున్నాడు. అతని పౌర జీవితంలోని ఘటనాక్రమం అంతా, ఫ్రాన్సుకు పట్టిన దురదృష్ట జాతక చక్రం. 1830కి పూర్వం అతడు రిపబ్లికన్లతో ఉండేవాడు. తన రక్షకుడైన లాఫిటీకి ద్రోహంచేసి లూయీ ఫిలిప్పో క్రింద మంత్రిగా చేరాడు. మత గురువులకు వ్యతిరేకంగా, ప్రజలను రెచ్చగొట్టి రాజు మన్నన పొందాడు. ఈ మత కలహాల సమయంలో, సెయింట్ జర్మాయిన్ ఆక్సిరోయిస్ చర్చి, ఆర్చి బిషప్ భవనం దోపిడీకి గురయ్యాయి. డచెస్ డి బెర్రీ జైలులో ఉండగా ఆమెపై గూఢచారి మంత్రిగా పనిచేశాడు. ట్రాన్స్‌నోనియన్ రాష్ట్రంలో జరిగిన మారణ హోమానికీ, పత్రికా స్వేచ్ఛ, సమావేశ స్వేచ్ఛకు వ్యతిరేకంగా జారీ అయిన చట్టాలకూ ఇతనే బాధ్యుడు. 1840 మార్చిలో తిరిగి మంత్రివర్గ ముఖ్యుడుగా దర్శనమిచ్చాడు. పారిస్ చుట్టూ కోటగోడ కట్టాలనే పథకంతో ఫ్రాన్సును ఆశ్చర్యపరిచాడు. ఈ పథకం, పారిస్ స్వేచ్ఛకు గొడ్డలిపెట్టు అని రిపబ్లికన్లు ఖండించగా అందుకు సమాధానంగా డిప్యూటీల ఛేంబరు వేదికపై నుండి ఇలా సమాధానం ఇచ్చాడు: "ఏమిటి? కోట గోడలు కడితే స్వాతంత్ర్యానికి భంగకరమా! అసలు పారిస్‌పై దాడి చేసి ఏ ప్రభుత్వమైనా బతికి బైటపడగలదు అనుకోవటమే ఒక పెద్ద నిందారోపణ. ఒక వేళ నిజంగానే అది జయిస్తే ఆ తర్వాత అది నిలబడటం నూటికి కోటికి అసాధ్యం". నిజానికి ఈ కోట గోడలను ప్రష్యన్లకు ధారాదత్తం చేసిన ప్రభుత్వం తప్ప మరే ప్రభుత్వం పారిస్‌పై దాడి చేయటానికి సాహసించజాలదు.

1848 జనవరిలో బొంబారాజు, పలేర్మోలో జోక్యం కలిగించుకో యత్నించాడు. అప్పటికే థయర్స్ పదవీ విరమణ చేసి చాలాకాలం అయింది. ఛేంబర్ ఆఫ్ డిప్యూటీస్‌లో అతడు నిలబడి ఇలా అన్నాడు.: "పెద్దలారా, పలేర్మోలో[18] ఏమి

జరుగుతున్నదో మీకు తెలుసు గదా! ఒక పెద్ద నగరం 48 గంటలపాటు దాడికి గురైందని వినటంతో మీరు చాలా దిగ్భ్రాంతి చెంది ఉంటారు. దాడి చేసింది ఎవరు? ఏదైనా విదేశీ సైన్యం మనపై యుద్ధం చేస్తున్నదా! కాదు, పెద్దలారా ఆ నగరంలోని ప్రభుత్వమే దాడి చేస్తున్నది. ఎందుకంటె, దురదృష్టవశాత్తు, ఆ నగరం తనకు హక్కులు కావాలి అన్నది. హక్కులు కావాలని అడిగినందుకు, ఆ నగరం 48 గంటల దాడికి గురైంది. యూరపు ప్రజాభిప్రాయానికి నేను విజ్ఞప్తి చేయదలిచాను. ఇట్టి దుశ్చర్యలకు వ్యతిరేకంగా కొన్ని మాటలు (నిజమే మాటలు) చెప్పటం ద్వారా, వారు, యూరపులోని అత్యున్నత ప్రజాభిప్రాయ కేంద్రమైనవారు, మానవాళికి గొప్పసేవ జేస్తున్నారు. ఆగ్రహంతో కూడిన వారి వాణి ప్రతిధ్వనిస్తున్నది. తన దేశానికి సేవచేసిన ఎస్పార్‌టెరో యువరాజు (థయర్స్ ఆ మాత్రం సేవనుకూడా చేయలేదు) బార్సిలోనా పై దాడికి పూనుకున్నప్పుడు, తిరుగుబాటును అణచివేయ ప్రయత్నించినపుడు, ప్రపంచ వ్యాపితంగా అందుకు నిరసన వ్యక్తమైంది.”

పద్దెనిమిది నెలల తర్వాత, ఫ్రెంచి సైన్యం రోమ్ నగరంపై దాడి చేసినప్పుడు [19] ఆ దాడిని పట్టుదలతో సమర్థించిన వారిలో థయర్స్ ఒకడు. నిజానికి బొంబా రాజు చేసిన తప్పు ఏమిటంటే, కేవలం 48 గంటలు మాత్రమే దాడి చేయటం అనిపిస్తుంది.

గిజో తనను దీర్ఘకాల ప్రవాసానికి పంపినందుకు కోపంతో ఉన్న థయర్స్, ఫిబ్రవరి విప్లవానికి కొద్ది రోజులు ముందుగా పెరుగుతున్న ప్రజా అసంతృప్తిని పసికట్టాడు. తనకు సహజ లక్షణమైన మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ ఛేంబర్ ఆఫ్ డిప్యూటీస్‌లో ఇలా అన్నాడు: “ఫ్రాన్సులోనే కాదు. యూరప్‌లో సైతం నేను విప్లవం పక్షాన ఉంటాను. విప్లవ ప్రభుత్వం మధ్యేవాదుల చేతులలో ఉండాలని నేను కోరుకుంటున్నాను. ఒకవేళ ఈ ప్రభుత్వం అతివాదుల చేతుల్లోకి, చివరికి రాడికల్స్ చేతుల్లోకి పోయినా నేను నా లక్ష్యాన్ని వదలి పెట్టను. నేను ఎల్లప్పుడూ విప్లవం వైపే ఉంటాను.” ఫిబ్రవరి విప్లవం వచ్చింది. అల్పబుద్ధుడైన థయర్స్ ఊహించిన విధంగా గిజో మంత్రివర్గం స్థానే థయర్స్ మంత్రివర్గం రాలేదు. దానికి బదులు లూయీ ఫిలిప్పా పతనమై రిపబ్లిక్ ఏర్పడ్డది. ప్రజా విజయం సంభవించిన మొదటి రోజున అతడు జాగ్రత్తగా ఒక చోట దాక్కున్నాడు. శ్రామిక ప్రజలు అతన్ని ఎంతగా ద్వేషించారో అంతగా అసహ్యించుకున్నారు. అదే అతన్ని కాపాడింది. ఐనప్పటికి మహా సాహసవంతుడైన అతడు, బహిరంగంగా ప్రజలకు కనపడటానికి వెనకాడాడు. జూన్ తిరుగుబాటును అణచివేసిన తరువాతనే అతను మళ్లీ రంగంలోకి

దిగాడు. ఇప్పుడతడు "పార్టీ ఆఫ్ ఆర్డర్"[20]కు దాని పార్లమెంటరీ రిపబ్లిక్‌కు ముఖ్యనాయకుడైనాడు. అప్రతిష్టాకరమైన ఈ మధ్యంతర ఏర్పాటులో పాలకవర్గానికి చెందిన అన్ని పోటీ ముఠాలు కుట్రపూరితంగా ఏకమై ప్రజలను అణచివేశాయి. వారిలో ప్రతి ఒక్క ముఠా తమ రాచరిక ప్రభుత్వాన్ని స్థాపించుకునేందుకు ఇతర ముఠాలకు వ్యతిరేకంగా కుట్ర చేస్తూ వచ్చాయి. రిపబ్లిక్ దృఢతరం కాకుండా ఆటంకపరుస్తున్నది రిపబ్లికన్లేనని ఇప్పటిలాగే అప్పుడు కూడా థయర్స్ అనేవాడు. ఇప్పటిలాగే అప్పుడు కూడా ఉరితీసేవాడు. "నీ క్షేమంకోసమే నిన్ను ఉరితీస్తున్నాను" అని డాన్ కార్లోస్‌తో తలారి అన్నట్లుగా థయర్స్ రిపబ్లిక్ గురించి మాట్లాడేవాడు. ఇప్పటిలాగే ఆనాడు కూడా అతడు విజయం సాధించిన మరునాడే "సామ్రాజ్యం సుస్థిరమైంది" అనేవాడు. పౌరస్వేచ్ఛలు కావాలని థయర్స్ ఎన్ని మోసకారి మాటలు చెప్పినప్పటికీ, తనను మోసగించిన లూయిస్ బోనపార్టి పట్ల అతనికి ఎంతగా కక్ష ఉన్నప్పటికీ (లూయిస్ బోనపార్టికి చెందిన) రెండవ సామ్రాజ్యం చేసిన అకృత్యాలన్నిటిలోనూ అతనికి భాగస్వామ్యం ఉంది. ఫ్రెంచ్ దళాలు రోమ్‌ను ఆక్రమించిన దగ్గరి నుండి ప్రష్యాపై యుద్ధం వరకు అన్నిట్లోనూ ఆయన హస్తం ఉంది. ప్రష్యాపై యుద్ధాన్ని ప్రేరేపించింది అతడే. ప్రష్యన్ నిరంకుశత్వాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన జర్మన్ ఐక్యతను వ్యతిరేకించలేదు, జర్మనీ అనైక్యంగా ఉంటే ఫ్రాన్స్ స్వార్ధం నెరవేరుతుందనే దుర్బుద్ధితోనే ఆయన దాన్ని వ్యతిరేకించాడు. చారిత్రకంగా మొదటి నెపోలియన్ కాలి బూట్లకు రాసిన నల్లని రంగుగా మారిన థయర్స్‌కు ఆ నెపోలియన్ కత్తిని తన మరుగుజ్జు చేతుల్లోకి తీసుకుని యూరప్‌పై తలపడాలన్న మక్కువ ఉంది. ఆయన విదేశాంగ విధానం అనేక సందర్భాల్లో ఫ్రాన్స్‌ను తీవ్రమైన అవమానాల్లోకి నెట్టింది. 1841 లండన్ సదస్సు నుండి 1871లో నేటి అంతర్యుద్ధం వరకు ఇలాగే జరిగింది. ఈ అంతర్యుద్ధంలో అతను బిస్మార్క్ ప్రత్యేక అనుమతితో సెడాన్‌లోనూ, మెట్జ్‌లోనూ యుద్ధఖైదీలను పారిస్‌కు వ్యతిరేకంగా ఉసిగొల్పుతున్నాడు. అతనికి గొప్ప సామర్థ్యం ఉంది. తన లక్ష్యాలను నిరంతరం మార్చుకుంటూ ఉంటాడు. ఐనప్పటికి ఇతడు యావజ్జీవమూ, అత్యంత నిర్జీవమైన రోజువారీ కార్యక్రమంతోనే మునిగిపోతూ వచ్చాడు. ఆధునిక సమాజంలో అంతర్గర్భితమైన లోతైన అంతః ప్రవాహాలను గురించి ఇతనికి ఏ మాత్రమూ అవగాహనలేదని స్పష్టమౌతూనే ఉంది. కాగా ఉపరితలంపై అతి స్పష్టంగా కనపడే మార్పులు సైతం ఇతని బుర్రకు దుస్సహంగా ఉన్నాయి. ఇతని తలకాయలోని శక్తి అంతా నాలుకకు మాత్రమే సంక్రమించింది. కనుకనే, పాతకాలపు ఫ్రెంచి రక్షణ

వ్యవస్థనుండి ఏమాత్రం వైదొలగినా, అది మహా పాపమైనట్లు విసుగులేకుండా అతడు నిందిస్తూనే ఉంటాడు. లూయీ ఫిలిప్పొ క్రింద మంత్రిగా ఉండగా, రైల్వేల నిర్మాణం ఆటవిక భ్రమ అని దూషించాడు. లూయీ బోనపార్టీ క్రింద ప్రతిపక్షంలో ఉండగా, కుళ్ళిపోయిన ఫ్రెంచి సైనిక వ్యవస్థను సంస్కరించే ప్రతి ప్రయత్నమూ మహా పాపమని దుమ్మెత్తిపోశాడు. సుదీర్ఘమైన అతని రాజకీయ జీవితంలో, అతడు ఏనాడు ఆచరణలో ఉపయోగపడే ఒక చిన్న పనిని కూడా చేసిన పాపాన పోలేదు. సంపద పట్ల దురాశ, సంపదను సృష్టించేవారి పట్ల ద్వేషము...ఈ రెండూ మాత్రం అతనిని సదా అంటి పెట్టుకున్నాయి. లూయీ ఫిలిప్పొ క్రింద మొదటిసారి మంత్రి అయినప్పుడు అతడు చాలా పేదవాడు. మంత్రి పదవి వదలే సమయానికి కోటీశ్వరుడైనాడు. అదే చక్రవర్తి క్రింద అతడు అఖరుసారిగా మంత్రి పదవిని (1849 మార్చి 1న) స్వీకరించాడు. అప్పుడతడు డిప్యూటీల సభలు, ధనాపహరణ ఆరోపణపై బహిరంగ విమర్శలకు గురి అయినాడు. అందుకతడిచ్చిన సమాధానం కడివెడు కన్నీళ్ళు కురిపించటం. ఈ ఒక్క సరుకునే అతడు జూల్స్ ఫేవ్రెలాగానో, మరే మొసలి లాగానో పుష్కలంగా సరఫరా చేయగలడు. ఫ్రాన్సుకు ఆర్థిక సంక్షోభం ముంచుకు రానున్న సమయంలో అతడు బోర్డోలో ఉన్నాడు. అప్పుడతడు చేసిన మొదటి పని ఏమంటే తనకు ఏటా మూడు మిలియన్లు కేటాయించుకోవటం. 1869లో పారిస్‌లోని తన నియోజకవర్గ ఓటర్ల ఎదుట అతడు వివరించిన 'ఆర్థిక రిపబ్లిక్' భావన సాధించిన, మొదటి పని, ఆఖరు పని కూడా ఇదే. 1830లో ఇతడితోపాటు డిప్యూటీల సభలో సభ్యుడిగా ఉన్న యం.బిస్లే స్వతహాగా పెట్టుబడిదారు. అయినా పారిస్ కమ్యూన్‌లో విశ్వాసపాత్రుడైన సభ్యుడు. ఇతడు ఇటీవల థియర్స్‌ను ఒక బహిరంగ సభలో ఇలా ప్రశ్నించాడు: "కార్మికులను పెట్టుబడికి బానిసలుగా మార్చడం అనేది మొదటి నుండి నీ విధానంలో పునాది రాయిగా ఉన్నది. హోటల్ డీ విల్లెలో కార్మిక రిపబ్లిక్ ప్రకటించిన రోజునుండి నీవు 'వీరంతా నేరస్తులు' అని ఫ్రాన్సు మొత్తానికి వినపడేటట్లు గగ్గోలు పెడుతూనే ఉన్నావు." చిన్న చిన్న ప్రభుత్వాలను కూల్చటంలో థియర్స్ ఘటికుడు. దొంగ పత్రాలు సృష్టించడంలోనూ, మోసం చేయటంలోనూ నిపుణుడు. పార్లమెంటరీ పార్టీల కుమ్ములాటల్లో వ్యక్తమయ్యే దారుణమైన ద్రోహాలు చేయటంలోను, కుట్రతో కూడిన ఎత్తుగడలలోనూ, అల్పబుద్ధితో కూడిన నీచమైన పన్నాగాలలోనూ ఆరితేరినవాడు. పదవిలో లేనప్పుడు, విప్లవాన్ని రెచ్చగొట్టడానికి, పదవిలో ఉన్నప్పుడు అదే విప్లవాన్ని రక్తపుటేరుల్లో ముంచటానికి వెనుదీయని వాడు. అతనికున్నవి భావాలు కావు. వర్గ దురభిప్రాయాలు. హృదయం ఉండవలసిన స్థానంలో అహంకారమున్నది. అతని పౌర జీవితం ఎంత అవమానకరమో, వ్యక్తిగత జీవితం అంతగా అప్రతిష్టాకరం.

ఇప్పుడు సైతం సాధు పాత్ర నటిస్తున్నప్పటికీ అతడి ఆడంబరం, అట్టహాసం, చర్చలు, ప్రజలలో అసహ్యతను కలిగిస్తూనే ఉన్నాయి.

పారిస్‌ను మాత్రమే గాక, యావత్తు ఫ్రాన్సునూ ప్రష్యాకు అప్పగించడం ద్వారా శత్రువుతో దీర్ఘకాలంగా వీరు సాగిస్తున్న కుట్రలు ముగింపు కొచ్చాయి. ఈ కుట్రదారులు, సెప్టెంబరు 4వ తేదీనే ఈ కుట్రలు ప్రారంభించారు. ట్రోచూ ఈవిషయాన్ని ఆ రోజునే అంగీకరించాడు. పైపెచ్చు ఈ లొంగుబాటు ఫలితంగా అంతర్యుద్ధం ప్రారంభమైంది. ప్రష్యా సహాయంతో, పారిస్‌కు, రిపబ్లిక్‌కు వ్యతిరేకంగా, వీరు ఈ అంతర్యుద్ధాన్ని కొనసాగిస్తున్నారు. లొంగుబాటుకు సంబంధించిన షరతుల ద్వారానే అంతర్యుద్ధానికి అవసరమైన వల పన్నారు. ఆ సమయానికి మూడోవంతు భూభాగానికి పైగా శత్రువు అధీనంలో ఉంది. రాష్ట్రాలకు, రాజధానికి సంబంధాలు తెగిపోయాయి. రవాణా మార్గాలన్నీ చిన్నాభిన్నమైనాయి. అలాంటి పరిస్థితులలో సన్నాహాలకు తగు వ్యవధిని ఇస్తే తప్ప ఫ్రాన్సుకు నిజంగా ప్రాతినిధ్యం వహించే వారిని ఎన్నుకోవటం అసాధ్యం. ఇది దృష్టిలో పెట్టుకునే, ఎనిమిది రోజులలో జాతీయ శాసనసభ ఎన్నిక కావాలని లొంగుబాటు పత్రంలో షరతు విధించారు. ఫలితంగా, ఫ్రాన్సులోని చాలా ప్రాంతాల్లో ఎన్నికలు జరుగుతాయనే వార్త, పోలింగ్ సమయానికి మాత్రమే చేరుకుంది. అంతేకాదు, లొంగుబాటు పత్రంలోని ఒక షరతు ననుసరించి ఈ శాసన సభ ఒకే విషయంపై... శాంతి లేక యుద్ధంపై నిర్ణయం చేయాలి. చిట్టచివరకు శాంతి ఒప్పందాన్ని ఆమోదించాలి. యుద్ధ విరమణ షరతులను చూసినట్లయితే, యుద్ధం కొనసాగించటం ఇక అసాధ్యం అని ప్రజలు భావించితీరుతారు. అలాంటి శాంతిని – బిస్మార్కు విధించిన శాంతిని – అమలు జరపటానికి ఫ్రాన్సులోని అత్యంత దుర్మార్గులే సమర్థులు. ఈ ఏర్పాట్లతో సంతృప్తిపడక యుద్ధ విరమణ విషయం పారిస్‌లో పొక్కక ముందే రాష్ట్రాలలో ఎన్నికల ప్రచారానికి బయలుదేరాడు. బోనపార్టిస్టు పార్టీ ఎలాగూ బతకలేదు కనుక ఆ స్థానంలో ఆర్లియనిస్టుల[21]తో పాటు నశించిన లెజిటిమిస్టు పార్టీకి తిరిగి ప్రాణం పోసేందుకే ఈ ప్రచారం ప్రారంభించాడు. బోనపార్టిస్టులంటే థయర్సుకు భయం లేదు. ఆధునిక ఫ్రాన్సును పరిపాలించగల సత్తా వారికి లేదు. కనుక వారిని పోటీదారులుగా భావించటమే అవమానకరం. ప్రతీఘాత విప్లవానికి సాధనగా ఉపయోగపడేందుకు ఈ పార్టీకంటె మరి దేనికీ అర్హతలేదు. ఏమంటే (1833, జనవరి 5న, డిప్యూటీల సభలో) థయర్స్ చెప్పినట్లు "ఈ పార్టీ కార్యాచరణ అంతా కేవలం విదేశీ దురాక్రమణ, అంతర్యుద్ధం, అరాచకం అను మూడు అంశాలపైన ఆధారపడి ఉంది. దీర్ఘకాలంగా

ఎదురు చూస్తున్న గత కాలపు ఊహాజనిత స్వర్గలోకం తిరిగి వస్తుందనే నమ్మకంపై వీరి విధానమంతా ఆధారపడి ఉంది. ఫ్రాన్సును తమ పాదాల క్రింద నలిపివేసే విదేశీ దురాక్రమణదారులకు వీరు పనిముట్లు, సామ్రాజ్యం కూలిపోయింది. బోనపార్టీ నిర్బంధంలో ఉన్నాడు. వీరు మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉన్నారు. చరిత్ర రథచక్రాలు బహుశా 1816 (పూర్తి అభివృద్ధి నిరోధకులతో కూడిన శాసనసభ) ఇంట్రోవబుల్ ఛేంబర్[22] వైపు నడిచినట్లున్నాయి. 1848–1857 రిపబ్లిక్‌లకు చెందిన శాసనసభలలో విద్యాధికులు, అనుభవజ్ఞులు అయిన వారు వారి పార్లమెంటరీ ప్రతినిధులుగా ఉన్నారు. ఇప్పుడు పార్టీలోని సాధారణ సభ్యులు, ఫ్రాన్సులోని మూర్ఖులు, అల్పబుద్ధులూ అయిన భూస్వాములూ ముందుకు తోసుకొచ్చారు.

బోర్డోలో “రూరల్స్”[24] శాసనసభ సమావేశమైన వెంటనే థియర్స్ ఒక విషయం స్పష్టం చేశాడు. పార్లమెంటరీ చర్చ అనే లాంఛనం లేకుండానే శాంతికి సంబంధించిన ప్రాథమిక చర్యలకు ఆమోదం తెలపాలి. అలా అయితేనే రిపబ్లిక్‌కు దాని ముఖ్య స్థావరమైన పారిస్‌కు వ్యతిరేకంగా యుద్ధం ప్రారంభించడానికి ప్రష్యా తమకు అనుమతిస్తుంది. నిజానికి ప్రతీఘాత విప్లవం ఇక ఏమాత్రం అలస్యం లేకుండా రంగంలోకి దిగాలి. రెండవ సామ్రాజ్య కాలంలో, జాతీయ రుణం రెండింతలకు పైగా పెరిగింది. ముఖ్యమైన నగరాలన్నీ భారీ మునిసిపల్ రుణాలతో మునిగి ఉన్నాయి. యుద్ధ ఫలితంగా ఖర్చులు భయంకరంగా పెరిగిపోయాయి. జాతీయ ఆదాయాలు దారుణంగా కుంచించుకు పోయాయి. ఈ వినాశనాన్ని పూర్తి చేయటానికా అన్నట్లు ప్రష్యన్ వడ్డీ వ్యాపారస్తులు  ఉండనే ఉన్నారు. ఫ్రెంచి భూభాగంపై అయిదు లక్షల సైనికులను ఉంచుతానని,  50 లక్షల ఫ్రాంకుల నష్ట పరిహారం చెల్లించాలని, బాకీపడిన వాయిదాలపై 5 శాతం వడ్డీ చెల్లించాలని షరతులు విధిస్తున్నారు. ఈ ఖర్చులన్నీ ఎవరు భరిస్తారు? సంపదను ఉత్పత్తి చేసే వారి భుజస్కంధాలపై సంపదను స్వాహా చేసే ఈ వర్గాలవారు, రిపబ్లిక్‌ను దౌర్జన్యంగా కూలదోయటం ద్వారా మాత్రమే యుద్ధ భారాన్ని త్రోసివేయ గలుగుతారు. నిజానికి ఈ దోపిడీదారులే యుద్ధం ప్రారంభం కావటానికి అసలు కారకులు. ఈ విధంగా ఫ్రాన్సు వినాశకర పరిస్థితులలో ఉండగా, భూమికీ, పెట్టుబడికీ అధిపతులైన ఈ దేశభక్తియుత ప్రతినిధులు, విదేశీ దురాక్రమణదారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో విదేశీయుల దురాక్రమణ యుద్ధానికి తోడుగా అంతర్యుద్ధాన్ని అంటే బానిస యజమానుదారుల తిరుగుబాటును జోడించారు.

ఈ కుట్ర విజయవంతం కావడానికి ఒకే పెద్ద ఆటంకం ఉంది. అది పారిస్. పారిస్ ప్రజలను నిరాయుధీకరణ చేస్తే తప్ప వారికి విజయం లభించదు. అందుకనే ఆయుధాలను కిందపడేయాలని థయర్స్ పారిస్ ప్రజలను ఆజ్ఞాపించాడు. గ్రామీణ శాసనసభ ఆవేశపూరితంగా చేసిన రిపబ్లికన్ వ్యతిరేక ప్రదర్శనలతో పారిస్ విసిగిపోయింది. రిపబ్లిక్‌కు గల చట్టబద్ధమైన ప్రతిపత్తిపై థయర్స్ పరస్పర విరుద్ధంగా చేసే ప్రసంగాలతో విసిగిపోయింది. పారిస్‌ను రాజధానిగా రద్దుచేసి ముక్కలు ముక్కలు చేస్తానని థయర్స్ బెదిరించాడు. ఆర్లియనిస్టు పార్టీకి చెందిన రాయబారులను నియమించాడు. చెల్లించని వ్యాపార బకాయిల పైన, ఇండ్ల అద్దెలపైన డుఫారే శాసనాలు చేశాడు. ఈ శాసనాలు పారిస్‌లోని పరిశ్రమలను,వాణిజ్యాన్ని నాశనం చేశాయి. ప్రతి ప్రచురణపైన, అది ఊరూ పేరూ లేనిదైనా సరే ప్రతి కాపీకి 2 సెంట్‌ల పన్నును పోయర్ క్వెర్టియర్ విధించాడు. బ్లాంక్వి, ఫ్లోరెన్సులకు మరణశిక్ష విధించారు. రిపబ్లికన్ పత్రికలపై నిషేధాలు పెట్టారు. జాతీయ శాసనసభ సమావేశాలను వర్సెయిల్స్‌కు మార్చారు. పారిస్‌లో సెప్టెంబరు 4తో రద్దయిన ముట్టడి ఆంక్షలను పలికావో పునరుద్ధరించాడు. డిసెంబరిస్టు అయిన వినోయ్ ని పారిస్ గవర్నర్‌గా నియమించారు. సామ్రాజ్య పోలీసు శాఖకు చెందిన వాలెంటిన్‌ను పారిస్ పోలీసు అధికారిగా నియమించారు. జెసూట్ సేనాని ఆరెల్లె డి పలాడిన్స్‌ను జాతీయ రక్షక దళం సేనానిగా నియమించారు.

ఇప్పుడు మనం థయర్స్‌ను, జాతీయ రక్షణ దళానికి చెందిన అతని ఉద్యోగులను ఒక ప్రశ్న వేయాలి. తన ఆర్థికమంత్రి పోయెర్ క్వెర్టియర్ ద్వారా 20 లక్షల రుణం థయర్స్ తీసుకున్నాడని అందరికీ తెలుసు. ఇది నిజమా? కాకపోతే...

1) థయర్స్, జూల్స్ ఫేవ్రె, ఎర్నెస్ట్ పికార్డ్, పోమెర్ క్వార్టియర్, జూల్స్ సైమన్‌లు కోట్లాది ధనం స్వాహా చేయటానికి వీలుగా వ్యాపార నిర్వహణ జరిగిందా?

2) పారిస్ పూర్తిగా లొంగిపోయే వరకు, రుణం ఏ మాత్రం చెల్లించనక్కరలేదు అని హామీ ఇచ్చారా?

ఏది ఏమైనా ఈ మొత్తం వ్యవహారంలో ఏదో పెద్ద లాలూచీ కుట్ర జరిగింది. ఏమంటే థయర్స్, జూల్స్ ఫేవ్రెలు, బోర్డు శాసనసభలో మెజారిటీ ఉన్నదనే పేరుతో ఎట్టి సిగ్గు లేకుండా పారిస్‌ను వెంటనే ఆక్రమించు కోవలసిందిగా ప్రష్యన్ సేనలను అర్థించారు. అయితే బిస్మార్కు ఇందుకు అంగీకరించలేదు. జర్మనీకి తిరిగి వెళ్ళిన

తర్వాత తనను అభినందించిన ఫ్రాంక్‌ఫర్టు నగర వ్యాపారులతో మాట్లాడుతూ ఈ విషయంలో చాలా హేళనగా మాట్లాడాడు.

# II

విప్లవ ప్రతీఘాత కుట్ర విజయవంతం కాకుండా అడ్డుపడింది సాయుధమైన పారిస్. కనుక పారిస్‌ను ముందు నిరాయుధం చేయాలి. ఈ విషయంలో బోర్డు శాసనసభ పూర్తి 'చిత్తశుద్ధిని' కలిగి ఉంది. రూరల్స్ శాసనసభ్యుల అట్టహాసాలే ఇందుకు నిదర్శనం. అది చాలకపోతే, డిసెంబరిస్టు వినోయ్, బోనపార్టిస్టు పోలీసు అధికారి వాలెంటిన్, జెసూట్ సేనాని ఆరెల్లెడి పలాడిన్స్‌లకు చెందిన త్రిమూర్తుల కూటమి దయా ధర్మాలకు థయర్స్ పారిస్‌ను స్వాధీనం చేసినప్పుడైనా,ఈ కపట నాటకం పూర్తిగా వెల్లడయ్యేది. పారిస్ నిరాయుధం కావాలి అనటంలో వారి అసలు ఉద్దేశమేమిటో వారు అవమానకరమైన రీతిలో బహిరంగంగా ప్రకటిస్తూనే ఉన్నారు. మరొకవైపున పూర్తిగా అబద్ధపు సాకులు చూపించి నిరాయుధం కావలసింది అని పారిస్ నగరాన్ని ఆదేశిస్తున్నారు. పారిస్ జాతీయ రక్షక దళం ప్రభుత్వానికి చెందినదని, కనుక ప్రభుత్వానికే అది తిరిగి చెందాలని థయర్స్ అంటున్నాడు. కాని అసలు విషయం ఏమంటే, లొంగుబాటు జరిగిన రోజునుండి, బిస్మార్కు ఖైదీలు ఫ్రాన్సు లొంగుబాటు పత్రంపై సంతకం చేసి, పారిస్‌ను భయపెట్టే నిర్ధిష్ట లక్ష్యంతో అసంఖ్యాకమైన స్వంత రక్షక దళాలను ఏర్పరచుకున్న నాటినుండి, పారిస్ తన జాగ్రత్తలో తాను ఉంటూనే ఉన్నది. జాతీయ రక్షక దళం తనను తాను పునర్నిర్మాణం చేసుకుంది. సర్వాధికారాన్ని, యావత్తు దళం ఎన్నుకున్న ఒక కేంద్ర కమిటీకి దఖలు పరిచింది. పాత బోనపార్టిస్టు దళాలలో కొన్ని శాఖలు మాత్రం ఈ ఎన్నికలలో పాల్గొనలేదు. పారిస్‌లోకి ప్రష్యన్లు ప్రవేశించే సమయానికి ఫిరంగి దళాన్ని, మాంట్ మర్ట్రి, బెల్లివిల్లి లావిల్లి ప్రాంతాలకు కేంద్ర కమిటీ తరలించింది. ఏ భవనాలను ప్రష్యన్లు ఆక్రమించదలచుకున్నారో వాటిని విద్రోహ బుద్ధితో లొంగుబాటుదార్లు ముందుగానే ఖాళీ చేశారు. ఈ ఫిరంగి దళం జాతీయ రక్షక దళం విరాళాలతో సమకూర్చబడ్డది. ఈ ఫిరంగి దళం జాతీయ రక్షక దళపు స్వంత ఆస్తిగా జనవరి 28 లొంగుబాటు పత్రంలో గుర్తించబడింది. అందువల్ల అది లొంగుబాటునుండి మినహాయించబడ్డది. ప్రభుత్వానికి చెందిన ఆయుధాలు మాత్రమే శత్రువుకు స్వాధీన

పరచబడ్డాయి. పారిస్‌కు వ్యతిరేకంగా యుద్ధం ప్రారంభించటానికి ఏ రకమైన స్వల్ప కారణం కూడా థయర్స్‌కు కనబడలేదు. కనుకనే ఫిరంగి దళం జాతీయ రక్షక దళానిది కాదని, ప్రభుత్వ ఆస్తి అని పచ్చి అబద్ధానికి ఒడిగట్టాడు.

పారిస్‌ను మొత్తం నిరాయుధంచేసి తద్వారా సెప్టెంబరు 4 విప్లవాన్ని ధ్వంసం చేయటానికి పారిస్ ఫిరంగి దళాన్ని స్వాధీనం చేసుకోవటం ప్రథమచర్య తప్ప మరొకటి కాదు. అయితే ఈ విప్లవం, ఫ్రాన్సు యొక్క చట్టబద్ధ హక్కులలో ఒకటైంది. రిపబ్లిక్, దాని కృషి, విజేతచే గుర్తించబడి, లొంగుబాటు పత్రంలో నమోదు చేయబడ్డది. లొంగుబాటు తర్వాత విదేశీ రాజ్యాలన్నీ ఈ విషయాన్ని గుర్తించాయి. రిపబ్లిక్ పేరుతోనే, జాతీయ శాసనసభ సమావేశం ఏర్పాటుచేయబడ్డది. బోర్డోలో స్థావరం ఏర్పరచుకున్న జాతీయ శాసనసభకు దాని కార్యవర్గానికి, సెప్టెంబరు 4 పారిస్ శ్రమజీవుల విప్లవమే చట్టబద్ధమైన అర్హత. ఈ అర్హత లేకపోతే జాతీయ శాసనసభ రద్దయి, 1869లో ప్రష్యన్ పాలనలో గాక ఫ్రెంచి పాలనలో సార్వజనీన వోటింగ్ హక్కు ద్వారా ఎన్నికైన శాసనసభకు అధికారం బదిలీ కావాలి. ఈ శాసన సభను విప్లవం బలప్రయోగంతో తోసివేసింది. అప్పుడు థయర్స్ సెలవు టిక్కెట్లు కలిగిన అతని సహచరులు, లూయీ బోనపార్టీ సంతకం చేసిన సత్ప్రవర్తన పూచీ కత్తులు పొంది లొంగిపోవాలి. లేదా కేనీకి[25] ప్రవాసం వెళ్లాలి. ప్రష్యాతో సంధి షరతులను ఖరారు చేసే అధికారం కలిగిన జాతీయ శాసనసభ, విప్లవం యొక్క ఒక శాఖ మాత్రమే. ఈ విప్లవం యొక్క సజీవ చిహ్నం పారిస్ నగరమే. ఈ విప్లవాన్ని అదే మొదలు పెట్టింది. అందుకుగాను అయిదు నెలల ముట్టడికి గురయింది. దుర్భర క్షామాన్ని అనుభవించింది. ట్రోచూ పన్నాగానికి వ్యతిరేకంగా, దీర్ఘకాల ప్రతిఘటనను కొనసాగించింది. రాష్ట్రాలలో జరిగిన ఆత్మరక్షణ యుద్ధానికి ఇదే ప్రాతిపదిక అయింది. ఇప్పుడు, బోర్డోలోని బానిస యజమానుల అవమానకర ఆదేశాలకు తల ఒగ్గి పారిస్ ప్రజలు ఆయుధాలను క్రింద పెట్టడం అంటే సెప్టెంబరు 4న విప్లవం వమ్మయినట్లే. అంటే అధికారం లూయీ బోనపార్టీ చేతుల నుండి అతని రాచరిక ప్రత్యర్థుల చేతుల్లోకి మారటమే అవుతుంది. అలా కాకూడదు అంటే ఫ్రాన్సు రక్షణ కోసం త్యాగంతో ధైర్యంగా నిలబడాలి. రాజకీయ, సాంఘిక వ్యవస్థను విప్లవకరంగా కూలదోస్తే తప్ప. ఫ్రాన్సు పునరుజ్జీవనం సాధ్యం కాదు. సర్వ వినాశనాన్నుండి ఫ్రాన్సు రక్షించబడదు. ఈ రాజకీయ సాంఘిక పరిస్థితులే, రెండవ సామ్రాజ్యాన్ని సృష్టించాయి. పారిస్ నగరం, ఈ సామ్రాజ్యం ఛత్రచ్ఛాయలలో పూర్తిగా కుళ్ళి కృశించినా, అయిదు నెలల కరువు కారణంగా శల్యావశిష్టమైనా ఒక్క క్షణం కూడా వెనకడుగు వేయలేదు. ఫ్రెంచి

కుట్రదారులను ప్రతిఘటించడంలో ఏర్పడే అన్ని ఇబ్బందులను సాహసోపేతంగా ఎదుర్కోవటానికే నిశ్చయించింది. పారిస్ కోట బురుజులనుండి, ప్రష్యన్ ఫిరంగులు పారిస్ నగరంపైననే గుండ్ల వర్షం కురిపించాయి. అయినప్పటికీ, కేంద్ర కమిటీకి పారిస్‌ను అంతర్యుద్ధంలోకి నెట్టడం అంటే తీవ్ర విముఖత ఉన్నందున కేవలం ఆత్మరక్షణ వైఖరినే కొనసాగించింది. శాసనసభ ఎంతగానో రెచ్చగొట్టే వైఖరిని ప్రదర్శించింది. కార్యవర్గంగా అధికారాన్ని చేజిక్కించుకుంది. పారిస్ లోపల చుట్టూర సైన్యాలు ప్రమాదకరంగా కేంద్రీకరించి ఉండేవి. ఇంత జరిగినా వారు తమ వైఖరిని విడనాడలేదు.

పారిస్ శివారుల్లోని మౌంట్‌మార్ట్రి పైకి కొన్ని సైనిక దళాలను, లక్షలాది కిరాయి యోధులను వినోయ్ నాయకత్వాన అర్థరాత్రివేళ పంపటంతో థయర్స్ అంతర్యుద్ధాన్ని ప్రారంభించాడు. 'జాతీయ రక్షకదళానికి చెందిన ఫిరంగి దళాన్ని అకస్మాత్తుగా స్వాధీనపరచుకోవలసిందిగా అజ్ఞాపించాడు'. జాతీయ రక్షక దళం యొక్క ప్రతిఘటన, వారికి మద్దతుగా ప్రజలు ప్రదర్శించిన సౌహార్దత ఫలితంగా ఈ ప్రయత్నం విఫలమైన సంగతి అందరికీ తెలిసినదే. అరెల్లె డి పలాడిన్స్ తన విజయ ప్రకటనను ముందుగానే తయారుచేసుకు కూచున్నాడు. కుట్రకు సంబంధించి తాను చేపట్టదలచిన చర్యలను తెలియజేసే అట్టలను థయర్స్ కూడా ముందుగానే సిద్ధంగా ఉంచుకున్నాడు. తీరా ఫలితం అనుకున్న దానికి విరుద్ధమయ్యేసరికి థయర్స్ విజ్ఞప్తులు చేయసాగాడు. జాతీయ రక్షక దళాలు ఆయుధాలను తన చేతులలో ఉంచుకోవచ్చునని అంగీకరించాడు. ఎంతో ఔదార్యంతో ఈ ప్రకటన చేసినట్లు ప్రవర్తించాడు. జాతీయ రక్షక దళం ఆయుధాలను తన చేతులలో పెట్టుకుని ప్రభుత్వం తరఫున తిరుగుబాటు దార్లకు వ్యతిరేకంగా పని చేస్తుందనే ఆశాభావం వెలిబుచ్చాడు. 3 లక్షల మంది జాతీయ రక్షక దళ సభ్యుల్లో 300 మంది మాత్రమే ఈ విజ్ఞప్తిని పాటించారు. అల్పుడైన థయర్స్ తరఫున నిలబడటానికి సిద్ధమయ్యారు. మార్చి 18న జరిగిన ప్రతిభావంతమైన శ్రమజీవుల విప్లవం పారిస్‌పై ఏకచ్ఛత్రాధిపత్యం స్థాపించింది. కేంద్రకమిటీ దానికి తాత్కాలిక ప్రభుత్వంగా మారింది. ఇటీవల కాలంలో యూరపులో జరిగిన యుద్ధాలు, ప్రభుత్వ వ్యవహారాలు, ఏమైనా వాస్తవాన్ని కలిగి ఉన్నాయా లేక ఏనాడో నశించిన గత కాలానికి చెందిన కలలు మాత్రమేనా అని యూరప్ సంశయించ సాగింది.

మార్చి 18వ తేదీన వర్సెయిల్స్ దళాలు పారిస్‌లో ప్రవేశించే వరకు విప్లవాలు లేక ప్రతీఘాత విప్లవాలలో సాధారణంగా జరిగే హింసాయుత చర్యలేవీ ఈ విప్లవంలో

జరగలేదు. లెకొమ్టి, క్లెమెంట్ థామస్ అను సేనానులను వధించటం, ప్లేస్‌వెండోంలో జరిగిన ఘటనలు మినహా విప్లవ వ్యతిరేకులు వేలుపెట్టి చూపగలిగిన ఘటన ఒక్కటీ లేదు.

మాంటిమార్ర్రిపై అర్థరాత్రి వేళ దాడి జరిపిన సేనానులలో ఒకడు లెకొమ్టి సేనాని. ఇతడు పిగల్లిప్లేస్‌లో నిరాయుధులైన ప్రజలపై తుపాకులు కాల్చవలసిందిగా, 81వ దళానికి నాలుగు సార్లు ఉత్తర్వు చేశాడు. సైనికులు ఇందుకు నిరాకరించగా వారిని దారుణంగా అవమానించాడు. స్త్రీలను, పిల్లలను కాల్చటానికి బదులు, అతని సైనికులు అతన్నే కాల్చివేశారు. కార్మికవర్గ శత్రువుల క్రింద తయారైన సైనికుల అలవాట్లు వారికి నరనరాన జీర్ణించుకుపోతాయి. పక్షాలు మారిన మరుక్షణాన అలవాట్లు మారవు. కనుకనే ఆ మనుషులే క్లెమెంట్ థామస్‌నుకూడా వధించారు.

"జనరల్" క్లెమెంట్ థామస్ అసంతృప్తితో బాధపడే మాజీ క్వార్టర్ మాస్టర్. జనరల్ లూయీ ఫిలిప్పొ పరిపాలన ఆఖరు రోజులలో ఇతడు రిపబ్లికన్ వార్తా పత్రిక నేషనల్[26] ఆఫీసులో పనిచేయసాగాడు. అక్కడ రెండు బాధ్యతలు చేపట్టాడు. ఒకటి, బాధ్యతగల సామాన్య పౌరుడి హోదా, రెండోది దూషణ ప్రధానమైన ఆ పత్రిక చేసే బెదిరింపులలో ముందుండే జగడాల మాదిరి పాత్ర. ఫిబ్రవరి విప్లవం తర్వాత నేషనల్ పత్రికకు చెందిన వ్యక్తులు అధికారంలోకి వచ్చారు. ఈ పాత క్వార్టర్ మాస్టర్ జనరల్‌ను వారు, జూన్ హత్యాకాండ నాటికి జనరల్‌గా మార్చివేశారు. ఈ దారుణ హత్యాకాండకు జూల్స్ ఫెవ్రె లాగానే ఇతడు కూడా ఒక దుష్టుడైన కుట్రదారు. అతి దారుణమైన హంతకులలో ఒకడైనాడు. తరువాత అతడు అతని సేనా నాయకత్వం చాలా కాలం క్రితమే అంతర్థానమై పోయాడు.

తిరిగి 1870, నవంబరు 1న అతడురంగంమీదికి వచ్చాడు. ఆ మర్నాడే బ్లాంక్వి, ఫ్లోరెన్సు, తదితర కార్మిక వర్గ ప్రతినిధులకు పెరోల్ ఇవ్వటానికి హోటల్ డీ విల్లెలో బందీగా ఉన్న రక్షక ప్రభుత్వం అంగీకరించింది. తాము చట్టవిరుద్ధంగా చేజిక్కించుకున్న ప్రభుత్వాన్ని, పారిస్ ప్రజలచే స్వేచ్ఛగా ఎన్నుకోబడిన కమ్యూన్‌కి దఖలు పరచడానికి కూడా ప్రమాణ పూర్వకంగా ఆమోదించింది. కాని ఆ ప్రభుత్వ బాధ్యులు తమ మాటను నిలబెట్టుకోకపోగా ట్రోచూకు చెందిన సైనికులను, బోనపార్టీకి చెందిన కార్సికన్ సైనికుల స్థానే పారిస్ నగరంపైకి వదిలారు. ఇట్టి విశ్వాస ఘాతుకత్వానికి మనసొప్పని జనరల్ టమిసియర్ మాత్రం జాతీయ రక్షకదళ నాయకత్వ పదవికి రాజీనామా చేశాడు. అతని స్థానంలో చివరకు క్లెమెంట్ థామస్ సేనా నాయకుడైనాడు. అతని పదవీ కాలమంతటిలోనూ అతడు ప్రష్యాపైనగాక పారిస్

జాతీయ రక్షక దళంపై యుద్ధం చేస్తూ వచ్చాడు. వారికి ఆయుధా లివ్వడానికి అతడు నిరాకరించాడు. కార్మికవర్గ రక్షక దళాలపై బూర్జువావర్గ రక్షక దళాలను ప్రయోగించాడు. ట్రోచూ “పథకానికి” వ్యతిరేకులైన అధికారులందరినీ తొలగించాడు. తమ బద్ధ శత్రువులకు కూడా ఆశ్చర్యం కలిగించే ధైర్యసాహసాలను ప్రదర్శించిన కార్మికవర్గ రక్షక దళాలను ‘పిరికితనం’ సాకుతో బర్తరఫ్ చేశాడు. పారిస్ కార్మిక వర్గానికి వ్యక్తిగతమైన శత్రువుగా, తన పూర్వపు స్థానాన్ని సంపాదించుకున్నందుకు క్లెమెంట్ థామస్ చాలా గర్వపడ్డాడు. మార్చి 18కి కొద్ది రోజులకు ముందుగా, యుద్ధ మంత్రి అయిన లేఫ్లోకు, పారిస్ కార్మికవాదులలో మెరికలలాంటి వారిని నిర్మూలించటానికి తాను తయారు చేసిన పథకాన్ని అతడు సమర్పించాడు. వినోయ్ పలాయనం తర్వాత ఇతడు అనధికార గూఢచారిగా రంగంమీదికి రాక తప్పలేదు. వేల్స్ యువరాణి లండన్‌లో ప్రవేశించినప్పుడు జనసమర్థంలో జరిగిన ప్రాణ నష్టానికి ఆ యువరాణి ఎలా బాధ్యురాలో, క్లెమెంట్ థామస్, లే కామ్టేల మృతికి పారిస్ కార్మిక ప్రజలు ఆ విధంగానే బాధ్యులని చెప్పవచ్చు.

ప్లేస్ వెండోంలో నిరాయుధులైన పౌరులపై హత్యాకాండ జరిగింది అనేది ఒక కట్టుకథ. థయర్స్, రూరల్ సభ్యులు దాన్ని పదే పదే తోసి పుచ్చారు. ఈ కట్టుకథను ప్రచారం చేసే పనిని యూరోపియన్ జర్నలిజం సర్వెంట్లకు అప్పగించారు. పారిస్ అభివృద్ధి నిరోధకులు, సుస్థిరపాలన కోరే పెద్దలు, మార్చి 18 విజయంతో వణికిపోయారు. చిట్టచివరకు ప్రజాతీర్పు రానే వచ్చిందని వారు భయపడసాగారు. 1848 జూన్, 1871 జనవరి 22వ తేదీల మధ్య వారు హత్యచేసిన పౌరుల ప్రేతాలు, వారి కండ్ల ఎదుట ప్రత్యక్షం కాసాగాయి. వారి గాభరాయే వారికి శిక్ష. డి విల్లెలో పోలీసు సార్జెంట్లను నిరాయుధం చేసి, అరెస్టుచేసి ఉండవలసింది. అలా చేయకుండా పారిస్ నగర ద్వారాలను బాహాటంగా తెరచి, వర్సెల్స్ పారిపోవటానికి వారికి అనుమతిచ్చారు. సుస్థిర పాలనా ధోరణికి చెందిన వ్యక్తులకు ఎట్టి అపాయం జరగలేదు. పై పెచ్చు సమావేశాలు జరుపుకొని, పారిస్‌లోని బలమైన కేంద్రాలను ఒకదాని తర్వాత మరొక కేంద్రాన్ని పట్టుకోటానికి వారికి అవకాశం కల్పించబడ్డది. సాయుధ కార్మికవర్గం ప్రదర్శించిన ఈ ఔదార్యం, కేంద్ర కమిటీ ప్రదర్శించిన ఈ నిర్లక్ష్య భావం, వారి అసమర్థతకు చిహ్నంగా తర్వాత వ్యాఖ్యానించబడ్డది. సుస్థిర పాలనావాదుల పద్ధతులకిది పూర్తి వ్యతిరేకం. కనుకనే వారు శాంతియుత ప్రదర్శన పేరుతో బయలుదేరారు. ఫిరంగి గుండ్లతో వినోయ్ సాధించలేక పోయిన దానిని వారు ఈ ‘శాంతియుత’ ప్రదర్శనద్వారా సాధించదచుకున్నారు. మార్చి 22న, అట్టహాసాలతో, అల్లర చిల్లరి పనులతో ఒక

గుంపు, ఉన్నత వర్గాల నివాస భవనాల ప్రాంతం నుండి బయలుదేరింది. ఆ గుంపులో అన్ని రకాల సంఘ వ్యతిరేకశక్తులూ ఉన్నాయి. ఊరేగింపు అగ్రభాగాన సామ్రాజ్యంలో అప్రతిష్టపాలైన హీకెరీన్, కోట్లగన్ హెన్రీ డీ పెనె మొదలైన వారున్నారు. శాంతియుత ప్రదర్శన అనే పిరికితనపు ముసుగు క్రింద, ఈ నానా గోత్రీకులైన గుంపు రహస్యంగా ఆయుధాలు చేబూనారు. కవాతుతో నడిచారు. చెల్లాచెదురుగా ఉన్న రక్షక భటులను అవమానపరచి, నిరాయుధం చేశారు. తమ తోవలో కనిపించిన జాతీయ రక్షకదళ (నేషనల్ గార్డు) సభ్యుల పట్ల అలాగే ప్రవర్తించారు. రూడి లాపైక్స్ నుండి పక్కదోవపట్టి "కేంద్ర కమిటీ నశించాలి : హంతకులు నశించాలి: జాతీయ శాసన సభ శాశ్వతంగా వర్థిల్లాలి" అనే నినాదాలిచ్చుకుంటూ, పోలీసు లైన్లను ఛేదించుకు పోవటానికి ప్రయత్నించారు. ప్లేస్ వెండోమ్‌లోని జాతీయ రక్షక దళ ప్రధాన కార్యాలయాన్ని స్వాధీనం చేసుకోడానికి ప్రయత్నించారు. వారు పిస్తోలు కాల్పులకు దిగారు. ఇక చట్ట ప్రకారం వెళితే కుదరదని తెలుసుకున్న తరువాత అవతలి వైపు జాతీయ రక్షణ దళం కమాండర్ కాల్పులకు ఆదేశం ఇచ్చారు. జోషువా తప్పెటలు మోగించగానే జెరికో కోట గోడలు కూలిపోయినట్లు, తాము బల ప్రదర్శన చేసిన వెంటనే పారిస్ విప్లవం పతనమౌతుందని వీరు ఆశించారు. కానీ అలా జరక్కపోగా ప్రతికాల్పులు ఎదురైనాయి. ఒక్క గుండ్లవర్షంతో ఈ అల్లరి గుంపు చెల్లాచెదరై పారిపోయింది. పారిపోతూ వారు జాతీయ రక్షక దళానికి చెందిన ఇద్దరు సైనికులను చంపారు. తొమ్మిదిమందిని తీవ్రంగా గాయపర్చారు. (వారిలో ఒకరు కేంద్రకమిటీ సభ్యులు.) వాళ్లు పారిపోయిన ప్రాంతమంతా రివాల్వర్లు, కత్తులు, కత్తులపిడులతో నిండిపోయింది. 'నిరాయుధులైన' శాంతియుత ప్రదర్శనకు ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలి? దాంతో ఆ గుంపు అంతా చెల్లాచెదురైంది. 1849 జూన్ 13న జాతీయ రక్షకదళం (నేషనల్ గార్డులు) నిజంగానే శాంతియుత ప్రదర్శన జరిపింది. రోమ్ నగరంపై ఫ్రెంచి సైనికుల విద్రోహపూరిత దాడికి నిరసనగా ఇది జరిగింది. అప్పుడు పార్టీ ఆఫ్ ఆర్డర్ సేనాని చంగార్నియర్ అన్ని వైపుల నుంచి ఈ ప్రదర్శకులపై తన సైనికులను ప్రయోగించాడు. ఈ చర్యను జాతీయ శాసన సభ ముఖ్యంగా థియర్స్ ఎంతో హర్షించి, సమాజ రక్షకుడు అని చంగార్నయర్‌ను ప్రశంసించాడు. ఇలా ప్రయోగింపబడిన సైనికులు నిరాయుధులైన వారిని కత్తులతో నరికి, తుపాకులతో కాల్చివేశారు. గుర్రాల డెక్కల క్రింద తొక్కించారు. పారిస్‌ను ఆ విధంగా నిర్బంధ నగరంగా మార్చేశారు. డూఫారే హడావిడిగా నూతన నిర్బంధ శాసనాలను శాసనసభచే ఆమోదింపజేశాడు. అరెస్టులు, నిషేధాజ్ఞలతో కొత్త నిరంకుశ పాలన మొదలైంది. కాని ఈ వ్యవహారాలన్నిటినీ క్రిందిస్థాయికి చెందినవారు విప్లవకారులు మరొక విధంగా పరిష్కరించారు. 1871లో

ఏర్పడిన కేంద్ర కమిటీ, ఈ "ప్రశాంత ప్రదర్శన" వీరుల భరతం పట్టకుండా వదిలేసింది. దాంతో రెండు రోజుల తర్వాత వీరు తిరిగి సైసట్ సేనాని ఆధ్వర్యాన ఆయుధాలు ధరించి సాయుధ ప్రదర్శన జరిపారు. దానికి తగిన ప్రతిఘటన రావడంతో కట్టకట్టుకుని వర్సెయిల్స్‌కి పారిపోయారు. మాంట్ మార్ట్రిమీద దొంగదెబ్బతీయడం ద్వారా అంతర్యుద్ధాన్ని ప్రారంభించిన థయర్స్‌ను అరెస్టు చేయడానికి వెర్సయిల్స్‌కు కవాతు చేయకుండా కేంద్ర కమిటి పెద్ద తప్పు చేసింది. ఎట్టి ఆత్మరక్షణ సన్నాహాలు లేక, నిస్సహాయ స్థితిలోఉన్న వర్సైయిల్స్‌పైకి సైన్యాలను నడిపి, థయర్స్, అతని రూరల్స్ కుట్రలను మొగ్గలోనే తుంచివేయవలసింది. అలా చేయకపోవటం మహాపరాధం. అలా చేయపోగా, మార్చి 26న కమ్యూన్‌కు ఎన్నికలు జరిగే తేదీన, పార్టీ ఆఫ్ ఆర్డర్‌కు కూడా ఎన్నికలలో పాల్గొనే అవకాశం కలిగించింది. ఈ విధంగా వారు పారిస్‌లో దయాపరులైన' విజేతలను మంచిమాటలతో ముంచెత్తారు. లోలోపల మాత్రం సమయం రానీ మీ పని పడతాం అనుకున్నారు.

ఈ నాణెం రెండోవైపు ఇప్పుడు చూద్దాం. ఏప్రిల్ మొదట్లో థయర్స్ పారిస్‌పై రెండో సైనిక దాడి ప్రారంభించాడు. పారిస్ ఖైదీలలో మొదటి దళాన్ని వర్సెయిల్స్‌కు తెచ్చి దారుణమైన చిత్రహింసలకు గురిచేశాడు. ఎర్నెస్టు పికార్డ్ ఆ ఖైదీలను తన పాంటుజేబులో చేతులు పెట్టుకుని ఆ ఖైదీలను దూషిస్తూ అటూ ఇటూ తిరుగుతుంటే, వర్సేల్స్ గుంపు చేస్తున్న దారుణాన్ని శ్రీమతి థయర్స్, ఫేవ్రెలు, మేడమీద గౌరవనీయులైన స్త్రీల మధ్య నిలబడి ఆస్వాదించారు. ఖైదీలుగా చిక్కిన సైనికులను దారుణంగా హత్యచేశారు. ధైర్యశాలి అయిన మన స్నేహితుడు, ఉక్కు మనిషి అయిన జనరల్ డువాల్ ను ఎట్టి విచారణ లేకుండానే కాల్చివేశారు. గలిఫేట్ అతని భార్య చేతిలో కీలుబొమ్మ. ఆమె, రెండవ సామ్రాజ్యంలో జరిగిన తాగుబోతుల తందనాలలో ఎంతో అప్రతిష్ట సంపాదించున్న స్త్రీ. అలాంటి గలిఫెట్, జాతీయ రక్షకదళానికి చెందిన చిన్న విభాగాన్ని హత్య చేసినట్లు గంభీరంగా సగర్వంగా ప్రకటించుకున్నాడు. ఈ దళం నాయకుడు, ఉపనాయకులను అంతకు ముందే ఛాసుర్స్ మోసగించి, నిరాయుధం చేశాడు. పట్టుబడిన ప్రతి పారిస్ సైనికుణ్ణీ కాల్చివేయవసిందిగా మూకుమ్మడి ఉత్తరవు చేసినందుకుగాను వినోయ్‌ని, లీజియన్ ఆఫ్‌ది ఆనర్ గౌరవాధ్యక్షుడుగా థయర్స్ నియమించాడు. 1870 అక్టోబరు 31న జాతీయ రక్షణ ప్రభుత్వం అధిపతులను శిరచ్ఛేదం జరగకుండా రక్షించిన ఉన్నతమైన వ్యక్తి, ధైర్యశాలిఫ్లోరెన్సును ముక్కలు ముక్కలుగా నరికివేసిన పోలీసు అధికారి డిస్మారెట్‌ను సత్కరించారు. ఈ చిత్ర వధకు సంబంధించిన "ఆసక్తికరమైన విశేషాలను" జాతీయ

శాసనసభలో థయర్స్ ఎంతో విజయోత్సాహంతో వర్ణించాడు. పార్లమెంటులో సామాన్యవ్యక్తిగా ఉన్నవాడు తామర్లేను పాత్రను నిర్వహించవలసి వచ్చినందున కలిగిన స్వాతిశయంతో థయర్స్ తన అల్పత్వంలో, నాగరిక యుగంలో చూపవలసిన యుద్ధ మర్యాదలను కూడా తిరుగుబాటుదారులపట్ల చూపలేదు. క్షతగాత్రులను చేరవేసే వాహనాలను సైతం యుద్ధ వ్యవహారాలలో తటస్థమైనవిగా గుర్తించలేదు. తనలోని పెద్దపులి లక్షణాలను పూర్తిగా వ్యక్తీకరించుకోడానికి అవకాశం కల్పించబడిన కోతివలె అతడు ప్రవర్తించాడు. వాల్టేరు[27] ఈ విషయాన్ని ముందుగానే ఊహించాడు. (అనుబంధం చూడుము)

ప్రతీకార చర్యలు తీసుకోవలసిందిగా కమ్యూన్ ఏప్రిల్ 7న ఉత్తర్వు చేసింది. "వర్సైల్స్ నరభక్షకుల దాడినుండి పారిస్‌ను రక్షించటం, కంటికి కన్ను పంటికి పన్ను" విధానం అనుసరించటం ప్రతి ఒక్కరి విధి అని ప్రకటించింది. అప్పటికే థయర్స్ ఖైదీలపట్ల అమానుషంగా ప్రవర్తించటం మానుకోలేదు. పైపెచ్చు తన ప్రకటనలలో ఖైదీలను ఈ క్రింది విధంగా దూషించాడు: "పతనమైన ప్రజాస్వామ్యానికి చెందిన ఇంతటి అప్రతిష్టాకర వ్యక్తులు ఇంతవరకు ఎవరూ నిజాయితీగల వ్యక్తుల దృష్టిలో పడలేదు." నిజాయితీ గలవారు అంటే వీరి దృష్టిలో థయర్స్, అతని మంత్రులైన సెలవు చీటీల మనుషులు వంటి దొంగలని అర్థం. అయినప్పటికి కొంతకాలంపాటు ఖైదీలను కాల్చివేయడాన్ని నిలిపివేశారు. అయితే, ప్రతీకార చర్యలు తీసుకోండి అని కమ్యూన్ జారీచేసిన ఉత్తర్వు ఒట్టి బెదిరింపు మాత్రమేనని త్వరలోనే థయర్స్, అతని డిసెంబ్రిస్టు సేనానులు గ్రహించారు. పారిస్‌లో జాతీయ రక్షకదళం ముసుగులో ఉన్నవారి పోలీసు గూఢచారులను, వారి సేనానులను సైతం కమ్యూన్ నాయకులు ఏమీ చేయటం లేదని తెలిసిపోయింది. తుపాకి మందుగుండుతోసహా పట్టుబడిన కిరాయి సైనికులు సైతం వదలివేయబడ్డారు. దాంతో ఖైదీలను మూకుమ్మడిగా కాల్చివేయటం తిరిగి ప్రారంభమైంది. చివరిదాకా నిరంతరాయంగా కొనసాగింది. జాతీయ రక్షక దళాలు ఆశ్రయంగా చేసుకున్న ఇండ్లను పోలీసులు చుట్టముట్టారు. ఆ యిండ్లపై పెట్రోలియం కుమ్మరించి, అగ్గిపుల్ల అంటించారు. (యుద్ధాలలో మొట్టమొదటిసారిగా పెట్రోలియం ప్రసక్తి ఇక్కడే వినవస్తుంది) కాలిపోయిన శవాలను పత్రికలకు చెందిన అంబులెన్సు వాహనాలు టెర్నెస్‌కు తీసుకు వచ్చాయి. ఏప్రిల్ 25న జాతీయ రక్షక దళానికి చెందిన నలుగురు సైనికులు బెల్ ఎపైన్‌లో సాయుధ ఆశ్వికభటులకు లొంగిపోయారు. ఆ నలుగురిని ఒకరి తర్వాత ఒకరిని గలిఫెట్‌కి అనుచరుడైన ఒక 'గౌరవనీయ' సేనాధిపతి కాల్చివేశాడు. ఆ నలుగురిలో ఒకడైన

షెఫర్ చనిపోయాడనుకుని వదిలేశారు. కానీ అతను ప్రాణం పోసుకుని మెల్లిగా పాకి పారిస్ శివార్లకు చేరుకున్నాడు. కమ్యూన్‌కు చెందిన కమీషన్ ముందు జరిగిన విషయమంతా వివరించాడు. ఈ కమిషన్ నివేదిక ఆధారంగా టోలెన్ యుద్ధమంత్రిని సమాచారం అడగ్గా రూరల్స్‌కు చెందిన శాసన సభ్యులు ఒక్కుమ్మడి అల్లరి చేసి సమాధానం యివ్వకుండా లే ఫ్లోను ఆటంకపరిచారు. తమ సైన్యం చేసిన 'సాహసోపేత' చర్యలను ప్రశ్నించటం, వారిని అవమానించటమే అన్నారు. ఫెడరల్ సైనికులను తుపాకీ బాయ్‌నెట్‌లతో పొడిచి చంపారనీ, క్లామర్ట్‌పై తుపాకీ గుండ్ల వర్షాన్ని కురిపించారనీ థియర్స్ చేసిన పత్రికా ప్రకటన సాధారణంగా ఎలాంటి ఘటనలకు చలించని లండన్ టైమ్సు పత్రికను కూడా కదలించాయి. ఏమైనా, పారిస్‌పై దాడి చేసిన వారు, విదేశీ దురాక్రమణదారుల సాయంతో బానిస యజమానుల తిరుగుబాటును చెరెచ్చగొట్టినవారు ప్రాథమికంగా జరిపిన దౌర్జన్యాలను గురించి ఇప్పుడు పునశ్చరణ చేయ యత్నించటం హాస్యాస్పదంగా ఉంటుంది. ఈ ఘాతుకాలిలా జరిగిపోతూ ఉంటే, తన మరుగుజ్జు భుజస్కంథాలపై విరుచుకుబడిన అపార బాధ్యతలను గురించి పార్లమెంటులో చేసిన ప్రలాపాలన్నిటినీ మరిచిపోయి, శాసనసభ శాంతియుత వాతావరణంలో సమావేశ మౌతున్నదంటూ థియర్స్ ప్రకటనలు చేస్తూనే ఉన్నాడు. డిసెంబ్రిస్టు సేనానులతోను, జర్మన్ రాజకుమారులతోను నిరంతరం విందుల్లో తేలియాడుతూనే ఉన్నాడు. లేమ్టికా, క్లెమెంట్ థామస్‌ల ప్రేతాత్మలు సైతం అతని జీర్ణశక్తిపై ఎట్టి చెడ్డ ప్రభావాన్ని కలిగించలేదని నిరూపించుకుంటూ ఉన్నాడు.

# III

మార్చి 18వ తేదీ తెల్లవారే సరికి పారిస్ నగరం మొత్తం "కమ్యూన్ వర్ధిల్లాలి" అనే నినాదాలతో దద్దరిల్లిపోయింది. బూర్జువా వర్గానికంతా రాక్షసిలాగా కనపడే కమ్యూన్ అంటే ఏమిటి?

మార్చి 18న విడుదల చేసిన ప్రణాళికలో కేంద్రకమిటీ ఇలా చెప్పింది: "పాలక వర్గం వైఫల్యాలు, విద్రోహాల దృష్ట్యా, పౌర వ్యవహారాల నిర్వహణ బాధ్యతను ఇంక తమ చేతులలోకి తీసుకోవలసిన తరుణం వచ్చిందని పారిస్ కార్మిక వర్గం గ్రహించింది. ప్రభుత్వాధికారాన్ని చేజిక్కించుకుని, తమ భవిష్యత్తుకు తామే అధినాధులు కావటం. తమ నిర్ద్వంద్వమైన హక్కు అని, పవిత్ర బాధ్యత అనీ గ్రహించింది." అయితే కార్మికవర్గం, అప్పటికి ఏర్పడి ఉన్న రాజ్యాంగ యంత్రాంగాన్ని యధాతథంగా వాడుకోజాలదు, తన ప్రయోజనాలకు వినియోగించుకోజాలదు.

కేంద్రీకృత రాజ్యాంగాధికారానికి స్థిరసైన్యం, పోలీసు, బ్యూరాక్రటిక్ యంత్రాంగం, మత గురువులు, న్యాయస్థానాలు... ఇవన్నీ సర్వవ్యాపిత సాధనాలు. ఈ కేంద్రీకృత రాజ్యాంగాధికారం క్రమబద్ధమైన, అనువంశికమైన పని విభజన పథకంపై ఆధారపడి ఉన్నది. నిరంకుశ రాచరిక కాలం నుండి ఇది వస్తున్నది. భూస్వామ్య వ్యవస్థపై అప్పుడే తలెత్తుతున్న మధ్య తరగతి పోరాట సాధనంగా కూడా ఇది ఉపయోగపడింది. అయినప్పటికీ, దాని అభివృద్ధి అన్ని రకాల మధ్యయుగాల చెత్తతోను, పన్ను వసూళ్ళ వాటా హక్కులతోను, స్థానిక సౌకర్యాలతోను, మునిసిపల్ గిల్డు గుత్తాధికారంతోను, రాష్ట్రీయ చట్టాలతోను బందీకృతమై ఉన్నది. గతకాలపు ఈ అవశేషాలన్నిటినీ, 18వ శతాబ్దపు ఫ్రెంచి మహా విప్లవమనే, బ్రహ్మాండమైన చీపురు కట్ట చెత్తకుండీలోకి తోసి వేసింది. ఆ విధంగా మొదటి సామ్రాజ్యంలో ఆవిర్భవించిన ఆధునిక రాజ్యాంగం అనే ఉపరితలం అభివృద్ధికి ఆటంకంగా ఉన్న అన్నిటినీ సామాజిక భూతలం నుండి ఒకేసారి తొలగించింది. ఈ ఆధునిక రాజ్యాంగం సైతం, ఆధునిక ఫ్రాన్సుపైన అర్థ ఫ్యూడల్ యూరపు సాగించిన ఉమ్మడి యుద్ధాల ఫలితంగా ఆవిర్భవించినదే. ఆ తర్వాత పాలనాకాలాల్లో పార్లమెంటరీ పెత్తనంలో ఉన్న ప్రభుత్వం, అనగా ఆస్తిపర వర్గాల ప్రత్యక్ష పాలన అపారమైన జాతీయ రుణాలకు, ప్రజలను అణచివేసే పన్నుల భారానికి నిలయమైంది. పదవులకు, అన్యాయార్జిత ధనానికి, ఆశ్రిత పక్షపాతానికి నిరోధించ వీలులేని ఆకర్షణా కేంద్రమైంది. పాలక వర్గాలలోని దురాశాపరుల ముఠాలకు ఘర్షణా కేంద్రం కావటమే కాక సమాజంలో వచ్చిన ఆర్థిక పరిణామాల ఫలితంగా, దాని రాజకీయ స్వభావం కూడా మారిపోయింది. ఆధునిక పరిశ్రమల పురోగతి క్రమం పెట్టుబడిదారులకు, కార్మికులకు మధ్యగల వర్గ శత్రుత్వాన్ని పెంచి, విస్తృతం చేసి, తీవ్రతరం చేస్తున్నది. రాజ్యాంగ అధికారం, అధికాధికంగా కార్మికులపై పెట్టుబడిదారుల జాతీయ అధికార కేంద్రంగా రూపొందింది. సామాజిక బానిసత్వానికై సంఘటితమైన ప్రభుత్వ శక్తిగా, వర్గ నియంతృత్వ సాధనగా రూపొందింది. వర్గ పోరాటంలో అభ్యుదయకర దశను సూచించే ప్రతి విప్లవం తర్వాత రాజ్యాంగ యంత్రం యొక్క కల్తీలేని నిర్బంధ స్వభావం, అధికాధికంగా స్పష్టమైన రూపంలో వ్యక్తమౌతూ ఉంటుంది. 1830 విప్లవం, తర్వాత ప్రభుత్వాధికారం, భూస్వాముల చేతులలో నుండి పెట్టుబడిదారుల చేతులలోకి మారింది. అంత వరకూ శ్రామిక జనులకు దూర శత్రువుగా ఉన్న రాజ్యాంగ యంత్రం దీంతో సన్నిహిత శత్రువైంది. ఫిబ్రవరి విప్లవం పేరుతో రాజ్యాంగ, అధికారాన్ని చేజిక్కించుకున్న బూర్జువా రిపబ్లికన్లు, తమ రాజ్యాధికారంతో జూన్ హత్యాకాండ సాగించి 'సామాజిక' రిపబ్లిక్ అంటే కార్మికులను ఇలా సామాజికంగా బానిసలుగా

అణచివేసే రిపబ్లిక్ అని కార్మికులను ఒప్పించగలిగారు. ప్రభుత్వ బాధ్యతలు, ఆదాయాలు, క్షేమంగా బూర్జువా రిపబ్లికన్‌లకు దఖలు పరచవచ్చునని బూర్జువా వర్గంలోని అత్యధిక రాచరికవాదులనూ, భూస్వామ్య వర్గాన్నీ నచ్చచెప్పగలిగారు. అయినప్పటికి జూన్‌లో జరిగిన వీరోచిత దాడి తర్వాత, బూర్జువా రిపబ్లికన్లు అగ్రస్థాయి నుండి "పార్టీ ఆఫ్ ఆర్డరు" కన్నా దిగువ స్థాయికి నెట్టివేయ బడ్డారు. ఉత్పత్తి చేసే వర్గాల పట్ల బాహాటంగా శత్రుత్వాన్ని వ్యక్తంచేసే నూతన పోకడకు చిహ్నంగా దోపిడీ వర్గాలకు చెందిన అన్ని పార్టీలు, ముఠాలు కలిసి ఏర్పరచినదే ఈ "పార్టీ ఆఫ్ ఆర్డర్". ఈ జాయింట్ స్టాక్ గవర్నమెంటుకు సరియైన రూపం లూయీ బోనపార్టీ అధ్యక్షుడిగా ఉండే పార్లమెంటరీ రిపబ్లిక్. థియర్స్ ప్రభుత్వం ఒక వర్గ టెర్రరిస్టులకు చెందిన, 'నీచమైన గుంపు'. థియర్స్ చెప్పినట్లు, పార్లమెంటరీ రిపబ్లిక్కు పాలక వర్గంలోని వివిధ ముఠాలను అతితక్కువగా చీల్చిన మాట నిజమే. అదే సమయంలో అది తన వర్గానికి,దాని వెలుపల ఉన్న మొత్తం సమాజానికి మధ్య తీవ్ర అఖాతాన్ని సృష్టించింది. వెనుకటి ప్రభుత్వాలలో తమ వివిధ ముఠాల మధ్య గల వైరుధ్యాలు, రాజ్యాంగ యంత్రంపై విధించిన కొద్దిపాటి అదుపు, ఈ కొత్త ఐక్యతతో తొలగిపోయింది. కార్మిక వర్గ తిరుగుబాటు ప్రమాదకరంగా పరిణమించటంతో వారు ఇప్పుడు రాజ్యాంగాధికారాన్ని పెట్టుబడిదారుల జాతీయ యుద్ధ సాధనగా కార్మికులపై ఎట్టి దాక్షిణ్యం లేకుండా ప్రయోగించ సాగారు. అయితే ఉత్పత్తి చేసే వర్గాలపై నిరంతరాయంగా జరిపే దాడిలో వారు తప్పనిసరిగా, కార్యనిర్వాహక విభాగానికి అపారమైన అధికారాలు కట్టబెట్టారు. ఆ మేరకు, తమ స్వంత పార్లమెంటరీ అధికారానికి కేంద్రమైన జాతీయ శాసనసభ అధికారాలను ఒక్కొక్కటే వదలించి వేశారు. కార్యనిర్వాహక వర్గ పెత్తనానికి రక్షణగా ఉన్న అధికారాలన్నిటినీ వదులుకున్నారు. లూయీ బోనపార్టీ వ్యక్తి రూపంలో కార్యనిర్వాహక వర్గం వారిని బైటికి గెంటివేశాడు. "పార్టీ ఆఫ్ ఆర్డర్" రిపబ్లిక్ సహజ సిద్ధమైన శిశువు రెండవ సామ్రాజ్యం.

సామ్రాజ్యం అంతఃపుర కుట్ర ద్వారా జన్మించింది. సార్వజనీన వోటింగు ద్వారా ఆమోద ముద్ర పొందింది. ఈ సామ్రాజ్యం పెట్టుబడిదారులకు, కార్మికులకు జరిగే పోరాటంలో ప్రత్యక్షంగా భాగాస్వాములు గాని అసంఖ్యాక ఉత్పత్తిదారులైన రైతాంగంపై ఆధారపడినట్లు ప్రకటించుకున్నది. పార్లమెంటరీ వ్యవస్థను విచ్ఛిన్నం చేయడం ద్వారా కార్మిక వర్గాన్ని రక్షిస్తున్నట్లు చెబుతూ ఆస్తిపర వర్గాలకు నగ్నంగా లొంగిపోయింది. మరోవైపు కార్మిక వర్గంపై, ఆస్తిపర వర్గాల ఆర్థిక ఆధిపత్యాన్ని రక్షించటం ద్వారా ధనిక వర్గాలను రక్షించనున్నట్లు ప్రకటించుకున్నది. ఆఖరుకు జాతీయ ప్రతిష్ట అనే భ్రమలో సర్వ ప్రజలను ముంచెత్తటం ద్వారా అన్ని వర్గాలనూ

ఐక్యం చేయనున్నట్లు ప్రకటించుకున్నది. నిజానికి జాతిని పరిపాలించే శక్తిని బూర్జువావర్గం అప్పటికే పోగొట్టుకొని, మరోవైపు కార్మిక వర్గం ఇంకా ఆ శక్తిని పొందని ఆ దశలో సాధ్యమైన ప్రభుత్వ రూపం సామ్రాజ్యం మాత్రమే. సమాజాన్ని రక్షించిన శక్తిగా యావత్తు ప్రపంచం దానిని కీర్తించింది. దాని పరిపాలనలో బూర్జువా సమాజం అన్ని రకాల రాజకీయ ఆందోళనలను వదిలివేసి, తాను సైతం ఊహించని అభివృద్ధిని సాధించింది. దాని పరిశ్రమ, వ్యాపార రంగాలు అపారమైన రీతిలో విస్తరించాయి. ఆర్థికపరమైన మోసాలు, అంతర్జాతీయ విలాస నృత్యాలలో తేలియాడాయి. ఒక వైపున ప్రజలు దరిద్రంలో కుమిలి పోతుంటే, గౌరవ మర్యాదలన్నిటినీ కోల్పోయిన భోగ లాలసత, తన జుగుప్సాకరమైన ఆకర్షణను, అట్టహాసాన్ని సిగ్గు లేకుండా ప్రదర్శించుకున్నది. రాజ్యాంగ యంత్రం, సమాజానికంటె ఉన్నతంగా పైన ఎక్కడో ఉన్నట్లు నటిస్తుంది. నిజానికి సమాజంలోని కుళ్ళు అంతటికీ అదే కేంద్రం. అత్యంత హేయమైన అవినీతి పుట్ట. దాని కుళ్ళు, అది కాపాడిన సమాజపు కుళ్ళు, ప్రష్యా తుపాకులు బహిర్గతం చేశాయి. ఈ పాలనా యంత్ర కేంద్రాన్ని పారిస్ నుండి బెర్లిన్‌కు మార్చాలని ఈ ప్రభుత్వమే తీవ్రంగా ప్రయత్నించింది. అదే సమయంలో, సామ్రాజ్యవాదం అనేది రాజ్యాంగ యంత్రపు అత్యంత వ్యభిచార రూపకమైన అంతిమ రూపం. అపుడపుడే తల ఎత్తుఉన్న మధ్యతరగతి సమాజం భూస్వామ్య వ్యవస్థ నుండి తాను విముక్తి చెందటానికి ఒక సాధనగా సామ్రాజ్యవాదాన్ని భావించ సాగింది. అయితే పూర్తిగా ఎదిగిన బూర్జువా సమాజం అంతిమంగా ఈ వ్యవస్థను, కార్మిక వర్గాన్ని, బానిసత్వంలో ఉంచేందుకు పెట్టుబడిదారీ వర్గం చేతిలో సాధనంగా మార్చి వేసింది.

సామ్రాజ్యానికి పూర్తిగా విరుద్ధమైనది కమ్యూన్. పారిస్ కార్మికవర్గం 'సోషల్ రిపబ్లిక్' పేరుతో ఫిబ్రవరి విప్లవం నిర్వహించింది. రాచరిక రూపంలోని వర్గ పాలనను మాత్రమే కాక, మొత్తం వర్గ పాలననే రద్దు చేసే రిపబ్లిక్ ఏర్పడాలనే అస్పష్టమైన ఆకాంక్షను పై మాట వ్యక్తం చేస్తున్నది. రిపబ్లిక్ యొక్క కచ్చితమైన రూపం కమ్యూన్.

వెనకటి ప్రభుత్వాధికారానికి, అదే సమయంలో ఫ్రెంచి కార్మిక వర్గానికి బలమైన స్థావరం పారిస్. సామ్రాజ్యం సంక్రమింప చేసిన వెనుకటి ప్రభుత్వాధికారాన్ని కొనసాగింప యత్నించిన థయర్స్, రూరల్స్ యొక్క ప్రయత్నాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఆయుధాలతో తిరుగుబాటు చేసింది. పారిస్‌పై జరిగిన ముట్టడి ఫలితంగా సైన్యం అంతరించి, ఆ స్థానంలో జాతీయ రక్షక దళం ఏర్పడ్డది. ఇందులో కార్మిక శ్రమజీవులు ఎక్కువ. కనుకనే కార్మిక వర్గం తిరుగుబాటు చేయగలిగింది. ఈ వాస్తవాన్ని

ఇప్పుడొక వ్యవస్థగా మార్చటానికి యత్నాలు జరిగాయి. కనుక కమ్యూన్ చేసిన మొదటి డిక్రీలోనే, స్థిర సైన్యాన్ని రద్దుచేసి ఆ స్థానంలో ప్రజలను సాయుధులను చేసింది.

పట్టణంలోని వివిధ వార్డులలో సార్వజనీన వోటింగ్ ప్రాతిపదికపై ఎన్నికైన మునిసిపల్ కౌన్సిలర్స్‌తో కమ్యూన్ ఏర్పడ్డది. స్వల్ప కాలం మాత్రమే వీరు పదవీ బాధ్యతలు నిర్వహిస్తారు. కమ్యూన్ సభ్యులలో అధిక సంఖ్యాకులు సహజంగానే కార్మికుల లేక కార్మిక వర్గం గుర్తింపు పొందిన ప్రతినిధులు. కమ్యూన్ పార్లమెంటరీ సంస్థ కాదు, క్రియాశీల సంస్థ. శాసన విధులు, కార్యనిర్వాహక విధులు రెంటినీ కలిగి ఉంది. కేంద్ర ప్రభుత్వ ఏజంటుగా అంతవరకూ పని చేస్తున్న పోలీసు శాఖకు రాజకీయ హక్కులన్నీ రద్దు చేయబడ్డాయి. సర్వ కాలాలకు అది కమ్యూన్‌కే బాధ్యురాలు; దానిని రద్దు చేసే హక్కు కూడా కమ్యూన్ కున్నది. పరిపాలనా విభాగానికి చెందిన అన్ని శాఖల ఉద్యోగుల పరిస్థితి కూడా అంతే. కమ్యూన్ సభ్యుల స్థాయి నుండి క్రింది వరకు ప్రభుత్వోద్యోగులందరూ కార్మికులతో సమానమైన వేతనాల మీదనే పని చేయాలి. ఉన్నతాధికార పదవులతో పాటు, ఆ అధికారులకు లభించే ప్రత్యేక అలవెన్సులు, స్వార్థ ప్రయోజనాలు అన్నీ రద్దయినాయి. కేంద్ర ప్రభుత్వ కీలుబొమ్మల స్వంత ఆస్తులుగా ఉన్న పౌర బాధ్యతలన్నీ రద్దయినాయి. మునిసిపల్ పరిపాలన మాత్రమే కాదు, ఇంతవరకు ప్రభుత్వ యంత్రాంగం నిర్వర్తిస్తున్న చొరవ యావత్తూ కమ్యూన్‌కు దఖలు పడ్డాయి.

పాత ప్రభుత్వ దోపిడీకి ప్రత్యక్ష సాధనాలయిన స్థిర సైన్యాన్ని, పోలీసును ఈ విధంగా వదలించుకున్న తర్వాత దోపిడీ నైతికరూపమైన 'మతాధిపతుల అధికారాన్ని' రద్దు చేయటానికి కమ్యూన్ సంకల్పించింది. ప్రైవేట్ వ్యక్తుల స్వంత సంస్థలుగా ఉన్న చర్చిల హక్కులను, ఆస్తులను రద్దు చేసింది. మతాధిపతులందరినీ వారి వ్యక్తిగత జీవిత రంగాలకు పంపివేసింది. వారి పూర్వీకులైన మత ప్రవక్తలవలె, విశ్వాసపరులు ఐచ్ఛికంగా చదివించే భిక్షలపై జీవించవలసిందిగా ఆదేశించింది. విద్యాసంస్థలన్నిటిలోకి ప్రజలందరికీ ఉచిత ప్రవేశం కల్పించబడ్డది. అదే సమయంలో విద్యా సంస్థలలో ప్రభుత్వం, చర్చి జోక్యం నివారించింది. ఆ విధంగా విద్య యావన్మందికీ అందుబాటులోకి రావడమేగాక, శాస్త్రవిజ్ఞానంపై ప్రభుత్వాధికారం, వర్గ పక్షపాతం విధించిన సంకెళ్ళు కూడా రద్దు చేయబడ్డాయి.

న్యాయశాఖాధికారులందరూ అంతకాలం ధరిస్తున్న బూటకపు స్వాతంత్ర్య ముసుగు తొలగించబడ్డది. ఈ ముసుగు క్రింద వారు అధికారంలోకి వచ్చే ప్రతి

ప్రభుత్వానికి లొంగి పడివుండటం మినహా మరేదీ చేయటంలేదు. ఈ ప్రభుత్వాల పట్ల విశ్వాసపాత్రంగా వుంటామని ప్రమాణాలు చేస్తూ, వాటిని భగ్నంచేస్తూ వుండే వారు. మిగతా ప్రభుత్వోద్యోగులందరి వలెనే మేజిస్ట్రేట్లు, న్యాయమూర్తులు ఎన్నుకోబడాలి. ప్రజలకు బాధ్యత వహించాలి. ప్రజలు వీరిని వెనక్కు రప్పించే హక్కు కలిగి వుంటారు.

పారిస్‌లోని అన్ని గొప్ప పారిశ్రామిక కేంద్రాలకు సహజంగానే పారిస్ కమ్యూన్ నమూనాగా వుంటుంది. పారిస్‌లోనూ, రెండో తరహా కేంద్రాలలోనూ కమ్యూన్ తరహా పరిపాలన ఏర్పడిన మీదట, రాష్ట్రాలలో పాత పద్ధతికి చెందిన కేంద్రీకృత ప్రభుత్వపాలన అంతరించి, ఉత్పత్తిదారుల స్వయంపరిపాలన ఏర్పడ సాగింది. జాతీయ నమూనా పరిపాలనా పద్ధతి నొకదానిని స్థూలంగా రూపొందించింది. దీనిని పూర్తిగా అభివృద్ధి చేసే అవకాశం కమ్యూన్‌కు లభించలేదు. ఈ నమూనా ప్రకారం, దేశంలోని అతి చిన్న కుగ్రామపు పరిపాలనా రూపం కూడా కమ్యూన్ మాదిరిగానే వుండాలని గ్రామీణ జిల్లాలలో స్థిర సైన్యం రద్దయి ఆ స్థాయిలో జాతీయ రక్షక దళం ఏర్పడాలి. దీని జీవితకాలం అతి స్వల్పంగా వుండాలి. ప్రతి జిల్లాలోని గ్రామీణ కమ్యూన్‌లు, తమ ఉమ్మడి వ్యవహారాలను, కేంద్ర పట్టణంలో జరిగే ప్రతినిధుల సభ ద్వారా నిర్వహించుకోవాలి. ఈ జిల్లా సభలు, తిరిగి పారిస్‌లోని జాతీయసభకు ప్రతినిధులను పంపాలి. ప్రతినిధిని ఏ క్షణంలో నయినా వెనుకకు పిలిపించే హక్కు ప్రజలకున్నది. తన నియోజకవర్గంలోని సభ్యుల లాంఛన ప్రాయమైన ఆదేశాలకు వారు కట్టుబడి వుండాలి. కేంద్ర ప్రభుత్వానికి అప్పటికి కొన్ని ముఖ్యమైన బాధ్యతలు మిగిలే వుంటాయి. కొందరు కావాలని దుష్ప్రచారం చేసినట్లు కేంద్రప్రభుత్వాన్ని అణచివేయలేదు. ఈ బాధ్యతలను కమ్యూన్‌కు సంబంధించిన అనగా బాధ్యతగల అధికారులు నిర్వహించాలి. జాతి సమైక్యతను విచ్ఛిన్నం చేయరాదు. పైపెచ్చు కమ్యూన్ రాజ్యాంగ చట్టప్రకారం అది సంఘటితం కావాలి. రాజ్యాంగ యంత్ర అధికారాన్ని ధ్వంసంచేయటం ద్వారా, అది మరింత వాస్తవ రూపం ధరించాలి. ఈ రాజ్యాంగ యంత్రం జాతికంటె అతీతంగా, స్వతంత్రంగా ఐక్యతకు తానే ప్రతీక అయినట్లు చెప్పుకుంటున్నది. వాస్తవానికి రాజ్యాంగ యంత్రం పరాన్నభుక్కు స్వభావం కలిగిన ఒక విపరీత సృష్టి మాత్రమే. పాత ప్రభుత్వపు నిర్బంధ సాధనాలకు శస్త్రచికిత్స చేస్తూనే, ప్రభుత్వం చట్టరీత్యా నిర్వహించవలసిన బాధ్యతలను, సమాజానికంటె అతీతంగా, ఉన్నతంగా వ్యవహరించే సంస్థ చేతులలోనుండి తొలగించి సమాజం యొక్క బాధ్యతాయుత ప్రతినిధులకు అప్పగించబడ్డాయి. పాలకవర్గానికి చెందిన

సభ్యుడు ప్రజలకు సరిగ్గా ప్రాతినిధ్యం వహిస్తున్నాడా లేదా అనే సమస్యను మూడేండ్లకో ఆరేండ్లకో ఒకసారి నిర్ణయించే దానికంటె కమ్యూన్‌లలో సంఘటితమైన ప్రజలు సార్వజనీన ఓటింగ్ హక్కు ద్వారా ఎప్పటికప్పుడు నిర్ణయిస్తారు. తన పరిశ్రమలో పనివారిని, మేనేజర్‌లను ఎన్నుకోవటానికి యజమాని తన వ్యక్తిగత హక్కును వినియోగించుకున్న విధంగానే ఇది జరుగుతుంది. వ్యక్తులకు లాగానే కంపెనీలకు కూడా, వ్యాపార విషయాలలో సరియైన మనిషిని సరైన స్థానంలో ఎలా వుంచాలో తెలుసు. ఒకసారి తప్పుచేస్తే దానిని వెంటనే ఎలా సవరించుకోవాలో కూడాతెలుసు. కాగా సార్వజనీన ఓటింగ్ హక్కును రద్దుచేసి, దాని స్థానంలో ఆనువంశిక అధికార సంస్థను ఏర్పరచటం, కమ్యూన్ లక్ష్యాలకే పూర్తిగా విరుద్ధమైన విషయం.

పూర్తిగా నూతన చారిత్రక సృష్టి అయిన సామాజిక స్వరూపాలను పాత సామాజిక స్వరూపాల ప్రతిరూపాలని, లేదా కాలం చెల్లిన సామాజిక స్వరూపాలకు సైతం ప్రతిరూపాలని పొరపడటం సాధారణంగా తరచు జరుగుతుంటుంది. వాటితో ఇది కొంత సామ్యం కలిగివుండవచ్చు. ఆధునిక రాజ్యాంగ యంత్రాన్ని ధ్వంసం చేసిన కమ్యూన్, అదే విధంగా మధ్య యుగాల కమ్యూన్‌కు పునస్సృష్టిగా కొందరు పొరబడుతున్నారు. మధ్య యుగాల కమ్యూన్, రాజ్యాంగ యంత్రానికి పూర్వమే ఏర్పడి, క్రమంగా అందులో అంతర్భాగమైంది. మాంటిస్క్యూ గిరాండిన్స్‌లు కలలు గన్నట్లు పెద్ద రాజ్యాన్ని చిన్న రాష్ట్రాల సమాఖ్యగా రూపొందించే యత్నంగా కమ్యూన్ రాజ్యాంగాన్ని గురించి పొరపడుతున్నారు. మొదట్లో రాజకీయ బలప్రయోగం ద్వారా ఏర్పడినప్పటికి, పెద్ద జాతుల ఐక్యత, సామాజిక ఉత్పత్తికి బలమైన ప్రోత్సాహక శక్తిగా వుంది. రాజ్యాంగయంత్రానికి, కమ్యూన్‌కు గల శతృ వైరుధ్యాన్ని, అధికార కేంద్రీకరణకు వ్యతిరేకంగా అనాదిగా జరుగుతున్న పోరాటంయొక్క అతిశయ రూపంగా భ్రమపడుతున్నారు. బూర్జువా ప్రభుత్వ రూపం సాంప్రదాయమైన రూపంలో అభివృద్ధి కాకపోడటానికి, ఫ్రాన్సులోవలె కొన్ని చారిత్రక పరిస్థితులు కారణం కావచ్చు. ఇంగ్లాండులోవలె ప్రభుత్వ యంత్రాంగం యొక్క ముఖ్య విభాగాలన్నీ అవినీతికరమైన పొట్టి చొక్కాల ఉద్యోగులతో లంచగొండి కౌన్సిలర్లతో, పట్టణాలలో న్యాయచట్టాలను కఠినంగా అమలుజరిపే పేద అధికారులు, జిల్లాలలో దాదాపు అనువంశికంగా పదవులు అధిష్టించే ఉద్యోగులతో నిండివుండవచ్చు. పరాన్న భుక్కు అయిన రాజ్యాంగ యంత్రం, సమాజం యొక్క స్వేచ్ఛాయుతమైన చలనాన్ని అరికట్టి, జలగలా దాని రక్తం పీలుస్తూ తాను స్వంతం చేసుకున్న శక్తులన్నిటినీ కమ్యూన్ రాజ్యాంగచట్టం పునరుద్ధరించి వుండేది. ఈ ఒక్క చర్య ద్వారానే అది ఫ్రాన్స్ పునరుజ్జీవనానికి తోడ్పడివుండేది. లూయీ ఫిలిప్పొ కాలంలో దేశం మీద చలాయించిన తమ పెత్తనం

కమ్యూన్ ద్వారా పునరుద్ధరించే యత్నం జరుగుతుందని ఫ్రెంచి మధ్యతరగతి ఆశించింది. ఈ అధికారం లూయీ నెపోలియన్ కాలంలో రద్దయింది. పట్టణాలపై గ్రామాల పరిపాలన యేర్పడినట్లుగా ఆనాడు భ్రమ పెట్టడం జరిగింది. నిజానికి, కమ్యూనల్ సజీవంగా ఉండటం ద్వారా సహజంగానే స్థానిక మునిసిపల్ సంఘాలకు స్వేచ్ఛ లభిస్తుంది. అయితే ఇప్పుడు తొలగించబడిన రాజ్యాంగ యంత్రంపైన అదుపుచేసే భావన మాత్రం కమ్యూన్‌కు లేదు. ప్రష్యన్ రాజ్యాంగం అనే పోలీసు యంత్రాంగానికి, పట్టణ పరిపాలనను ఉపాంగ చక్రాలుగా ప్రష్యన్ మునిసిపల్ రాజ్యాంగం మార్చివేసింది. ఈ ప్రష్యన్ మునిసిపల్ రాజ్యాంగాన్ని 1791 ఫ్రెంచి మునిసిపల్ సంస్థలు అనుసరించినట్లుగా పారిస్ కమ్యూన్ కూడా అనుకరించనున్నదని ఆరోపించటం బిస్మార్క్‌కే చెల్లింది. ఈ బిస్మార్క్ దారుణమైన హత్యాయత్నాలతో కూడిన కుట్రలు చేస్తూవుంటాడు. ఆ యత్నాల్లో కొంత విశ్రాంతి వచ్చినప్పుడల్లా. తన మానసిక స్థాయికి తగిన రచనలు చేస్తూవుంటాడు. బెర్లిన్ నుండి వెలువడే పచ్[29] పత్రికకు వ్యాసాలు రాయటం అతని స్థాయికి తగిన పని. ఆ స్థాయికి తగినవాడు కనకనే పై ఆరోపణలు చేస్తున్నాడు.

స్థిరసైన్యం, ప్రభుత్వ బ్యూరాక్రటిక్ యంత్రాంగం అనే రెండు దుబారాఖర్చు పద్దులను ధ్వంసం చేయటంద్వారా, పారిస్ కమ్యూన్ అన్ని బూర్జువా విప్లవాలకు తక్కువ వ్యయంతో కూడిన ప్రభుత్వం అనే నినాదాన్ని ఇచ్చింది. కమ్యూన్ జీవించడమంటేనే రాచరికం నశించడం. ఈ రాచరిక వ్యవస్థ, కనీసం యూరప్‌లో వర్గపాలనలో అనివార్యమైన అనుబంధంగా ముసుగుగా తయారైంది. రిపబ్లిక్‌కు అవసరమైన నిజమైన ప్రజాతంత్ర వ్యవస్థలను కమ్యూన్ సమకూర్చింది. కాని తక్కువ వ్యయంతో కూడిన ప్రభుత్వం గాని నిజమైన రిపబ్లిక్ గాని కమ్యూన్ యొక్క అంతిమ లక్ష్యం కాదు; ఇవి కమ్యూన్ యొక్క అనివార్యమైన అనుబంధాలు మాత్రమే.

కమ్యూన్‌కు బహువిధమైన వ్యాఖ్యానాలు వచ్చాయి. బహు విధాలైన వర్గాలు కమ్యూన్ తమ ప్రయోజనాలకు లాభకరమని భావించారు. కనుక కమ్యూన్ అతి విస్తృత రాజకీయ స్వరూపమని స్పష్టమౌతూనే ఉంది. అంతకు పూర్వపు ప్రభుత్వాలన్నీ ఖచ్చితమైన దోపిడీ స్వభావాన్ని కలిగి ఉండేవి. కమ్యూన్ అసలు రహస్యం ఇది. అది ప్రధానంగా కార్మికవర్గ ప్రభుత్వం. ఉత్పత్తిచేసే వర్గాలు, దోపిడీచేసే వర్గాలకు వ్యతిరేకంగా సాగించిన పోరాట ఫలితంగా ఇది ఆవిర్భవించింది. కార్మికుల ఆర్థిక విముక్తి సాధించటానికిగాను ఎట్టకేలకు రూపొందిన రాజకీయ రూపం.

ఈ ఆఖరు షరతువల్ల కాకపోతే, కమ్యూన్ రాజ్యాంగాన్ని అర్థం చేసుకోలేము. అదొక భ్రమగా కనిపిస్తుంది. ఉత్పత్తిదారుల రాజకీయ పరిపాలన, సామాజిక బానిసత్వము సహజీవనం చేయలేవు. వర్గాలు, వర్గపరిపాలన ఏ ఆర్థిక పునాదులపై ఉన్నాయో ఆ పునాది నిర్మూలించడానికి కమ్యూన్ ఒక సాధనగా ఉపయోగపడాలి. కార్మికులు విముక్తి చెందితే ప్రతి వ్యక్తి శ్రమజీవే ఔతాడు. ఉత్పాదక శ్రమ, ఒక ప్రత్యేక వర్గ లక్షణంగా ఉండదు.

ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయం గత అరవై సంవత్సరాలుగా శ్రమ విముక్తిని గురించి అపారమైన సాహిత్యం వెలువడ్డది. సుదీర్ఘ చర్చలు సాగాయి. కాగా ఈ సమస్యను శ్రమజీవులు దృఢచిత్తంతో తమ చేతులలోకి తీసుకున్న మరుక్షణం. ప్రస్తుత సమాజపు బాకాలన్నీ సమాజాన్ని సమర్థించే పదజాలంతో ముందుకొస్తాయి. ఈ సమాజానికి, పెట్టుబడి, వేతన బానిసత్వం – అనేవి రెండు ముఖాలు పెట్టుబడిదారీ సమాజ అంతర్గత వైరుధ్యాలు ఇంకా అభివృద్ధి కాలేదని, ఈ సమాజం ఇంకా కన్యాత్వపు అమాయక దశలోనే ఉన్నదని ఈ బాకాలు ప్రచారం చేస్తాయి. ఈ సమాజంపై భ్రమలు ఇంకా బద్దలు కాలేదని, వెలయాలివంటి ఈ సమాజ వాస్తవికత ఇంకా బహిర్గతం కాలేదని వీరు వాదిస్తారు. నాగరికతకు పునాదిఐన ఆస్తివ్యవస్థను కమ్యూన్ ధ్వంసం చేస్తుందని వీరుగగ్గోలు పెడుతున్నారు. అవును, పెద్దమనుషులారా అసంఖ్యాకుల శ్రమ, అల్పసంఖ్యాకుల సంపదగా మారే ప్రస్తుత వర్గ ఆస్తిని కమ్యూన్ రద్దు చేయాలనే వాంచిస్తున్నది. దోపిడీదారులను రద్దు చేయాలనే కమ్యూన్ కోరుకుంటున్నది. కార్మికులను దోపిడీ చేయటానికి, బానిసలుగా చేయటానికి ప్రధాన సాధనగాఉన్న ఉత్పత్తి సాధనాలను, భూమి, పెట్టుబడులను, నిజమైన స్వంత ఆస్తిగా మార్చాలని కమ్యూన్ ఆశిస్తున్నది. స్వేచ్ఛగా సమీకృతమైన కార్మికుల పనిముట్లుగా, ఉత్పత్తి శక్తులను మార్చాలని యత్నిస్తున్నది. కాని ఇదంతా కమ్యూనిజం అసాధ్యమైన కమ్యూనిజం! అని వారు గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుత వ్యవస్థను ఈ రూపంలో కొనసాగించటం అసాధ్యమని ఊహించే తెలివితేటలు గల పాలకవర్గ ప్రతినిధులు, అలాంటివారు చాలామంది ఉన్నారు. ఇప్పుడు సహకార ఉత్పత్తి విధానాన్ని పిలవని పేరంటంగా నోరారా సమర్థిస్తున్నారు. కాగా సహకార ఉత్పత్తి, ఒక ఎర లేక బూటకంగా ఉండరాదు అనుకుంటే పెట్టుబడిదారీ వ్యవస్థ స్థానాన్ని అది ఆక్రమించాలనుకుంటే సంయుక్త సహకార సంఘాలు ఒక ఉమ్మడి పథకం ప్రకారం జాతీయ ఉత్పత్తిని క్రమబద్ధం చేయాలంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తిలో అనివార్యమైన శాశ్వత అరాచకత్వాన్ని దఫాలవారీ కల్లోలాన్ని అంతంచేసి, ఉత్పత్తిని తమ చేతులలోకి

తీసుకోవాలనుకుంటే, అయ్యా అప్పుడది కమ్యూనిజంకాక, మరేమౌతుంది? సాధ్యమైన కమ్యూనిజమే అవుతుంది.

కమ్యూన్ ఏదో అద్భుతాలను చేస్తుందని కార్మికవర్గం ఆశించలేదు. ప్రజా ఆదేశాల ద్వారా ప్రవేశపెట్టటానికి ముందుగా తయారైన తన ఊహాత్మక పథకాలేవీ కార్మికులకు లేవు. ప్రస్తుత సమాజం దాని ఆర్థిక కారణాల ఫలితంగానే, ఉన్నతమైన మరో రూపంవైపు అనివార్యంగా మొగ్గుతున్నది. తమ విముక్తి కూడా అందులోనే ఉన్నదని కార్మికవర్గం గుర్తిస్తున్నది. దీర్ఘకాల పోరాటాలు, చారిత్రక క్రమాల ద్వారా ముందుకుసాగి, పరిస్థితులను మనుషులను మారిస్తే తప్ప, ఈ లక్ష్యం సాధ్యంకాదని వారు గ్రహిస్తున్నారు. పతనాసన్నమైన బూర్జువా వ్యవస్థ గర్భంలో పెరుగుతున్న నూతన శక్తులను స్వేచ్ఛగా బైటికి వదలటం మినహా, కార్మిక వర్గానికి మరో లక్ష్యం లేదు. తమ చారిత్రక పాత్రను వారు పూర్తిగా గుర్తిస్తున్నారు. సాహసోపేతంగా ఆ పాత్రను నిర్వహించ నిశ్చయించుకున్నారు. సిరాబుడ్డిని, పేనాను ఖరాబుచేస్తూ పెద్దమనుషులుగా చలామణీ అయ్యేవారందరూ దూషణలు కురిపిస్తున్నారు. బూర్జువా సిద్ధాంతకర్తలు శ్రేయోభిలాషులవలె ఉపదేశాత్మకంగా అభిమానం కురిపిస్తున్నారు. శాస్త్రీయ అనివార్యతా సిద్ధాంతం జపించే దేవతల మాదిరిగా అజ్ఞానజనిత సూక్తులను, ఒంటెత్తువాదపు పిచ్చి కబుర్లను ధారాపాతంగా కురిపిస్తున్నారు. ఇదంతా చూసి, కార్మికవర్గం అసహ్యంతో మందహాసం చేసి ఊరుకోగలదు.

విప్లవ యాజమాన్యాన్ని పారిస్ కమ్యూన్ తన అధీనంలోకి తీసుకున్నది. మొదటిసారిగా, సాధారణ కార్మికులు, అంతకాలం తమ కంటె “సహజంగా ఉన్నతులైన” వారు నిర్వహించే పనులు చేయసాగారు. అనూహ్యమైన కష్టకాలంలో తమ పనిని ఎంతో వినయంతో చిత్తశుద్ధితో సామర్థ్యంతో చేయసాగారు. మునిసిపల్ స్కూల్ యాజమాన్యపు కార్యదర్శికి, న్యాయంగా ఇవ్వలసిన వేతనం అని అత్యున్నత శాస్త్రవేత్తలు నిర్ణయించిన దాంట్లో అయిదోవంతు జీతాన్ని మాత్రమే కమ్యూన్‌లోని అత్యున్నతాధికారులు తీసుకునేవారు. అధికార కేంద్రమైన హోటల్ డీ విల్లీపై శ్రామిక రిపబ్లిక్ చిహ్నంగా ఎర్రజండాను చూసి పాత ప్రపంచం ఆగ్రహంతో మండిపోసాగింది.

కాగా, మధ్యతరగతికి చెందిన అత్యధిక సంఖ్యాకులు, షాపు యజమానులు, వ్యాపారస్తులు, వర్తకులు సైతం కార్మికవర్గం ఒక్కటే సామాజిక చొరవగల వర్గం అని గుర్తించింది. ఈ విప్లవంలోనే ధనికులైన పెట్టుబడిదారులు మాత్రమే ఇందుకు మినహాయింపు. మధ్యతరగతులలో నిరంతరం వివాదగ్రస్తమైన వివాదాన్ని రుణదాతలకు రుణగ్రస్తులకు మధ్య తగాదాను, కమ్యూన్ చాలా తెలివితేటలతో మధ్యతరగతికి

అనుకూలంగా పరిష్కరించింది. (మూడేండ్లవరకు అప్పు చెల్లింపులను వాయిదా వేస్తూ ఏప్రిల్ 18న కమ్యూన్ ఉత్తర్వు చేసింది). జూన్ 1848లో కార్మిక ప్రజల సంఘాన్ని అణచివేయటంలో మధ్యతరగతుల సహకారాన్ని తీసుకుని, వెన్వెంటనే. రాజ్యాంగ నిర్ణయసభ, వారిని రుణదాతల దయాదాక్షిణ్యాలకు వదలివేసింది. సరిగ్గా మధ్యతరగతిలోని ఆ వర్గమే కమ్యూన్ ఆదేశంవల్ల లాభపడ్డది. కాగా కార్మికవర్గం చుట్టూ మధ్యతరగతి సమీకృతం కావటానికి ఇదొక్కటే కారణం కాదు. వారు ఒకటి గుర్తించారు. పేరు ఏదైనా వారి ఎదుట రెండే ప్రత్యామ్నాయాలున్నవి. కమ్యూన్ లేక సామ్రాజ్యం ప్రజాధనాన్ని దుర్వినియోగపరిచి, పెద్ద ఎత్తున ఆర్థిక మోసకృత్యాలను పెంపుచేసి, పెట్టుబడి కృత్రిమంగా కేంద్రీకృతమయ్యేందుకు ఎత్తులు పెట్టి. పై అన్నివిధాల సామ్రాజ్యం, మధ్యతరగతిని ఆర్థికంగా నాశనం చేసింది. రాజకీయంగా వారిని అణచి వేసింది. తమ అవినీతికర ప్రదర్శనల ద్వారా వారిని నైతికంగా భయభ్రాంతులను చేసింది. వారి పిల్లల చదువును, అజ్ఞానులైన పీఠాధిపతుల చేతుల్లోపెట్టి వాల్టేరు ఏర్పరచిన మధ్యతరగతి లౌకిక సాంప్రదాయాలను అవమానపరచింది. వినాశకరమైన యుద్ధంలోకి వారిని తలమున్కలుచేసి ఫ్రెంచి పౌరులుగా వారి ఆత్మాభిమానాన్ని దెబ్బతీసింది. ఈ యుద్ధంద్వారా జరిగిన నష్టం సామ్రాజ్య విచ్ఛిత్తితో సమానమైనది. నిజానికి పై తరగతికి చెందిన బోనపార్టీ, పెట్టుబడిదారీ నాయకులు, పారిస్‌ను వదలిపెట్టి పారిపోయిన మీదట నిజమైన మధ్యతరగతికి చెందిన పార్టీ ఆఫ్ ఆర్డర్ "రిపబ్లిక్ యూనియన్" పేరుతో ముందుకు వచ్చింది. కమ్యూన్ రక్షణ శ్రేణులలో సైనికులుగా చేరారు. థయర్స్ ఉద్దేశ్య పూర్వకంగా చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా కమ్యూన్‌ను రక్షించారు. నేడు ఏర్పడిన తీవ్ర విషమ పరిస్థితి అసంఖ్యాకమైన ఈ మధ్యతరగతి ప్రదర్శించిన విశ్వాసం నిలుస్తుందో లేదో కాలమే నిర్ణయించవలసి ఉంది.

'మా విజయం ఒక్కటే మీకు ఆశాజ్యోతి' అని రైతులకు కమ్యూన్ చెప్పటం పూర్తిగా సరైన పని. వర్సేల్స్ సృష్టించబడి, యూరపియన్ పత్రికా ప్రపంచంచే, డబ్బుకాశపడి రాతలు రాసేవారిచే, ప్రచారం చేయబడిన అబద్ధాలలో కల్లా పెద్ద అబద్ధం ఒకటి వుంది. రూరల్స్ ఫ్రెంచి రైతాంగానికి ప్రాతినిధ్యం వహిస్తున్నదనేదే అది. 1815 తర్వాత నష్టపరిహారంగా మిలియన్‌ల ధనం ఏ పార్టీ మనుషులకు రైతాంగం చెల్లించవలసి వచ్చిందో ఆ పార్టీ పట్ల రైతులకు ప్రేమ ఉంటుందా! అసలు పెద్ద భూస్వాములు కొనసాగడమే, 1789 విప్లవంలో సాధించిన విజయాలపై చొరబాటుగా, ఫ్రెంచి రైతాంగం భావిస్తున్నది. ప్రతి ఫ్రాంకుపైన 45 సెంట్ల అదనపు పన్నును విధించి, ఫ్రెంచి బూర్జువా వర్గం 1848లో రైతులపై భారాన్ని పెంచింది.

విప్లవం పేరుతో బూర్జువా వర్గం ఆ పని చేసింది ఇప్పుడు బూర్జువా వర్గం విప్లవానికి వ్యతిరేకంగా అంతర్యుద్ధాన్ని రెచ్చగొట్టింది. ప్రష్యన్‌లకు చెల్లించవలసిన అయిదు మిలియన్ల నష్టపరిహార భారాన్ని రైతుల భుజస్కందాలపై నెట్టడానికి యత్నిస్తున్నది. కాగా, కమ్యూన్ చేసిన మొట్టమొదటి ప్రకటనలలోనే, యుద్ధానికి మూలకారకులెవరో వారే నష్టపరిహార భారం వహించాలని స్పష్టం చేసింది. రైతుల నెత్తురు పీల్చే పన్నులను రద్దు చేయగలనని కమ్యూన్ ప్రకటించింది. ప్రభుత్వ నిర్వహణ ఖర్చును తగ్గిస్తుంది. రైతుల నెత్తురు పీలుస్తున్న రిజిస్ట్రార్, న్యాయవాది, దస్తావేజు రాతగాడు, తదితర న్యాయశాఖ రాబందులను నెలసరి వేతనాలపై, రైతులచే ఎన్నుకోబడి, రైతులకే బాధ్యత వహించేటట్లు చేస్తుంది. గ్రామీణ పోలీస్ కానిస్టేబుల్ సైనికుడు గ్రామాధికారుల పెత్తనం నుండి రైతులకు విముక్తి కలిగిస్తుంది. పీఠాధిపతి బోధించే మతమౌఢ్యం స్థానంలో గ్రామ ఉపాధ్యాయుని ద్వారా విజ్ఞాన ప్రసారం చేయిస్తుంది. ఫ్రెంచి రైతు అన్నిటికి మించి, తన లాభనష్టాలు గ్రహించగల నేర్పరి. పీఠాధిపతికిచ్చే జీతాన్ని రైతుల నుండి బలవంతంగా గుంజటం వంటి, గ్రామీణుల ఐచ్ఛిక మతవిశ్వాసంపై ఆధారపడిన చందా రూపంలో ఉండటం మేలు అని గ్రహించగలడు. కమ్యూన్ పాలన, పైన వివరించిన సౌకర్యాలన్నిటినీ రైతులకు వాగ్దానం చేసింది. అదొక్కటి మాత్రమే అలా చేయగలదు. ఇంతకంటే జటిలమూ ప్రధానమూ అయిన సమస్యలు లేకపోలేదు. రైతు గుండెలపై కుంపటిలా వారి భూముల తాకట్టు రుణభారం

ఉండనే వుంది. ఆధునిక వ్యవసాయం పెరుగుదల, పెట్టుబడిదారీ వ్యవసాయ క్షేత్రాల పోటీ ఫలితంగా, రైతులు తమ భూములను పోగొట్టుకొని వ్యవసాయ కార్మికజనాభాలో చేరిపోతున్నారు. కనుక వ్యవసాయ కార్మికుల సంఖ్యరోజు రోజుకూ పెరుగుతున్నది. ఈ సమస్యలన్నిటినీ రైతులకు క్షేమకరమైన పద్ధతిలో పరిష్కరించగలిగింది కమ్యూన్ ఒక్కటేనని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు.

ఫ్రెంచి రైతు, రిపబ్లిక్ అధ్యక్ష పదవిని లూయీ బోనపార్టీని ఎన్నుకున్నాడు. కాని సామ్రాజ్యాన్ని సృష్టించింది మాత్రం పార్టీ ఆఫ్ ఆర్డర్. తమకు నిజంగా ఏమి కావలెనో ఫ్రెంచి రైతులు 1849, 50లలోనే వ్యక్తీకరించసాగారు. ప్రభుత్వ నియమిత గ్రామ అధికార స్థానంలో ఎన్నికైన గ్రామపంచాయతీ అధ్యక్షుడు, ప్రభుత్వ నియమిత పీఠాధిపతి స్థానంలో ఉపాధ్యాయుడు, ప్రభుత్వ పోలీసు స్థానంలో, దృఢగాత్రుడైన రైతు. ఇవి రైతుకు కావలసినవి. 1850 జనవరి ఫిబ్రవరి నెలల్లో పార్టీ ఆఫ్ ఆర్డర్ చేసిన చట్టాలన్నీ, రైతుపై బాహాటంగా నిర్బంధాలు విధించినవే. రైతు బోనపార్టీస్టు ఏమంటే ఫ్రెంచి మహా విప్లవం రైతుకు అనేక సౌకర్యాలు కలిగించటంతోపాటు విప్లవానికి ప్రత్యక్షరూపం నెపోలియన్ అనే భావాన్ని కూడా కలిగించింది. రెండవ

సామ్రాజ్యపాలనలో ఈ భ్రమలు త్వరత్వరగా బద్దలు కాసాగినవి (ఇలా కావటం సహజంగానే రూరల్స్‌కు హానికరం) గతానికి చెందిన ఈ దురభిప్రాయం. రైతుల సజీవ ప్రయోజనాలను తక్షణ కోర్కెలను స్పందింపచేసే కమ్యూన్ విజ్ఞప్తిని తట్టుకుని ఎలా నిలబడగలదు?

మూడు నెలలపాటు కమ్యూన్ పాలనలో ఉన్న పారిస్‌కు రాష్ట్రాలతో స్వేచ్ఛగా రాకపోకలు సాగినట్లయితే, రైతుల సాధారణ తిరుగుబాటు తప్పదని, రూరల్స్ సహజంగానే ఆందోళన చెందసాగారు. కనుకనే ఈ దొమ్మవ్యాధి వ్యాపించకుండా పారిస్ చుట్టూ పోలీసు దిగ్బంధనం ఏర్పరచాలని వారు ఆందోళన పడసాగారు.

ఈ విధంగా కమ్యూన్ ఫ్రెంచి సమాజంలోని ఆరోగ్యకర అంశాలన్నిటికి నిజమైన ప్రతినిధి కనుక నిజమైన జాతీయ ప్రభుత్వం. అదే సమయంలో అది కార్మిక ప్రజల ప్రభుత్వం, కార్మికుల విముక్తికై ధైర్యంగా ముందుండి పోరాడింది. ఖచ్చితమైన అంతర్జాతీయ స్వభావం కలిగి ఉంది. రెండు ఫ్రెంచి రాష్ట్రాలను జర్మనీలో లీనం చేసుకున్న ప్రష్యన్ సైన్యం ఒక వైపున ఉండగా. యావత్ ప్రపంచ కార్మికులను కమ్యూన్ తనవైపు ఆకట్టుకున్నది.

రెండవ సామ్రాజ్యం అన్ని రకాల దొంగ కూలీలకు కేరింతలు కొట్టే కేంద్రం అయింది. అందులో జరిగే జుగుస్సాకర విలాసాలలో పాలు పంచుకునేందుకు ఫ్రెంచి ప్రజల దోపిడీలో వాటా పొందేందుకు, అన్ని దేశాల సంఘ వ్యతిరేక పోకిరీ శక్తులు అక్కడ పోగయ్యారు. ఆ క్షణానికి కూడా థయర్స్‌కు నమ్మకస్తుడైన అనుచరుడు గనెస్కో వాలాష్‌కు చెందిన దుర్మార్గుడు. అతని నమ్మకస్తుడు, రష్యన్ గూఢచారి మర్కోవస్కీ, అజరామరమైన ఆశయం కొరకు అసువులర్పించేందుకై విదేశాల నుండి వచ్చిన ప్రతి ఒక్కరినీ కమ్యూన్ స్వీకరించింది. బూర్జువా వర్గ ద్రోహం వల్ల, విదేశంతో జరిగిన యుద్ధంలో ఫ్రాన్స్ ఓడిపోయింది. విదేశీ ఆక్రమణ దారులతో వారు జరిపిన కుట్ర ఫలితంగా అంతర్యుద్ధం ప్రజ్వరిల్లింది. ఈ మధ్య కాలంలో ఫ్రాన్స్ దేశంలోని జర్మన్లపై పోలీసుదాడులను తీవ్రతరం చేసి, ఫ్రెంచి బూర్జువా వర్గం తన దేశభక్తిని నిరూపించుకున్నది. ఒక జర్మన్ కార్మికుడ్ని, కమ్యూన్ కార్మిక మంత్రిగా నియమించింది. మరొక వైపున థయర్స్ బూర్జువా వర్గం, రెండవ సామ్రాజ్యం నిరంతరం పోలండును మోసం చేస్తూనే వచ్చారు. ఒక వైపు పోలెండు పట్ల సానుభూతిని ప్రకటిస్తూనే రష్యాకు పోలెండు లొంగిపోయేటట్లు నీచమైన పనులన్నీ చేస్తూనే వచ్చారు. కమ్యూన్ మాత్రం పారిస్ రక్షణ శ్రేణిలో అగ్రస్థానాన పోలిష్ వీరుల నుంచింది. ఆ విధంగా వారిని గౌరవించింది. అంతేకాదు చరిత్రలోనూ తన అధ్యాయాన్ని సృష్టించేందుకు గాను

జయించుకుంటూ చొచ్చుకు వస్తున్న ప్రష్యన్లు, బోనపార్టిస్టు సేనానుల ఆధ్వర్యాన ఉన్న బోనపార్టిస్టు సైన్యం, రెండు వైపుల మోహరించి ఉండగానే, సైనిక విజయాలకు చిహ్నమైన వెండోంగోపురాన్ని[30], ఉద్దేశ పూర్వకంగానే కమ్యూన్ ధ్వంసం చేసింది (ఆ విధంగా అది సామ్రాజ్య వ్యతిరేక స్వభావాన్ని నిరూపించుకుంది).

కమ్యూన్ సాధించిన గొప్ప సామాజిక విజయం, అది అసలు జీవించడమే. ప్రజల కొరకు ప్రజల ప్రభుత్వం అనే నినాదాన్ని అమలు జరపడానికి కొన్ని ప్రత్యేక చర్యలు చేపట్టింది. రొట్టెలు తయారుచేసే కార్మికులు రాత్రిళ్ళు పని చేయరాదని నిషేధించింది. ఏవో జరిమానాలు, సాకులతో కార్మికుల వేతనాలలో యజమానుల ఎత్తుగడలను నిషేధించింది. ఈ విధంగా జరిమానా విధించడంలో యజమాని, శాసన సభ్యుడు. కార్యనిర్వాహకాధికారి. న్యాయమూర్తి పదవులన్నిటినీ తానే నిర్వహించేవాడు. డబ్బు కూడా అతనే స్వాహా చేసేవాడు. కార్మిక వర్గం మరో పని కూడా చేసింది. మూతపడిన కార్ఖానాలు, ఫ్యాక్టరీలన్నిటినీ, ఆ ఫ్యాక్టరీ యజమానులైన పెట్టుబడిదారులు పారిపోయారా, లేక సమ్మె చేస్తున్నారా అనే వ్యత్యాసం లేకుండా వారికి నష్టపరిహారం ఇచ్చి, ఆ సంస్థలను కార్మికుల సంఘాలకు స్వాధీనం చేసింది.

కమ్యూన్ తీసుకున్న ఆర్థిక చర్యలు, నిగ్రహానికి, ఉచితజ్ఞతకు తార్కాణాలు. దిగ్బంధంలో ఉన్న పట్టణం సహజంగా తీసుకోవలసిన చర్యలను వారు తీసుకున్నారు. పారిస్ నగర సంపదను, హౌస్‌మన్‌లి ఆధ్వర్యంలో పెద్ద వ్యాపార సంస్థలు, కాంట్రాక్టర్లు సాగించిన దారుణమైన దోపిడీ దృష్ట్యా, వారి ఆస్తులన్నిటినీ కమ్యూన్ స్వాధీనం చేసుకున్నా తప్పులేదు. ఆర్లియన్ కుటుంబీకుల ఆస్తులను లూయీ నెపోలియన్ స్వాధీనం చేసుకున్నదాని కంటే ఎక్కువ సమంజసంగానే ఉండేది. చర్చి ఆస్తులను స్వాధీనం చేసుకోవటం ద్వారా విపరీతంగా ఆస్తులను సమకూర్చుకున్న హోహెన్ జోలర్న్ ఇంగ్లీషు ప్రభువులు, ఉభయులూ చర్చికి నష్ట పరిహారంగా 8 వేల ఫ్రాంకులు మాత్రమే కమ్యూన్ చెల్లించినందుకు నిర్ఘాంతపోయారు. వర్సేల్స్ ప్రభుత్వం తిరిగి కొంచెం ఊపిరి, బలం పుంజుకున్న మీదట, కమ్యూన్‌కు వ్యతిరేకంగా దారుణమైన నిర్బంధ విధానాన్ని అనుసరించింది. ఫ్రాన్సు అంతటా అభిప్రాయ స్వేచ్ఛను నిషేధించింది. పెద్ద నగరాలకు చెందిన ప్రతినిధుల సమావేశాలను కూడా నిషేధించింది. వర్సేల్స్‌లోను మిగతా ఫ్రాన్సులోను, రెండవ సామ్రాజ్యాని కంటె పకడ్బందీగా గూఢచారి శాఖను విస్తరించింది. పారిస్‌లో అచ్చు అయ్యే పత్రికలన్నిటినీ తన పోలీసులచే తగల బెట్టించింది. పారిస్‌కు వచ్చే, అక్కడి నుండి బైటికి వెళ్ళే ఉత్తర ప్రత్యుత్తరాలన్నిటినీ తెరిచి చూడసాగింది. జాతీయ శాసనసభలో పారిస్ తరఫున ఎవరు కొద్దిపాటి సమర్థన చేసినా, వారిని గందరగోళం మధ్య నోరు నొక్కివేసేవారు 1816 ప్రభుత్వ శాసన సభలో కూడా ఇంత అల్లరి జరగలేదు. బైట నుండి వర్సేల్స్

దారుణమైన యుద్ధాన్ని చేస్తున్నది. పారిస్ లోపల అవినీతిని. కుట్రలను అది ప్రోత్సహిస్తున్నది. సుస్థిరమై శాంతి పరిస్థితులలో గనక ఉదారవాదపు మర్యాదలను, నియమాలను కమ్యూన్ పాటించటం కంటే విప్లవ ప్రజలు తనపై నుంచిన విశ్వాసాన్ని కమ్యూన్ వమ్ము చేసినట్లే అయ్యేది కదా! కమ్యూన్ ప్రభుత్వం కూడా థయర్స్ ప్రభుత్వం లాంటిదే ఐనట్లయితే పారిస్‌లో ప్రచురించిన పార్టీ ఆఫ్ ఆర్డర్ పత్రికలను అణచివేయవలసిన అవసరం ఉండదు. పర్సేల్స్‌లో కమ్యూన్‌కు చెందిన పత్రికలను మూసివేయవలసిన అవసరం ఉండదు.

ఫ్రాన్సు బాగుపడాలంటే చర్చికి విశ్వాసపాత్రంగా ఉండాలని. రూరల్స్ ప్రకటన చేసే సమయానికి, వారికి ఇబ్బంది కలిగించే విధంగా. నాస్తికవాద కమ్యూన్ పికృస్ సన్యాసినీ మఠంలోనూ సైంట్ లారెంట్ చర్చిలోనూ జరుగుతున్న అవినీతికర ఘటనలను బైటపెట్టసాగింది. యుద్ధాలలో ఓడిపోయి లొంగుబాటులో సిద్ధహస్తులై, విల్హెల్మ్‌షోలో సిగరెట్లు తాగుతూ కాలక్షేపం చేసిన బోనపార్టిస్టు సేనానులకు, థయర్స్ విజయ పతాకాలు అందిస్తుండగా కమ్యూన్ విధి నిర్వహణలో విఫలులైనట్లు అనుమానం తోచిన వెంటనే తన సేనానులను తొలగించి, నిర్బంధించ సాగింది. థయర్స్‌కిది పెద్ద అవమానంగా పరిణమించింది. కమ్యూన్ సభ్యులలో ఒకరు, మారుపేరుతో పారిపోయి దివాలా తీసినందుకు గాను లాయన్స్ జైలులో ఆరు రోజులు విడి ఖైదు అనుభవించాడు. అతనిని కమ్యూన్ తన సంస్థలో నుంచి బహిష్కరించింది. మరొక వైపున అప్పటికే ఫ్రాన్సు విదేశాంగ మంత్రిగా చలామణీ అవుతున్న టూల్స్ షేవ్రె, దేశాన్ని బిస్మార్క్‌కు అమ్మివేస్తూనే ఉన్నాడు. పవిత్రమైన బెల్జియం ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేస్తూనే ఉన్నాడు. అయితే, కమ్యూన్ తానేమాత్రం పొరపాట్లు చేయలేదని చెప్పుకోవటం లేదు. ఆనాటి ప్రభుత్వాలన్నీ ఆ రకంగా గొప్పలు చెప్పుకునేవి. తాను చేసిన పనులను, ఇచ్చిన వాగ్దానాలను అది ప్రచురించింది. తన లోపాలన్నిటినీ ప్రజలకు తెలియజేస్తూనే ఉంది.

ప్రతి విప్లవంలోనూ, నిజమైన విప్లవకారుల సరసన మోసకారులూ చేరుతూ ఉంటారు. వీరిలో కొందరు వెనుకటి విప్లవాలకు విశ్వాస పాత్రులు. కొందరు ఆ విప్లవాల హతశేషులు. వారికి ప్రస్తుత పరిస్థితుల ఆంతర్యం తెలియదు. తమ నిజాయితీ, ధైర్యాల ఫలితంగానో లేక కేవలం సాంప్రదాయ ప్రభావం వల్లనో ప్రజలలో పలుకుబడిని కాపాడుకుంటూ ఉంటారు. మరికొందరు ఏదో ఎల్లప్పుడూ పేలుతూనే ఉంటారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ఒకే రకమైన దూషణలను అదే పనిగా వారు ప్రతి ఏటా వల్లిస్తుంటారు. ఆ విధంగా ప్రథమ శ్రేణి విప్లవకారులనే పేరు సంపాదించుకుంటారు. మార్చి 18 తర్వాత, అలాంటి వ్యక్తులూ కొందరు పైకి వచ్చారు. కొన్ని సందర్భాలలో చాలా ప్రముఖ స్థానాలను కూడా ఆక్రమించారు. వారి శక్తి మేరకు కార్మిక వర్గం యొక్క నిజమైన కార్యాచరణను అడ్డుకుంటూ వచ్చారు. అంతకు

ముందు జరిగిన ప్రతి విప్లవంలోను, ఇట్టి మనుషులు ఇలాంటి వైఖరినే అవలంబిస్తూ వచ్చారు. వారొక అనివార్యమైన అరిష్టం. కాల క్రమేణ మాత్రమే వారిని వదలించుకోవటం సాధ్యం. అయితే కమ్యూన్‌కు ఆ విధంగా కాలం కలిసి రాలేదు.

పారిస్‌లో కమ్యూన్ తీసుకువచ్చిన మార్పులు నిజంగా ఆశ్చర్యకరమైనవి. రెండవ సామ్రాజ్యకాలపు అట్టహాసాలన్నీ పారిస్ నుండి అదృశ్యమైనాయి. బ్రిటిష్ భూస్వాములు పారిపోయి వచ్చిన పారిస్ భూస్వాములు మాజీ అమెరికన్ బానిస యజమానులు ఇతర అప్రతిష్టాకరమైన వ్యక్తులు. రష్యన్ మాజీ అర్థ బానిస ప్రభువులు; వాకస్‌కు చెందిన సేనానులు–వీరందరూ అదృశ్యమైనారు. శవపరీక్షాశాలలో దహనం కాకుండా శవాలు పడి ఉండడంలేదు. అర్థరాత్రి దొంగతనాలు లేవు, బందిపోట్లు అదృశ్యమయాయి. నిజానికి 1848 ఫిబ్రవరి రోజుల నుండి మొట్టమొదటి సారిగా పారిస్ వీధులలో భద్రతా భావం ఏర్పడ్డది. ఎట్టి పోలీసు రక్షణ లేకుండానే ఇలా జరిగింది. కమ్యూన్ సభ్యుడొకడు ఇలా అన్నాడు. "దొంగతనాలు, హత్యలు వ్యక్తులపై దాడులను గురించి మేము ఏమీ వినటం లేదు పోలీసులు, తమ మితవాద స్నేహితులతో సహా అంతా వర్సేల్స్‌కు తరలిపోయినట్లున్నారు. కుటుంబం, మతం, ఆస్తి బూటకపు మాటలు చెప్పే కుహనా నీతివాదులు, విలాస స్త్రీలు తమ యజమానులతో వెళ్ళిపోయారు. వారి స్థానంలో నిజమైన పారిస్ స్త్రీలు, ధైర్యవంతులు, చిత్తశుద్ధి గలవారు, ప్రాచీన కాలపు మహిళల వలె ముందుకు వచ్చారు. పని చేస్తూ, ఆలోచిస్తూ పోరాడుతూ నెత్తురోడుతూ పారిస్ నగరం. నూతన సమాజ నిర్మాణ సంరంభంలో – గేటు ఆవతల ఉన్న నరరూప భక్షకులను మరచిపోయి, తన చారిత్రక చొరవతో ఉత్సాహంతో తొణికిసలాడ సాగింది."

పారిస్‌లోని ఈ నూతన ప్రపంచంతో వర్సేల్స్‌లోని పాత ప్రపంచాన్ని పోల్చి చూద్దాం. రెజితెమిస్టులు, ఆర్లియనిస్టులు పడిపోయిన వంశాల ప్రేతాత్మలు. జాతి మృత దేహాన్ని చీల్చుకు తిందామని కాచుకు కూచున్నవారు. పూర్వకాలపు రిపబ్లికన్లు కొందరున్నారు. శాసన సభలో సభ్యత్వం ద్వారా వీరు బానిస యజమానుల తిరుగుబాటుకు ఆమోదం తెలిపారు. తమ నాయకుడుగా ఉన్న నిర్జీవ ప్రతిమ ఆత్మాడంబరంపై ఆధారపడి, పార్లమెంటరీ రిపబ్లిక్‌ను కాపాడాలని వీరి యత్నం. తమ కుట్రలకన్నిటికీ జూడిపోమే అనే టెన్నిసు కోర్టును కేంద్రస్థలంగా చేసుకున్నారు. 1789 ఫ్రెంచి మహా విప్లవ సన్నాహాలన్నీ ఆ స్థలంలోనే జరిగాయి. కనుక ఆ విప్లవానికి తాము వారసులమైనట్లు వీరు నటించ చూస్తున్నారు. ఫ్రాన్సులో మృతప్రాయమైన వాటన్నిటికీ ప్రాతినిధ్యం వహించే శాసన సభను. అక్కడ లూయీ బోనపార్టీ సేనానులు కేవలం తమ ఆయుధ బలంతో నిలబెట్టాలని చూస్తున్నారు.

పారిస్ సత్యానికి చిహ్నం. వర్సేల్స్ అసత్యానికి ప్రతిబింబం. ఈ అసత్యాన్ని థయర్స్ తన నోటి నుండే పలుకుతున్నాడు.

సేన్ థట్ జసికి చెందిన మేయర్ల ప్రతినిధి వర్గంతో మాట్లాడుతూ థయర్స్ ఇలా అన్నాడు. : "మీరు నా మాట మీద విశ్వాసం ఉంచండి. నేనెప్పుడూ మాట తప్పిన వాణ్ని కాను." అతను శాసనసభలో ఇలా అంటున్నాడు : "అత్యంత స్వేచ్ఛతో ఉదారభావంతో ఎన్నికైన శాసనసభ ఇది. ఇలాంటిది ఫ్రాన్సులో ఎన్నడూ ఏర్పడలేదు." తన అమాంబాపతు సైనికులతో ఇలా అంటున్నాడు. "ప్రపంచమంతా మిమ్ము ప్రశంసిస్తున్నది. ఇంతటి చక్కని సేన ఫ్రాన్సుకు ఎన్నడూ లేదని." తాను పారిస్‌పై బాంబుల కురిపించాననడం అబద్ధమని రాష్ట్రాలకు నచ్చచెబుతున్నాడు. "ఏవైనా కొన్ని ఫిరంగిగుండ్లు పడితే అది పర్సేల్స్ సైన్యం పనికాదు. ఎవరో కొందరు తిరుగుబాటు దారులు తాము ఇంకా పోరాడుతున్నమని చెప్పుకొటానికి చేసిన పని. తమ ముఖాలను వారు చూపించలేరు." అతడు రాష్ట్రాలకు తిరిగి ఇలా చెబుతున్నాడు "వర్సెల్స్ ఫిరంగులు పారిస్‌పై గుండ్ల వర్షం కురిపించవు. కేవలం ఫిరంగులతో చుట్టుముట్టి ఉంటుంది." వర్సెల్స్‌లో జరిగినట్లు చెప్పబడుతున్న వధలు. ప్రతీకార చర్యలు అన్నీ అబద్ధాలనీ, పారిస్ ఆర్చి బిషప్‌కు అతడు తెలియజేస్తున్నాడు. "మిమ్ములను దోపిడీచేస్తున్న దారుణ నియంతల" నుండి మీకు విముక్తి కలించటమే మా లక్ష్యం అని పారిస్ ప్రజలకు చెబుతున్నాడు. పారిస్ కమ్యూన్ అనేది "కొద్దిమంది నేరస్తుల గుంపు" మాత్రమే అంటున్నాడు.

థయర్స్ ఊహించే పారిస్ "దుర్మార్గులైన గుంపులకు చెందిన నిజమైన పారిస్ కాదు. ప్రేతాత్మ వంటి పారిస్. స్త్రీ, పురుష విలాసజీవులకుచెందిన పారిస్, ధనికులు పెట్టుబడిదారులు, భుజకీర్తులుధరించి, ఖాళీ జీవితం గడపేవారు. వారి తాబేదారులు, దొంగ కూలీలు, వారి భజనపరులైన రచయితలు, వర్సెల్స్, సెంట్ డెనిస్, రూయర్, సెంట్‌న్ జర్మన్ నగరాలలోని వారి అనుయాయులు-వీరికి చెందిన పారిస్, వారి దృష్టిలో అంతుర్యుద్ధం వాంఛనీయమైన ఒక పెడమార్గం. వారు దూరదర్శినీ యంత్రాలతో యుద్ధ దృశ్యాలను చూస్తారు. ఫిరంగి గుండ్ల కాల్పులను లెక్కించుకుంటూ, పోర్ సెంట్ మార్టిన్ యుద్ధంకంటే, ఈ యుద్ధం బాగా జరుగుతున్నదని, తమపైన, తమ ఉంపుడుకత్తెలపైనా ప్రమాణం చేస్తూ ప్రగల్భాలు పలుకుతుంటారు. క్రింద పడిపోయినవారు నిజంగా చచ్చిపోయిన వారే. గాయపడినవారి హాహాకారాలు, నిజమైన హాహాకారాలే. అంతేకాదు. ఈ యావత్తు చర్య నిజంగా చారిత్రాత్మకమైంది.

ఇది థయర్స్‌కు చెందిన పారిస్. జర్మనీలోని కోబ్లెంజ్‌లో[32] ప్రవాస జీవితం గడిపిన ఫ్రాన్సు, డికాలోనీ ఫ్రాన్సు ఐనట్లు.

# IV

ప్రష్యన్లచే పారిస్‌ను ఆక్రమింపచేసి అణచి వేయాలని, బానిస యజమానులు చేసిన మొదటి కుట్ర బిస్మార్క్ నిరాకరణ ద్వారా విఫలమైంది. మార్చి 18న జరిగిన రెండవ ప్రయత్నంలో సైన్యం ఓడిపోయింది. పారిస్‌లోని యంత్రాంగాన్నంతా విచ్ఛిన్నం చేసి తనతో తీసుకుపోవాలనుకున్న ప్రభుత్వం వర్సేల్స్‌కు పారిపోయింది. పారిస్‌తో శాంతి సంభాషణలు అనే నాటకం ఆడుతూ, థయర్స్ యుద్ధానికి సన్నాహాలు చేయసాగాడు. అయితే అతనికి సైన్యం ఏది? హత శేషులైన సేనలు, సంఖ్యలోనూ చాలా కొద్ది, వారి ప్రవర్తన నమ్మదగినది కాదు. జాతీయ రక్షక దళాలు, వాలంటీర్లు, అత్యవసరంగా వర్సెల్స్ రక్షణకు రావలసిందిగా థయర్స్ చేసిన విజ్ఞప్తిని ఎవరూ పాటించలేదు. బ్రిటిన్ రాష్ట్రం మాత్రమే[33] కొందరు కిరాయి మూకలను సప్లయి చేసింది. వీరు తెల్లటి జండాను ధరించి, తమ రొమ్ములపై తెల్లటి ఏసుక్రీస్తు బొమ్మను ధరించి, "రాజు చిరకాలం వర్ధిల్లాలి" అని నినాదాలు ఇచ్చుకుంటూ పోరాడారు. కనుక థయర్స్ తప్పని సరై, హడావిడిగా, నావికులు, యుద్ధ నౌకల సిబ్బంది, ఫ్రెంచి పదాతిదళమైన జోన్‌లు,[34] వాలెంటిన్ హంతకులు, పియత్రికి గూండాలు, దగాకోర్లు ఇలాంటి అమాంబాపతు వారిని చేర్చి ఒక సైన్యం ఏర్పరచాడు. అయితే జర్మన్ సామ్రాజ్యం చేజిక్కించుకున్న యుద్ధ ఖైదీలు లేకపోతే, సైన్యం ఎందుకూ పనికిరాదు. అట్టి యుద్ధ ఖైదీలను, బిస్మార్క్, అంతర్యుద్ధం కొనసాగేటందుకు అవసరమైన మోతాదులో మాత్రమే విడుదల చేశాడు. వర్సేల్స్ ప్రభుత్వం, ప్రష్యన్ ప్రభుత్వంపై పూర్తిగా ఆధారపడే విధంగా చేశాడు. తీరా యుద్ధంలో కూడా, వర్సేల్స్ సైన్యం పోరాడేటట్లు, వర్సేల్స్ పోలీసులు కాపలా కాయవలసి వచ్చింది. ఈ సైన్యాన్ని కిరాయి గుండాలు ముందుండి నడిపిస్తూ, మొదటి దాడికి వారే గురికావలసి వచ్చేది. కొన్ని కోటలు లొంగిపోయినవి. అయినా వాటిని ఈ సైన్యం స్వాధీనం చేసుకోలేక పోయింది. ఫెడరల్స్ వీరోచితంగా పారిస్‌ను రక్షించారు. దాంతో, తన వ్యూహాత్మక సామర్థ్యము, తన చేతిలోని సన్నీలు పారిస్‌ను పట్టుకోటానికి చాలవని థయర్స్ గుర్తించక తప్పలేదు.

ఈలోగా రాష్ట్రాలతో సంబంధాలు మరింత జటిలం కాసాగాయి. థయర్స్‌కు అతని రూరల్స్‌కు సంతోషం కలిగించే ఒక్క వార్త కూడా రాష్ట్రాల నుండి రాలేదు. అందుకు విరుద్ధంగా, విజ్ఞప్తులు, పత్రాలు రాసాగాయి. ఈ పత్రాల భాష థయర్స్‌కు మర్యాద సూచకంగా లేనేలేదు. రిపబ్లికన్‌ను నిర్నిబంధంగా గుర్తించి, పారిస్‌తో రాజీపడాలని, ఈ విజ్ఞప్తుల సారాంశం. కమ్యూన్ ఇచ్చిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలన్నిటినీ గుర్తించటం, జాతీయ శాసన సభను రద్దు చేయటం. అవసరమని కోరుతూ విజ్ఞప్తులు శరపరంపరగా రాసాగాయి. జాతీయ శాసనసభ ఉత్తర్వులు అప్పటికే అసలు

నిరుపయోగమై పోయాయి. థయర్స్ మంత్రి వర్గంలో న్యాయశాఖా మంత్రి దూపారే ఏప్రిల్ 23న ఒక సర్క్యులర్ జారీ చేస్తూ ఇలా అన్నాడు.

"రాజీపడాలి" అనే మాట విద్రోహంతో సమానం అని. తన దాడి విఫల మౌతున్నదని, దానికి భవిష్యత్తు లేదని థయర్స్ గుర్తించక తప్పటంలేదు. అతడు తన ఎత్తుగడలు మార్చాడు. జాతీయ శాసనసభకు తాను ఆదేశించిన మునిసిపల్ చట్టం ప్రకారం, ఫ్రాన్సు అంతటా ఏప్రిల్ 30న, ఎన్నికలు జరుగుతాయని ప్రకటించాడు. అతని అనుచరుల కుట్రలు, పోలీసుల బెదిరింపులు, ఈ ఎన్నికలలో గెలుపు సాధిస్తాయని. తద్వారా జాతీయ శాసనసభకు అంతకు ముందెన్నడూ లేని నైతిక శక్తి లభిస్తుందని. పారిస్‌ను జయించటానికి అవసరమైన భౌతిక శక్తిని ఎట్టకేలకు తాను సంపాదించగలనని అతడు ఆశించాడు.

ఒకవైపున పారిస్‌కు వ్యతిరేకంగా వారి దోపిడీ యుద్ధం సాగిస్తూ తన ప్రకటనలలో స్వోత్కర్షగా ఆ ఘటనలను చెప్పుకొంటూ యంత్రాంగంలోని అతని మంత్రులు, ఫ్రాన్స్ అంతటా నియంతృత్వ పాలనను నెలకొల్పుతూనే, థయర్స్ మరోవైపున ఏదో  కొంత రాజీ ధోరణి ఒక పక్కన ప్రదర్శిస్తూనే వచ్చాడు. ఇలా చేయటంలో అతనికి చాలా లక్ష్యాలున్నాయి. రాష్ట్రాలను మోసపుచ్చటం. మధ్యతరగతిని మభ్య పెట్టటం. జాతీయ శాసన సభలోని రిపబ్లికన్లుగా చెప్పుకునే వారు, పారిస్‌కు వ్యతిరేకంగా చేస్తున్న తమ ద్రోహాన్ని థయర్స్‌పై విశ్వాసం అనే ముసుగులో కప్పిపుచ్చుకోవటం, ఇవి అతని లక్ష్యాలు. మార్చి 21న ఇంకా అతని చేతిలో సైన్యం లేనప్పుడే శాసనసభ నుద్దేశించి అతడిలా అన్నాడు: "రిపబ్లిక్ ఒక సుస్థిరమైన సంస్థ అనే నమ్మకం నాకు కలిగింది. దానిని స్థిరంగా కొనసాగించడానికి నేను నిశ్చయించుకున్నాను." వాస్తవానికి, అతడు లాయన్స్. మార్సిలీస్‌లిలో విప్లవాన్ని అణచివేశాడు. రిపబ్లిక్ పేరుతో ఈ విధంగా విప్లవాలను అణచివేస్తూనే. అతనికి చెందిన రూరల్స్. వర్సెల్స్‌లో ఈమాటే వినబడకుండా రణగొణ ధ్వని చేసేవారు. ఈ ఘనకార్యం తర్వాత. ఈ వాస్తవాన్ని అతడు సిద్ధాంతీకరించాడు. బోర్డో అవతలికి మర్యాదగా అతడు పంపించి వేసిన ఆర్లియన్స్ రాజవంశీకులు, ఇప్పుడు వాగ్దానానికి పూర్తి విరుద్ధంగా డ్రూల్స్‌లో కుట్రలు చేయటానికి అనుమతించబడ్డారు. పారిస్ నుండి. రాష్ట్రాల నుండి వచ్చిన ప్రతినిధులతో థయర్స్ నిరంతరాయంగా చర్చలు సాగిస్తుండేవాడు. క్షణక్షణానికి పరిస్థితుల ననుసరించి ఈ చర్చల ధోరణి సారాంశం మారుతూ ఉండేది. "లేకుంటే క్లెమెంట్ థామస్‌ల హత్యలు భాగస్వాములైన కొద్దిమంది నేరస్తులపై ప్రతీకార చర్యలను పరిమితం చేయటానికి మించి" ఈ చర్చలు ముందుకు సాగేవికావు. ఈ చర్చలన్నిటికీ ప్రాతిపదికగా ఒక షరతు విధించేవాడు. పారిస్, ఫ్రాన్సు యావత్తూ థయర్స్‌ను, బేషరతుగా అత్యుత్తమ రిపబ్లికన్‌గా గుర్తించాలనేదే

ఆ షరతు. 1830 తాను ఇదే విధంగా ఫిలిప్పాను గుర్తించాడు. ఈ విధంగా ఇచ్చిన సౌకర్యాలను కూడా అతని మంత్రులు శాసన సభలో చేసే ప్రకటన ద్వారా, ఎంతో అనుమానాస్పదమైనవిగా తయారయ్యేవి. అతని తరఫున పనిచేయటానికి డూఫారే ఉండనే ఉన్నాడు. ఆర్లినిస్టులకు చెందిన ఈ పాత లాయరు మొదటి నుంచి పారిస్ దిగ్బంధాన్ని సమర్థించేవాడే. 1871లో థయర్స్ క్రింది. 1839లో లూయీ ఫిలిప్పా క్రింది, 1849లో లూయీ బోనపార్టీ అధ్యక్ష పదవీ కాలంలోనూ ఇలా వ్యవహరించేవాడు. అధికారంలో లేనప్పుడు అతడు పారిస్ పెట్టుబడిదారుల తరఫున వాదించి ధన సంపాదన చేసేవాడు. తానే సృష్టించిన చట్టాలకు తానే వ్యతిరేకంగా వాదించి, రాజకీయంగా లబ్ధి పొందేవాడు. అతడిప్పుడు హడావిడిగా జాతీయ శాసనసభలో, కొన్ని నిర్బంధ చట్టాలను ఆమోదింపచేశాడు. పారిస్ పతనం తర్వాత, ఫ్రాన్సులో మిగిలిన రిపబ్లికన్ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సంపూర్తిగా అపహరించటానికి ఇవి ఉద్దేశితమైనాయి. సైనిక విచారణ తతంగం మరీ నిదానంగా సాగుతున్నట్లుగా భావించి, దానిని శీఘ్రతరం చేశాడు. అనుమానస్తులను ప్రవాసం పంపించేందుకు విపరీతాధికారాలను ఇచ్చే శాసనం చేశాడు. వీటి ద్వారా పారిస్ భవిష్యత్తును అతడు ముందుగానే నిర్ణయించాడు. రాజకీయ నేరాలకు ఉరిశిక్షను రద్దుచేస్తూ దాని బదులు, ప్రవాసానికి పంపే చట్టాన్ని 1848 విప్లవం చేసింది. లూయీ బోనపార్టీ, కనీసం సిద్ధాంతరీత్యా ఐనా, బహిరంగ ఉరికంబాన్ని పునరుద్ధరించటానికి సాహసించలేదు. పారిస్ పౌరులు హంతకులు తప్ప తిరుగుబాటుదారులు కాదని రూరల్ అసెంబ్లీ సైతం సూచన ప్రాయంగానైనా చెప్పటానికి సాహసించలేదు. కనుక తన ప్రతీకారాన్ని డూఫారే యొక్క, కొత్త ప్రవాస నిబంధనలకు మాత్రమే పరిమితం చేయక తప్పింది కాదు. ఈ అన్ని పరిస్థితులలో, థయర్స్ సైతం, తన రాజీ కపట నాటకాన్ని కొనసాగించలేకపోయాడు. రూరల్స్ ఈ కాపట్యాన్ని ఆగ్రహంతో కోలాహలంగా వ్యతిరేకించారు. వారి మందబుద్ధికి, ఈ కుట్రలు మోసం రెండు నాల్కల ధోరణి, మొసలి కన్నీళ్ళు కురిపించటం.... ఇదంతా అవసరమని తోచలేదు.

ఏప్రిల్ 30 మునిసిపల్ ఎన్నికలు ముంచుకొస్తుండగా, థయర్స్ తన రాజీ నాటకంలో ఒక గొప్ప అధ్యాయాన్ని ప్రదర్శించాడు. తెచ్చిపెట్టుకున్న సానుభూతితో కూడిన మహోపన్యాసం చేస్తూ అసెంబ్లీ వేదికపై నుండి ఇలా ప్రసంగించాడు : "రిపబ్లిక్ వ్యతిరేక కుట్ర ఏదీలేదు. పారిస్ ఒక్కటే కుట్ర చేస్తున్నది. కనుక మేము ఫ్రెంచి రక్తాన్ని చిందించవలసి వస్తున్నది. నేను ఈ విషయాన్ని పదేపదే చెబుతున్నాను. ఆయుధాలు ధరించినవారు తిరుగుబాటుతో అపవిత్రమైన చేతులనుండి ఆయుధాలను క్రింద పడవేయండి. అప్పుడు కొద్దిమంది నేరస్తులపై మినహా మిగతావారిపై ఎట్టి శిక్ష ఉండదు. శాంతి ఒప్పందం వెంటనే జరుగుతుంది." రూరల్స్ కోలాహలంగా

అడ్డు తగులుతూ గలభా చేయగా అతడిలా సమాధానం చెప్పాడు : “పెద్ద మనుషులారా చెప్పండి. నా తప్పు ఏదైనా ఉందా! మిమ్ములను వేడుకుంటున్నాను. నేరస్తులు కొద్దిమంది మాత్రమేనని నిజం చెప్పి నందుకు మీరు నిజంగా విచారిస్తున్నారా? మన దురదృష్టకర పరిస్థితులలో కొద్దిపాటి అదృష్టం లభించింది. క్లెమెంట్ థామస్, జనరల్ లేకామ్టెల నెత్తురు చిందించిన నేరస్తులు కొద్దిమంది మాత్రమే కావటం మన అదృష్టం కాదా?”

థయర్స్ చేసిన ఆత్మోత్కర్షపూరిత ప్రసంగ గేయాన్ని ఫ్రాన్సు వినిపించుకోనేలేదు. ఫ్రాన్సులో మిగిలిపోయిన 35 వేల కమ్యూన్లు 7 లక్షల మునిసిపల్ కౌన్సిలర్లను ఎన్నుకోగా, వారిలో యునైటెడ్ లెజిటిమిస్టులు. ఆర్లియనిస్టులు బోన పార్టీస్టులు 8 వేల మందికంటె ఎక్కువ లేరు. తర్వాత జరిగిన అనుబంధ ఎన్నికలు మరింత వ్యతిరేక ఫలితాల నిచ్చాయి. ఆ విధంగా రాష్ట్రాలనుంచి ఎంతో ఎదురు చూసిన భౌతిక తోడ్పాటు లభించకపోగా, జాతీయ శాసనసభ దేశం యొక్క సార్వజనీన వోటింగ్ ఫలితంగా ఎన్నికైనదని చెప్పుకునే నైతిక బలానికి గల తన ఆఖరు హక్కును కూడా కోల్పోయింది. ఈ దురవస్థను పూర్తి చేయటానికి గాను, ఫ్రాన్సులోని అన్ని నగరాలకు చెందిన కొత్తగా ఎన్నికైన మునిసిపల్ కౌన్సిలర్లు, వర్సేల్స్ శాసన సభకు, పోటీగా, బోర్డోలో పోటీ శాసన సభను ఏర్పరచారు.

అప్పటికి బిస్మార్క్‌కు చాలా కాలంగా ఎదురు చూస్తున్న నిర్ణయాత్మక అవకాశం లభించింది. శాంతి సంధిపై వెంటనే సంతకం పెట్టే హక్కు గల ఉన్నతాధికారులను ఫ్రాంక్ ఫర్టుకు వెంటనే పంపవలసిందిగా బిస్మార్క్, థయర్స్‌ను ఆదేశించాడు. తన యజమాని ఆదేశానికి వినయంతో తలఒగ్గి, తనకు నమ్మకస్తుడైన జూల్స్‌ఫెవ్రేను, పోయర్ క్వెర్టియర్‌ను తోడిచ్చి థయర్స్ పంపించాడు. పోయర్ క్వెర్టియర్ ఢూయన్‌కు చెందిన ప్రముఖ నూలు పారిశ్రామికుడు. రెండవ సామ్రాజ్యానికి అణగిమణగి ఉండే బానిస వంటివాడు. రెండవ సామ్రాజ్య వ్యవహారాలలో అతనికి ఏ దోషం కనపడలేదు. ఒక్క అంశం మినహా అదేమంటే తన స్వంత పరిశ్రమ హానికరంగా ఇంగ్లాండుతో వ్యాపార ఒప్పందం చేసుకోవటం. బోర్డోలో థయర్స్ యొక్క వాణిజ్య మంత్రిగా పదవీ బాధ్యత స్వీకరించిన వెంటనే, అతడు పైన వివరించిన ‘అపవిత్ర’ ఒప్పందాన్ని తిరస్కరించాడు. దానిని రద్దు చేస్తానన్నాడు. అంతేకాదు. ఆల్సేక్‌కు వ్యతిరేకంగా వెనుకటి రక్షణ సుంకాలను విధిస్తానని బెదరించాడు. అందుకు అంతర్జాతీయ ఒప్పందాలేవీ అడ్డురావన్నాడు. అయితే ఇదంతా బూకరింపే. ఏమంటే అవతల బిస్మార్కు ఉన్నాడనే సంగతి అతడు మరచిపోయాడు. రూయన్ కార్మికుల వేతనాలు తగ్గించటానికి ప్రతీఘాత విప్లవం ఒక సాధనగానూ, ఫ్రాన్స్‌లో తన సరుకుల ధరల పెరగటానికి ఫ్రెంచి రాష్ట్రాలను జర్మనీకి అప్పగించటం ఒక మార్గంగానూ,

భావించిన ఈ వ్యక్తి థయర్స్ తలపెట్టిన అంతిమ లొంగుబాటుకు, జూల్స్ ఫేవ్రేకు తోడుగా ఉండవలసిన వాడే కదా?

ఈ అద్భుతమైన ఉన్నతాధికార ద్వయం, ఫ్రాంక్‌ఫర్ట్ చేరిన వెంటనే, బిస్మార్క్ తన సహజమైన బెదిరింపు పద్ధతిలో వారికి ఒకే అగౌరవకరమైన ప్రత్యామ్నాయాన్ని తెలియ జేశాడు. సామ్రాజ్య పునరుద్ధరణ, లేక తన శాంతి ఒప్పందాలను బేషరతుగా ఆమోదించటం. ఈ షరతులలో ఒకటి. యుద్ధ పరిహారాలను చెల్లించే కాల వ్యవధిని తగ్గించటం, ఫ్రాన్సులో పరిస్థితులు బాగు పడ్డాయని బిస్మార్క్‌కు నమ్మకం కలిగే వరకూ, పారిస్ శివార్లలోని బురుజులను ప్రష్యన్ సైన్యాలు ఆక్రమించుకోవటం. ఆ విధంగా ఫ్రెంచి రాజకీయాలలో అంతిమ నిర్ణేతగా ప్రష్యాను గుర్తించాలి. ఇందుకు బదులుగా, బిస్మార్క్ పారిస్‌ను నాశనం చేసేందుకుగాను. తన వద్ద యుద్ధఖైదీలుగా ఉన్న బోనపార్టిస్టు సైన్యాన్ని విడుదల చేస్తాడు. వారికి సరాసరిగా, విలియం చక్రవర్తికి చెందిన సైనిక దళాలను తోడిస్తాడు. తన మాటపై విశ్వాసం కలగటానికిగాను, బిస్మార్క్ ఒక సౌకర్యం ఇచ్చాడు. యుద్ధ పరిహారంలో మొదటి వాయిదా చెల్లింపు, పారిస్ "ప్రశాంతీకరణ" పూర్తి అయిన తర్వాత ఇవ్వవచ్చు. ఈ ఎరను థయర్స్ అతని ఉన్నతాధికార ప్రతినిధులు వెంటనే స్వీకరించారు. మే 10వ తేదీన వారు శాంతిసంధిపై సంతకం చేశారు. 18వ తేదీన వర్సేల్స్ శాసనసభచే ఆమోదింప చేశారు.

శాంతి ఒప్పందం జరిగి బోనపార్టిస్టు ఖైదీల విడుదల జరిగే మధ్య కాలంలో, థయర్స్ తిరిగి తన రాజీ నాటకం ప్రారంభించాడు. పారిస్‌పై తాము తలపెట్టిన సామూహిక హత్యాకాండకు ముందుగా ఏదో ఒక సమర్థన అతని రిపబ్లిక్ సేవకులకు అవసరమైంది. మే 8వ తేదీన, మధ్యతరగతికి చెందిన ఒక రాజీ బృందానికి థయర్స్ ఇలా సమాధానం చెప్పాడు. "తిరుగుబాటుదారులు లొంగుబాటుకు అంగీకరించి, పారిస్ ద్వారాలు ఒక వారం రోజులపాటు, క్లెమెంట్ థామస్, లేకామ్టెల హంతకులకు తప్ప, మిగతా అందరికీ తెరిచే ఉంటాయి".

కొద్దిరోజుల తర్వాత, ఈ వాగ్దానాలను గురించి, రూరల్స్ గట్టిగా ఎదురు ప్రశ్నలు వేయగా, థయర్స్ ఎట్టి సమాధానం ఇవ్వటానికీ నిరాకరించాడు. అయితే అర్థవంతమైన ఒక సూచన మాత్రం చేశాడు. "మీలో ఓర్పులేనివారు కొందరున్నారు. చాలా తొందర పడేవారు కొందరున్నారు. ఆ విషయం మీకు చెప్పదలచాను. అలాంటివారు మరొక 8 రోజులు ఆగాలి, ఆ ఎనిమిది రోజుల తర్వాత ఎట్టి ప్రమాదం ఉండదు. వారి ధైర్యానికి, సామర్థ్యానికి తగిన విధంగానే ఆనాటి కర్తవ్యం ఆధారపడి ఉంటుంది." ఇక మీరు పారిస్‌లో ప్రవేశించవచ్చును అని మాక్‌మోహన్ హామీ ఇచ్చిన వెంటనే థయర్స్ శాసనసభలో ఇలా అన్నాడు. "నేను చట్టాన్ని ఒక చేత్తో

పట్టుకుంటాను. సైనికులు జీవితాలను అంతం చేసి, పౌర భవనాలను ధ్వంసం చేసిన దుర్మార్గుల నుండి ప్రాయశ్చిత పరిహారాన్ని గుంజుతాను." "నేను నిర్దాక్షిణ్యంగా వ్యవహరించ దలచాను" పారిస్ ఇక ధ్వంసమైపోతుంది. బోనపార్టిస్టు హంతకులు ఇక తమ ఇష్టానుసారం పారిస్‌ను దోపిడీ చేసి మనసారా ప్రతీకారం తీర్చుకోవచ్చు. అందుకు ప్రభుత్వం అనుమతిస్తున్నది. చివరకు విద్రోహం ఫలితంగా, మే 21న, పారిస్ గేట్లు తెరవబడ్డాయి. జనరల్ దూయే నగరంలో ప్రవేశించాడు. మే 22న తన రాజీకపట నాటకం లక్ష్యం ఏమిటో థియర్స్ రూరల్స్‌కు తెలియజేశాడు. "మన లక్ష్యాన్ని సమీపించనున్నామని మీకు కొద్ది రోజుల క్రితమే తెలియజేశాను. లక్ష్యాన్ని చేరుకున్నాము. అని ఈ రోజున మీకు చెప్పదలచుకున్నాను. భద్రత, న్యాయం, నాగరికత చిట్టచివరకు విజయం సాధించాయి." ఈ రహస్యాన్ని ఇంత కాలం రూరల్స్ మొండిగా గ్రహించలేకపోయారు.

ఆ విధంగా కథ ముగిసింది. బానిసలు, పతితులు యజమానులపై ఎదురు తిరిగిన నాడు, బూర్జువా వ్యవస్థ నాగరికతా, న్యాయాలు నగ్నరూపంలో వెల్లడి ఔతాయి. ఈ నాగరికతా న్యాయాలు, ఎట్టి ముసుగులేని కర్కశత్వానికి, చట్ట రహితమైన ప్రతీకార వాంఛకు తార్కాణమౌతాయి. ఉత్పత్తిదారునికి, సంపదను స్వాహాచేసే పరాన్న భుక్కుకు జరిగే వర్గపోరాటంలో ప్రతి నూతన సంక్షోభం, ఈ వాస్తవాన్ని మరింత స్పష్టంగా బైటపెడుతుంది. 1871 అమానుష హత్యాకాండతో పోలిస్తే 1848 జూన్‌లో బూర్జువావర్గం సాగించిన దారుణాలు స్వల్ప విషయాలు అవుతాయి. వర్సేల్స్ సైన్యాలు పారిస్‌లో ప్రవేశించిన తర్వాత పారిస్ స్త్రీలు, పురుషులు, పిల్లలు 8 రోజులపాటు అపారమైన త్యాగంతో, ధైర్య సాహసాలతో పోరాడారు. వారి లక్ష్యం ఎంతటి ఉన్నతమైనదో వారి ప్రతిఘటనే చిహ్నం. వర్సేల్స్ సైనికులు నగరంలో సాగించిన అమానుష హత్యాకాండ, ఈ కిరాయి మూకలు ప్రాతినిధ్యం వహించే నాగరికతలోని పాశవికత్వాన్ని వెల్లడిస్తుంది. యుద్ధం అయిన తర్వాత మృతుల శవాల గుట్టలను తొలగించటమే ఒక పెద్ద సమస్యగా చేసిన నాగరికత ఎలాంటిదో చెప్పనక్కరలేదు.

థియర్స్, అతని కిరాయి మూకలు సాగించిన హత్యాకాండకు పోలిక చెప్పదలచుకుంటే, రోమ్‌లో, సుల్లా, త్రిమూర్తి పాలకులలోని మిగతా ఇద్దరు సాగించిన హత్యాకాండను ఉదహరించాలి. అదే విధంగా, పెద్దఎత్తున పనిగట్టుకుని పౌరులను హత్యచేశారు. వయస్సును, స్త్రీ పురుష భేదాన్ని ఏమాత్రం పాటించలేదు. ఖైదీలను అదే విధంగా చిత్రహింసల పాల్జేశారు. అదే విధమైన నిషేధాలు విధించారు. అయితే ఈ సారి ఒక మొత్తం వర్గంపై నిషేధాలు అమలు జరిగాయి. రహస్యంగా దాక్కున్న నాయకుల కొరకు ఏ ఒక్కడూ తప్పించుకోగూడదనే కక్షతో పైశాచికమైన వేట జరిగింది. రాజకీయ శత్రువులను వ్యక్తిగత శత్రువులను అదే విధంగా తీవ్రంగా దూషణలతో

ఖండించారు. తగాదాతో ఏమాత్రం సంబంధంలేని అమాయకుల పట్ల సైతం అదే విధమైన పైశాచిక హత్యాకాండ జరిగింది. అయితే ఒకటే తేడా. ఆనాటి రోమన్లకు నిషేధ వ్యక్తులను మొత్తంగా హత్య చేయటానికి భారీ ఫిరంగులు లేవు. "చట్టాన్ని వారు తమ చేతుల్లో" పెట్టుకోలేదు, తమ పెదవులపై 'నాగరికత' శబ్దాన్ని ఉచ్ఛరించలేదు.

ఈ దౌర్జన్యాలన్నీ జరిగిన తర్వాత అంతకంటే అసహ్యమైన దేమంటే బూర్జువా నాగరికతను వారి పత్రికలే వర్ణించిన తీరు.

లండన్ టోరీ పత్రిక పారిస్ విలేఖరి ఇలా వ్రాస్తున్నాడు. "దూరంగా అక్కడక్కడ తుపాకుల ధ్వనులు వినిపిస్తున్నాయి. గాయపడిన వారు పెరీలాచే (Pere la Chaise) శ్మశాన వాటికలో దిక్కూ మొక్కూ లేకుండా మరణిస్తున్నారు. భయభ్రాంతులైన 6000 మంది తిరుగుబాటుదారులు గోరీల మాటున నిరాశోప హతులై సంచరిస్తున్నారు. చేతికందిన దిక్కులేని తిరుగుబాటుదారులను గుంపులుగా, వీధులలో తరలించి, భారీఫిరంగులకు ఎరజేస్తున్నారు. ఒక వైపున ఇలా ఉండగా హోటళ్ళలో, క్లబ్బులలో, బిలియర్డ్సు, పాచికలు తదితరమైన వినోదాలతో విలాస పురుషులు, స్త్రీలు కాలక్షేపం చేస్తున్నారు. ఉద్యానవాటికల చాయలలో స్త్రీలు విశృంఖలంగా ప్రవర్తిస్తున్నారు. విలాసవంతమైన హోటళ్ళలో రాత్రంతా జరిగే వినోద క్రీడల సవ్వడులు రాత్రి ప్రశాంతతను భంగపరుస్తున్నాయి." కమ్యూన్ నిషేధించిన వెర్సైలిస్టు పత్రిక జర్నల్ డి పారిస్‌లో ఎడురాడ్ ఫెర్వే యిలా రాస్తున్నాడు. "పారిస్ ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేసిన తీరు అత్యంత బాధ్యతా రహితంగా, జుగుప్సాకరంగా ఉంది. రోజు రోజుకు ఈ ధోరణి తీవ్రమయ్యే సూచనలున్నాయి. పారిస్ పండుగ రోజుల్లో ఉన్నట్లు ఉంది. యిది ఏ మాత్రం సందర్భోచితంగా లేదు. పతనావస్థలోని పారిస్ పౌరులు అని పిలిపించదలచుకుంటే తప్ప ఇలాంటి దృశ్యాలు కొనసాగరాదు." పిమ్మట టానిటస్ నుండి ఈ క్రింది వాక్యాలను ఉల్లేఖిస్తున్నాడు. "దారుణమైన ఆ పోరాటం జరిగిన మర్నాడు, ఇంకా ఆ పోరాటం పూర్తి కాక ముందే, రోమ్ నగరం తిరిగి తన శృంగార లీలల ఊబిలో కూరుకు పోసాగింది. అవినీతితో పతనమై పోయింది. ఈ ప్రవర్తన ఆ నగరం దేహాన్ని వినాశనమూ, ఆత్మను అపవిత్రం చేస్తున్నది. (ఈ మూల పోరాటాలు, గాయాలు, ఆమూల సాముదాయక స్నానాలు, హోటళ్ళలో వినోదాలు), 'పారిస్ జనాభా' అంటే కేవలం, థయర్స్‌కు చెందిన పారిస్ జనాభా అని చెప్పటం మాత్రమే హెర్వే మరచిపోయాడు. వర్సేల్స్, సెయింట్‌డెనిస్, రూయాల్, సెయింటు జర్మనీ నుండి పారిస్‌కు తిరిగి వచ్చిన ఉన్నత శ్రేణి ఫ్రెంచి పతితులు."

నూతనమూ, ఉన్నతమూ ఐన సమాజ నిర్మాణం కొరకు ఆత్మ త్యాగంతో పోరాడిన వీరులపై రక్తపాతంతో కూడిన విజయం సాధించిన అపవిత్రమైన నాగరికత,

కార్మికుల దోపిడీపై ఆధారపడిన నాగరికత, పరాజితులు హాహాకారాలను, ఆక్రందనలను, ప్రపంచ వ్యాపిత దుష్ప్రచార ఝుంఝూరవంతో, వినపడకుండా చేసింది. శ్రమజీవుల కమ్యూన్‌కు చెందిన ప్రశాంత గంభీరమైన పారిస్, ఒక్కసారిగా శాంతి భద్రతల స్థాపన వేటకుక్కలతో అల్లకల్లోలమై పోయింది. ఈ బ్రహ్మాండమైన మార్పును వివిధ దేశాలలోని బూర్జువా మేధావులు ఎలా భావించారు? నాగరికతకు వ్యతిరేకంగా కమ్యూన్ కుట్ర చేసింది అని వారి భావన. చరిత్రలో ఏ పోరాటంలోనూ చనిపోనంత పెద్ద సంఖ్యలో పారిస్ ప్రజలు, కమ్యూన్ రక్షణకొరకు వీరోచితంగా ప్రాణాలర్పించారు. ఇది ఏమి నిరూపిస్తున్నది? కమ్యూన్ ప్రజల ప్రభుత్వం కాదని, కొద్దిమంది నేరస్తులు కుట్రద్వారా స్వాధీనం చేసుకున్న ప్రభుత్వమని; పారిస్ స్త్రీలు, కాట్రగడలవద్ద, వధ్యస్థలాల వద్ద, కమ్యూన్ కొరకు సంతోషంతో తమ ప్రాణాలర్పిస్తున్నారు. ఇది ఏమితెలియ జేస్తున్నది? కమ్యూన్ రాక్షసులు స్త్రీలనందరినీ, పిశాచాలుగా మార్చి వేశారని! రెండు నెలలపాటు అధికారంలో ఉన్న కమ్యూన్ ప్రదర్శించిన నిగ్రహం, దాని రక్షణకై అది ప్రదర్శించిన ధైర్య సాహసాలతో మాత్రమే సరితూగుతుంది. ఇది ఏమి నిరూపిస్తున్నది? నెలల తరబడి, కమ్యూన్, నిగ్రహం, మానవత్వం ముసుగులో, దాని పైశాచిక రక్తపిపాసను దాచిపెట్టుకుని, ఒక్కసారిగా కష్టకాలంలో వెళ్ళగ్రక్కుతున్నదని.

సాహసోపేతంగా ఆత్మరక్షణ చేసుకుంటున్న పారిస్ శ్రమజీవులు, తమ భవనాలను, ప్రాచీన స్మృతి చిహ్నాలను తామే దగ్ధం చేశారు. ఈ శిల్ప సంపద అంతా తిరిగి వర్సేల్స్ పాలకుల చేత పడరాదనే వారి సంకల్పం. దానిని వర్సేల్స్ ప్రభుత్వం 'దహనకాండ' అని పేరు పెట్టుతున్నది. ఈ దుష్ప్రచార రహస్యాన్ని గ్రామ గ్రామానికి. పేట పేటకు వ్యాపింప చేసింది. తన శత్రువులను వేటాడి, వారందరినీ గృహ దహనాలే వృత్తిగా కలిగిన నేరస్తులుగా చిత్రించాలని దాని సంకల్పం. యావత్ప్రపంచంలోని బూర్జువావర్గం, యుద్ధానంతరం జరిగిన సామూహిక హత్యాకాండ సంగతి పట్టించుకోనేలేదు. కాని సున్నం, ఇటుకలు ధ్వంసమైనందుకు మాత్రం హాహాకారాలు చేసింది.

చంపటానికి, తగల పెట్టటానికి, నాశనం చేయటానికి తన సైనికులకు ప్రభుత్వం లైసెన్సు జారీ చేస్తే అది హత్యాకాండ కాకుండా పోతుందా! వాషింగ్టన్‌లోని కాపిటల్‌ను ఉద్దేశపూర్వకంగా బ్రిటిష్ సైనికులు దగ్ధం చేయటం. చైనా చక్రవర్తి గ్రీష్మ ప్రాసాదాన్ని తగల బెట్టడం, విధ్వంసకాండ కాదా? ప్రష్యన్లు సైనిక అవసరాలేవీ లేకుండానే, కేవలం కక్ష తీర్చుకునేందుకు, పెట్రోలు పోసి చాతిడన్ లాంటి పట్టణాలను, అసంఖ్యాకమైన గ్రామాలను తగలబెట్టటం తన లక్ష్యమనే సాకుతో, థయర్స్ ఆరు వారాలపాటు పారిస్‌పై గుండ్ల వర్షం కురిపించటం విధ్వంసకాండ కాదా? యుద్ధం,

ఇతర ఆయుధాలవలెనే, నిప్పుకూడా ఒక చట్టబద్ధమైన ఆయుధం. శత్రువులు ఆక్రమించుకున్న భవనాలకు నిప్పు పెట్టటానికి తుపాకి గుండ్లు కురిపిస్తారు. ఆ భవన రక్షకులు, ఖాళీ చేయదలచుకుంటే, దాడి చేసేవారి చేతుల్లోకి ఆ భవనాలు పడకుండా ఉండేందుకు. వారే ఆ భవనానలను అగ్నికి ఆహుతి చేస్తారు." ప్రపంచంలో సైనిక శ్రేణుల ముందు వరుసలో ఉండే భవనాలన్నీ అనివార్యంగా దగ్ధం చేయబడుతూనే ఉన్నాయి. కాగా బానిసలు బానిస యజమానులపై చేసే యుద్ధంలో. నిజానికి ఈ యుద్ధం ఒక్కటే న్యాయమైనది, ఈ విధంగా చేయటం మాత్రం సరికాదట. కమ్యూన్ అగ్నిని కేవలం ఆత్మరక్షణ సాధనంగా వాడుకున్నది. హోసమన్ గేట్లు తెరిచిన మీదట. వర్సేల్స్ సేనలు, విశాలమైన వీధుల గుండా తుపాకి గుండ్లవర్షం కురిపించకుండా ఉండేందుకు. వారు అగ్ని ఆయుధాన్ని వాడుకున్నారు. వర్సేల్స్ సేనలు ముందుకు సాగడానికి అగ్నిని వాడుకుంటే, కమ్యూన్ సేనలు వెనక్కు ఉపసంహరించు కోవటానికి అగ్నిని వాడుకున్నారు. కమ్యూన్ సేనల అగ్ని వలన ఎన్ని భవనాలు దగ్ధమయ్యాయో, వర్సేల్స్ సేనల తుపాకి గుండ్లుద్వారా అన్ని భవనాలు దగ్ధమయ్యాయి. ఏ భవనాలను దాడి సేనలు దగ్ధం చేశాయి, ఏ భవనాలను ఆత్మరక్షణ సేనలు దగ్ధం చేశాయి అన్నది నేటికీ వివాదాస్పద సమస్యగానే ఉంది. వర్సేల్స్ సేనలు, తమ యుద్ధ ఖైదీలను మూకుమ్మడిగా హత్య చేయటం ప్రారంభించిన మీదటనే కమ్యూన్ అగ్ని ఆయుధాన్ని వాడుకున్నది. అంతేకాదు కమ్యూన్ అంతకు ముందే ఒక బహిరంగ ప్రకటన చేసింది. తీవ్ర పరిస్థితి గనుక ఎదురైతే తాము పారిస్ శిథిలాల్లో చనిపోతామని పారిస్‌ను మరో మాస్కో చేస్తామని అన్నారు. ప్రభుత్వం కూడా తన మోసానికి ముసుగుగా ఈ వాగ్దానమే చేసింది. ఇందుకవసరమైన పెట్రోలును కూడా ట్రోచూ జాగ్రత్త పెట్టాడు. పారిస్ పౌరుల జీవితాలపట్ల తన శత్రువులకేమాత్రం లక్ష్యం లేదని తమ పారిస్ భవనాలపట్ల మాత్రమే వారికి ఆసక్తి ఉన్నదని కమ్యూన్‌కు తెలుసు. మరొక వైపున, ప్రతీకార చర్యల విషయంలో తాను అతి కఠినంగా ఉంటానని థయర్స్ ముందుగానే చెప్పాడు. సైన్యం తన వైపున సంసిద్ధమైన తర్వాత, రెండో వైపున బైటికి పారిపోయే ద్వారాలన్నిటినీ ప్రష్యన్లు మూసివేసిన మీదట, అతడు ఇలా అన్నాడు. "నేను నిర్దాక్షిణ్యంగా ఉండబోతున్నాను. ప్రతీకారం సంపూర్ణంగా అమలు జరుగుతుంది. న్యాయం అత్యంత కఠోరంగా ఉంటుంది." పారిస్ శ్రమ జీవుల చర్యలు విద్రోహ చర్యలే ఐనట్లయితే అవి తెగింపుతో ఆత్మరక్షణ చేసుకుంటున్న వారి విద్రోహచర్యలు; విజేతల విద్రోహచర్యలు కావు. అమూల్యమైన ప్రాచీన హేతెన్ కళాఖండాలపై, పూర్వకాలపు క్రిస్టియన్లు జరిపిన విద్రోహ చర్యలలాంటివికావు ఆ విద్రోహ చర్యలను సైతం చరిత్రకారులు సమర్థించారు.

శిథిలమౌతున్న పాత సమాజానికి, ఆవిర్భవిస్తున్న నూతన సమాజానికి జరిగే భయంకర పోరాటంలో ఈ విద్రోహం అత్యల్ప విషయంగా వారు జమకట్టారు. చరిత్రాత్మకమైన పారిస్‌ను కూలగొట్టి, విలాస యాత్రికులకు పారిస్‌ను ఆకర్షణీయంగా చేసిన హౌస్‌మన్, విద్రోహచర్యకంటె ఇది తక్కువైనదే.

అయితే, పారిస్ ఆర్చిబిషప్ నాయకత్వానగల 64 మంది యుద్ధ ఖైదీలను కమ్యూన్ హతమార్చిందిగదా, దాని సంగతేమిటి? జూన్ 1848న, బూర్జువా వర్గం, దాని సైన్యం ఒక ఆచారాన్ని, ఏనాడో అదృశ్యమైన ఆచారాన్ని పునరుద్ధరించింది. నిరాయుధులైన యుద్ధ ఖైదీలను కాల్చిచంపటం, ఈ దారుణమైన ఆచారం ఆనాటి నుండి, యూరపులోను, ఇండియాలోను ప్రజా ఉద్యమాలను అణచివేసిన దోపిడీదారులందరూ, దాదాపు ఖచ్చితంగా పాటిస్తూ వచ్చారు. “నాగరికతలో ఇది పురోగతి” అని తద్వారా వారు నిరూపించారు. మరొకవైపున, ప్రష్యన్లు, ఫ్రాన్సులో మరో ఆచారాన్ని పున్ణ స్థాపించారు. అమాయకులైన వారిని ఖైదుచేసి, ఇతరుల చర్యలకు వీరి ప్రాణాలను బలి ఇవ్వటం. పైన మనం తెలుసుకున్నట్లు, థయర్స్ మొదటినుండి తన చేజిక్కిన కమ్యూన్ ఖైదీలను కాల్చివేసే ‘మానవతా’ వైఖరిని చేపట్టాడు. అప్పుడు కమ్యూన్ ఖైదీల జీవితాలను రక్షించేందుకుగాను, బందీలను స్వాధీనం చేసుకునే ప్రష్యన్ ఆచారాన్ని అనుసరించవలసి వచ్చింది. వర్సేల్స్ పదేపదే ఖైదీలను కాల్చివేయటంతో ఈ బందీల జీవితం పదేపదే వారు పోగొట్టుకుంటూనే ఉన్నారు. మాక్‌మోహన్ ఆధ్వర్యాన వర్సేల్స్ సేనలు పారిస్ నగరంలో ప్రవేశించి హత్యాకాండ ప్రారంభించిన తర్వాత ఇక బందీల జీవితం ఎలా కాపాడుతుంది? బూర్జువా ప్రభుత్వాల నిస్సంకోచ రాక్షసత్వంపై ఆఖరు అదుపుగా ఉన్న, బందీలను తీసుకునే పద్ధతి కూడా అపహాస్యం పాలు కావలసిందేనా? ఆర్చిబిషన్ డార్బాయి నిజమైన హంతకుడు థయర్స్. థయర్స్ తన చేతిలో ఉన్న ఒక్క బ్లాంక్విని వదలివేస్తే, ఆర్చిబిషప్‌ను, ఇంకా అనేకమంది మతగురువులను విడుదల చేస్తామని కమ్యూన్ పదేపదే ప్రకటించింది. థయర్స్ మొండిగా నిరాకరించాడు. బ్లాంక్విని వదిలితే, కమ్యూన్‌కు ఒక మెదడు ఇచ్చినట్లు అవుతుందని థయర్స్‌కు తెలుసు. తనకు కావలసింది ఆర్చిబిషప్ శవం. అదే అతని ప్రయోజనానికుపయోగపడుతుంది. కవైనాక్ సాంప్రదాయాన్ని థయర్స్ అనుసరించాడు. జూన్ 1848లో కవైనాక్ అతని ఆర్డర్‌కు చెందిన వ్యక్తులు, తిరుగుబాటుదారులు ఆర్చిబిషప్ అఫ్రేను చంపివేశారని గగ్గోలు పెట్టలేదా: ఆర్చిబిషప్‌ను ఆర్డర్‌కు చెందిన సైనికులే కాల్చి వేశారని వారికి స్పష్టంగా తెలుసు. కాల్పుల సమయంలో అక్కడే ఉన్న ఆర్చిబిషప్ అంగరక్షకుడు జాక్విమెట్, ఈ విషయాన్ని వెన్వెంటనే తన సాక్ష్యంలో పేర్కొన్నాడు కూడా.

ఒక వైపున రక్తం చిందిస్తూనే, విజితులపై పార్టీ ఆఫ్ ఆర్డర్ నిరంతరాయంగా ఈ దుష్ప్రభావ వర్షం కురిపిస్తూనే ఉంది. ఒకే విషయాన్ని ఇది నిరూపిస్తున్నది. మన కాలపు బూర్జువా వర్గం. పాతకాలపు భూస్వామ్య ప్రభువులకు తానే నిజమైన వారసురాలని భావిస్తున్నది. పేద ప్రజలపై ప్రయోగించడానికి ఏ ఆయుధాన్నయినా తాము వాడుకోవచ్చు; పేదలు ఏ ఆయుధాన్ని వాడినా అది మాత్రం మహా నేరం.

విప్లవాన్ని, విదేశీ దురాక్రమణదారుని ప్రోత్సాహంతో, అంతర్యుద్ధంగా మార్చి ధ్వంసం చేయాలనేది పాలకవర్గం యొక్క కుట్ర. సెప్టెంబరు 4వ తేదీ నుండి. పారిస్‌లోకి సెంటీ క్లాడ్ ద్వారం గుండా మాక్ మోహన్ సేనలు ప్రవేశించేవరకు మనం ఈ కుట్ర పరిణామాన్ని పరిశీలించాము. ఇది పారిస్ దారుణ హత్యాకాండతో ముగిసింది. పారిస్ శిథిలమైనందుకు బిస్మార్క్ సంబరపడుతున్నాడు. 1849లో ప్రష్యన్ శాసనసభలో సాధారణ సభ్యుడుగా ఉన్నప్పటినుండి, పారిస్ లాంటి మహానగరాలు ధ్వంసం కావాలని అతడు ప్రార్థనలు చేస్తూ ఉన్నాడు. పారిస్ కార్మికవర్గం శవాలను చూసి అతడు సంబరపడుతున్నాడు. అతని దృష్టిలో, ఇది కేవలం విప్లవాన్ని అణచివేయటం మాత్రమే కాదు, ఫ్రాన్సునే నాశనం చేయటం. ఇప్పుడు ఫ్రెంచి ప్రభుత్వమే ఫ్రాన్సును నిర్వీర్యం చేసివైచింది. జయప్రదమైన రాజకీయ వేత్తలందరికీ ఉండే మందబుద్ధితో అతడు ఈ మహత్తర చారిత్రక ఘటనయొక్క ఉపరితలాన్ని మాత్రమే చూస్తున్నాడు. ఇంతకు ముందు చరిత్రలో ఎక్కడైనా విజేత, తాను జయించిన దేశానికి పోలీసు వానిగా వ్యవహరించటం మాత్రమేకాక ఓడిపోయిన ప్రభుత్వం పరాజయాలపై ఇంత నీచంగా సంబరపడిన వాడున్నాడా! ప్రష్యాకు పారిస్ కమ్యూన్‌ల మధ్య అసలు యుద్ధమే లేదు. తద్విరుద్ధంగా కమ్యూన్ ప్రాథమిక శాంతి షరతులను ఆమోదించింది. ప్రష్యా తన తటస్థతను ప్రకటించింది. కనుక ప్రష్యా యుద్ధంలో అసలు భాగస్వామి కాదు. అది ఒక కోతలరాయుడి పాత్రను. అందులోనూ పిరికిపంద ఐన ప్రగల్భాల రాయుడుపాత్రను నిర్వహించింది. ఏమంటే ప్రష్యాకు ఏ ప్రమాదమూ లేదు. పారిస్ పడిపోతే 500 మిలియన్లు ప్రష్యాకు చెల్లిస్తామని ముందుగానే ఫ్రెంచి ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నది. కనుక డబ్బు కక్కుర్తితో కోతలరాయుడు పాత్ర వహించినవాడు బిస్మార్క్. ఈ విధంగా యుద్ధంయొక్క నిజస్వభావం ఎట్టకేలకు బహిర్గతమైంది. నాస్తికవాద భూయిష్టమైన, అవినీతికరమైన ఫ్రాన్సు దేశాన్ని, నీతివంతమూ, సాత్విక ప్రవృత్తి కలిగిన జర్మనీచే విధి శిక్షింప చేసింది. పాతకాలపు న్యాయవాదుల దృష్టిలో కూడా, ఈ ప్రవర్తన అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధం. ఇట్టి ప్రవర్తన యూరపుకు చెందిన నాగరిక ప్రభుత్వాలకు ఆగ్రహం కలిగించిందా? సెంట్‌పీటర్స్‌బర్గ్ మంత్రివర్గపు చేతిలో తొత్తుగా పనిచేసిన ఇట్టి జిత్తులమారి ప్రష్యన్ ప్రభుత్వాన్ని జాతులనుండి బహిష్కరించారా? లేదు. పైపెచ్చు పారిస్ చుట్టూ విధించబడిన రెండు

శ్రేణుల దిగ్బంధం నుండి ఎవరైనా పొరపాటున తప్పించుకుపోతే, వారిని వర్సేల్స్ ప్రభుత్వ కసాయి వాళ్ళకు స్వాధీనంపరచటం ఎలాగా అని వారు ఆలోచించసాగారు.

ఈ విధంగా ఆధునిక కాలంలో జరిగిన దారుణమైన యుద్ధం తర్వాత, విజేతలు, విజితులు ఇద్దరు, కార్మికవర్గాన్ని నాశనం చేసే ఉమ్మడి కుట్రలో భాగస్వాములైనారు. చరిత్రలోనే అపూర్వమైన ఈ ఘటన, బిస్మార్క్ ఊహించినట్లు, పైకి ఆవిర్భవిస్తున్న నూతన వ్యవస్థయొక్క శాశ్వత అణచివేతను సూచించదు. పాత బూర్జువా వ్యవస్థ మట్టిలో కలిసిపోతున్న విషయాన్ని నిరూపిస్తుంది. పాత వ్యవస్థ ఇప్పటికీ చేయగలిగిన మహత్కార్యం, జాతి క్షేమం కొరకు యుద్ధం చేయటం. ఇది కూడా ప్రభుత్వ పరమైన మోస కృత్యంగా ఇప్పుడు రుజువైంది. వర్గాల పోరాటాన్ని వాయిదా వేయటానికి ఇది ఉద్దేశితమైంది. ఆ వర్గ పోరాటం, అంతర్యుద్ధంగా ప్రజ్వరిల్లిన మరుక్షణం ఈ ముసుగును తోసిపారేస్తున్నది వర్గపాలన. ఇది ఏమాత్రం జాతీయ వేషంలో దాగి ఉండలేదు. జాతీయ ప్రభుత్వాలన్నీ కార్మికులపట్ల ప్రవర్తించే విషయంలో ఒకే రకంగా వ్యవహరిస్తాయి.

1871 దారుణ హత్యాకాండ జరిగిన ఆదివారం తర్వాత, ఫ్రెంచి కార్మిక ప్రజలకు వారి సంపద దోచుకునేవారికి మధ్య శాంతిగాని ఒప్పందంగాని ఇక ఏ మాత్రం సాధ్యంకాదు. కిరాయి సైనికుల ఇనుప కౌగిలి కొంతకాలంపాటు రెండు వర్గాలను ఉమ్మడి దోపిడీకి లోనుచేయవచ్చు. కాని ఈ యుద్ధం ఆనాటికానాడు పెద్ద స్థాయిలో తిరిగి తిరిగి బద్దలవుతూనే వుంటుంది. అంతిమ విజయం కొద్దిమంది దోపిడీదారులదా, అత్యధికులైన శ్రామికులదా? ఎవరిది అనే విషయంలోనూ సందేహం లేదు. ఫ్రెంచి కార్మికవర్గం, ఆ ధనిక వర్గం యొక్క అగ్రశ్రేణి విభాగం మాత్రమే.

ఈ విధంగా పారిస్ ఎదుట యూరపియన్ ప్రభుత్వాలన్నీ, తమ వర్గపాలన యొక్క అంతర్జాతీయ స్వభావాన్ని నిరూపించుకున్నాయి. మరొక వైపున వీరే అంతర్జాతీయ కార్మిక సంస్థను, పెట్టుబడియొక్క అంతర్జాతీయ కుట్రకు ప్రతిగా అంతర్జాతీయ ప్రతీఘాత సంస్థగా నిందిస్తున్నారు. సర్వ అరిష్టాలకు మూలమైనట్లు నిందిస్తున్నారు. కార్మికుల విమోచన దాతగా నటిస్తూ, ఇది కార్మికులపై నియంత అని థియర్స్ దూషించాడు. ఫ్రెంచి అంతర్జాతీయ సంస్థకు, విదేశాలకు గల సంబంధాలన్నిటినీ తెంచివేయాలని పికార్డ్ ఉత్తర్వుచేశాడు. ఈ సంస్థను కూకటివేళ్ళతో పెళ్ళగించటం, అన్ని నాగరిక ప్రభుత్వాలకు పెద్ద సమస్య అని 1835లో థియర్స్‌కు నమ్మినబంటైన కౌంట్ జూబర్టు ప్రకటించాడు. రూరల్స్ ఈ సంస్థకు వ్యతిరేకంగా ఆక్రందనలు చేస్తున్నారు. యూరపు పత్రికా ప్రపంచం అంతా ఇందుకు వంత పాడుతున్నది. మన సంస్థకు పూర్తిగా పరాయి వారైన గౌరవనీయుడైన ఒక ఫ్రెంచి

వ్యక్తి ఇలా రాస్తున్నాడు. జాతీయ రక్షక దళ కేంద్ర కమిటీ సభ్యులు, కమ్యూన్ సభ్యులలో అత్యధికులు, అంతర్జాతీయ కార్మిక సంస్థలోని తెలివి కలిగిన, చురుకైన, ఉత్సాహపూరిత వ్యక్తులలో ముఖ్యులు. వీరు పూర్తిగా చిత్తశుద్ధి గలవారు. నిజాయితీపరులు, తెలివైన వారు, దీక్షాపరులు, పవిత్రులు సరైన అర్థంలో తమ విశ్వాసాలకు మొండిగా అంటిపెట్టుకొని వుండే వారు." పోలీసు మనస్తత్వంతో కలుషితమైన బూర్జువా బుద్ధికి, అంతర్జాతీయ కార్మిక సంస్థ ఒక కుట్రదారుల రహస్య సంస్థగా కనిపిస్తుంది. దాని కేంద్ర సంస్థ దఫదఫాలుగా, వివిధ ప్రాంతాలలో బాంబులు పేల్చవలసిందిగా ఉత్తర్వులు చేస్తూ వుంటుంది. నిజానికి నాగరిక ప్రపంచంలోని వివిధ దేశాల అభివృద్ధి చెందిన శ్రమజీవులకు మధ్య గల అంతర్జాతీయ అనుబంధం మన సంస్థ, అంతకంటే వేరేమీ కాదు. ఎక్కడ ఏ రూపంలో ఏ పరిస్థితులలో వర్గపోరాటం ఏమాత్రమైనా స్థిరత్వాన్ని పొంది నట్లయితే మన సంస్థ సభ్యులు ఆ పోరాటం అగ్రశ్రేణిలో సహజంగానే నిలబడతారు. ఆధునిక సమాజం అనే భూమినుండే ఈ సంస్థ ఉద్భవిస్తున్నది. ఎంతటి హత్యాకాండతోనైనా ఈ సంస్థను నిర్మూలించటం సాధ్యంకాదు. దీనిని నిర్మూలించాలంటే, ప్రభుత్వాలు, కార్మికులపై పెట్టుబడిదారుల నియంతృత్వాన్ని నిర్మూలించాలి. ఈ నియంతృత్వం, వారి పరాన్నభుక్కుల జీవితానికి తొలి షరతు.

శ్రమజీవుల పారిస్, దాని కమ్యూన్‌తో సహా, నూతన సమాజపు వేగు చుక్కగా చిరస్థాయిగా నిలుస్తుంది. దాని మృతవీరులు కార్మిక వర్గ హృదయాలలో చిరస్థాయిగా నిలిచివుంటారు. దానిని నిర్మూలించినవారు, ఇప్పటికే వారి వధ్యశిలకు శాశ్వతంగా బంధించబడి ఉన్నారు. వారి మత గురువులు ఎన్ని ప్రార్థనలు చేసినా, వారికి విముక్తి లభించేది లేదు.

**- లండన్ 1871, మే 30**


Bangunlah kaum yang terhina, bangunlah kaum yang lapar!
Kehendak yang mulya dalam dunia, senantiasa tambah besar.
Lenjapkan adat dan paham tua, kita rakyat sadar-sadar.
Dunia sudah berganti rupa, untuk kemenangan kita.
है जंग हमारी आख़री, जिस पर है फ़ैसला.
गाओ इन्तर्नास्योनाल्!
उठो! के वक़्त आया!

# రాజ్యం, విప్లవం.

## అధ్యాయం- III

# 1871 పారిస్ కమ్యూన్ అనుభవం, మార్క్సు విశ్లేషణ

*వి.ఐ. లెనిన్*

### 1. కమ్యూనార్డుల ప్రయత్నం ఎందుకు వీరోచితం?

ప్రభుత్వాన్ని కూలదోసే యే ప్రయత్నమైనా నిరాశాజనితమైన తెలివితక్కువ పని అవుతుందని మార్క్సు 1870 ఆకురాలు కాలంలో కమ్యూన్‌కు కొద్ది నెలల ముందు, పారిస్ కార్మికులను హెచ్చరించిన విషయం అందరికీ తెలుసు.[1] కానీ 1871 మార్చిలో నిర్ణయాత్మక యుద్ధం కార్మికుల మీద **రుద్దబడి,** వాళ్ళు ఆ సవాలును స్వీకరించినప్పుడు, తిరుగుబాటు వాస్తవ రూపం దాల్చింది. ప్రతికూల శకునాలు వుండినప్పటికీ మార్క్సు అత్యంత ఉత్సాహంతో ఆ కార్మికవర్గ విప్లవానికి స్వాగతం పలికాడు. "అకాల" ఉద్యమాన్ని ఖండించే ఛాందస వైఖరిలో మార్క్సు పట్టుబట్టి కూర్చోలేదు. మార్క్సిజాన్ని వదిలిపెట్టిన రష్యన్ అపకీర్తివంతుడు ప్లెహానొవ్ అలా చేశాడు. ప్లెహానొవ్ 1905 నవంబర్‌లో కార్మిక, కర్షక పోరాటం గురించి ప్రోత్సాహకరంగా రాశాడు, కానీ 1905 డిసెంబర్ తర్వాత, లిబరల్ ధోరణిలో "వాళ్లు ఆయుధాలు చేబూని వుండకూడదు" అని కేకలు వేశాడు.

కానీ, తాను వర్ణించినట్లు "స్వర్గాన్ని ముట్టడించిన" కమ్యూనార్డుల వీరత్వం గురించి మార్క్సు ఉత్సాహంగా వుండడం[2] మాత్రమే కాదు. ప్రజా విప్లవోద్యమం

తన లక్ష్యాన్ని సాధించకపోయినప్పటికీ, ఆయన దానిని అపారమైన ప్రాముఖ్యం గల చారిత్రక అనుభవంగా, ప్రపంచ శ్రామిక విప్లవంలో ఒకానొక పురోగతిగా, వందలాది కార్యక్రమాలకంటే, వాదాల కంటే ముఖ్యమైన ఆచరణాత్మక చర్యగా పరిగణించాడు. ఈ అనుభవాన్ని పరిశీలించడమూ, దీనినుండి యెత్తుగడల గుణపాఠాలు తీయడమూ, దీని దృష్ట్యా తన సిద్ధాంతాన్ని పునఃపరీక్షించడమూ – ఇది మార్క్సు పెట్టుకున్న లక్ష్యం.

*"కమ్యూనిస్టు ప్రణాళిక"* కు తాను అవసరమనుకున్న ఒకే ఒక "దిద్దుబాటు"ను మార్క్సు పారిస్ కమ్యూనార్డుల విప్లవ అనుభవం ప్రాతిపదిక మీద చేశాడు.

***"కమ్యూనిస్టు ప్రణాళిక"*** కొత్త జర్మన్ ప్రతికి 1872, జూన్ 24వ తేదీతో రచయితలిద్దరి సంతకాలతో చివరి పీఠిక ఉంది. ఈ పీఠికలో రచయితలు, కార్ల్ మార్క్సు, ఫ్రెడరిక్ ఎంగెల్స్, ***""కమ్యూనిస్టు ప్రణాళిక"*** లోని కార్యక్రమం "కొన్ని వివరాల విషయంలో పాతబడిపోయింది" అంటూ, ఇంకా యిలా అంటారు :

> "....ముఖ్యంగా ఒక విషయం పారిస్ కమ్యూన్‌లో రుజువైంది : 'అప్పటికి సిద్ధంగా వున్న రాజ్య యంత్రాన్ని కార్మికవర్గం స్వాధీనం చేసుకొని, తన సొంత ప్రయోజనాలకు ఉపయోగించుకోజాలదు' అనేది..."

ఈ చిన్న పేరాలో ఒంటి కొటేషన్ మార్కులలో వున్న మాటలను రచయితలు ***"ఫ్రాన్సులో అంతర్యుద్ధం"*** అనే మార్క్సు గ్రంథం నుండి తీసుకున్నారు.

ఈ విధంగా, మార్క్సు, ఎంగెల్సూ పారిస్ కమ్యూన్ ప్రధానమైన, మౌలికమైన గుణపాఠాల్లో ఒకదాన్ని యెంత అపారమైన ప్రాముఖ్యం కలదిగా భావించారంటే, వాళ్ళు దానిని ఒక ముఖ్యమైన దిద్దుబాటుగా "కమ్యూనిస్టు ప్రణాళిక"లో ప్రవేశ పెట్టారు.

అత్యంత విలక్షణంగా, ఈ ముఖ్యమైన దిద్దుబాటునే అవకాశవాదులు వక్రీకరించింది; దీని అర్థం బహుశా "కమ్యూనిస్టు ప్రణాళిక" పాఠకులలో నూరింట తొంభై తొమ్మిది మందికి కాకపోయినా, పదింట తొమ్మిది మందికి తెలియదు. ముందు మరింత పూర్తిగా ప్రత్యేకంగా వక్రీకరణలకు కేటాయించబడిన అధ్యాయంలో ఈ వక్రీకరణను చూద్దాం, ఇక్కడ ఒక విషయం గమనిస్తే చాలు. ఇక్కడ మార్క్సు

అధికారాన్ని కైవసం చేసుకోడానికి భిన్నంగా నిదానపు అభివృద్ధి అనే భావం వగైరాలను నొక్కి చెపుతున్నాడనేది పైన ఉల్లేఖించిన మార్క్సు ప్రసిద్ధ ప్రకటనకు ప్రస్తుతం చలామణిలో వున్న తప్పుడు "వ్యాఖ్యానం".

వాస్తవంలో, ***అసలు విషయం దీనికి సరిగ్గా తలకిందులుగా వుంది.*** కార్మికవర్గం "సిద్ధంగా వున్న రాజ్య యంత్రాన్ని" ***బద్దలు చేయాలి, తుత్తునియలు చేయాలి,*** కేవలం దాన్ని స్వాధీనం చేసుకోడానికి పరిమితం కాకూడదు, అనేది మార్క్సు భావం.

1871, ఏప్రిల్ 12న, అనగా సరిగ్గా కమ్యూన్ రోజుల్లో, కూగెల్‌మన్‌కు మార్క్సు ఇలా రాసినాడు :

"....నా ***'బ్రూమేర్ పద్ధెనిమిదవ తేదీ'*** చివరి అధ్యాయం చూస్తే నీకు తెలుస్తుంది, ఫ్రెంచి విప్లవం వచ్చే ప్రయత్నం యిక ఎంత మాత్రమూ, గతంలో లాగ, బ్యూరోక్రటిక్ మిలిటరీ యంత్రాన్ని ఒక చేతి నుండి మరొక చేతికి బదలాయించడం కాక, దానిని తుత్తునియలు చేయడమనీ" (ఇటాలిక్స్ మార్క్సువి - మాతృకలోని పదం zerbrechen), "యూరోపియన్ భూఖండంలో జరిగే ప్రతి నిజమైన ప్రజా విప్లవానికి ఇది ప్రాథమిక షరతు అని నేను చెప్తున్నాను, మరి పారిస్‌లోని మన వీర కామేడ్లు ప్రయత్నిస్తున్నదీ ఇదే" ("Neue zeit" సంపుటం XX, 1, 1901-02, పేజి 709). (కూగెల్‌మన్‌కు మార్క్సు ఉత్తరాలు రష్యన్ భాషలో ఒకటి కాదు, రెండు కూర్పులలో వెలువడినాయి;అందులో ఒకదానికి నేను సంపాదకునిగా వుండి, పీఠిక రాసినాను).

"బ్యూరోక్రటిక్ మిలిటరీ రాజ్య యంత్రాన్ని తుత్తునియలు చేయడం" అనే మాటలు విప్లవ కాలంలో రాజ్యం విషయంలో కార్మికవర్గ కర్తవ్యాలను గురించి మార్క్సిజం యొక్క ప్రధాన గుణపాఠాన్ని టూకీగా వ్యక్తం చేస్తాయి. మరి మార్క్సిజంకు నేడు చలామణిలో వున్న కౌట్స్కీవాద "వ్యాఖ్యానం" చేత ఈ పాఠం పూర్తిగా విస్మరింపబడడమే కాక, నిశ్చయంగా వక్రీకరించబడింది!

***"బ్రూమేర్ పద్ధెనిమిదవ తేదీ"*** కి మార్క్సు ప్రస్తావన విషయం యేమిటంటే, దానికి సంబంధించిన పేరాను నేను పైన పూర్తిగా ఉల్లేఖించాను.

పైన ఉల్లేఖించిన మార్క్సు వాదంలో ప్రత్యేకంగా రెండు అంశాలు గమనించడం ఆసక్తికరం. మొదటిది, ఆయన తన నిర్ధారణను యూరోపియన్ భూ ఖండానికి పరిమితం చేస్తాడు. 1871లో, బ్రిటన్ అప్పటికింకా ఆదర్శమైన శుద్ధ పెట్టుబడిదారీ దేశంగా వుంటూ, అయినా సైనికవాద ముఠా లేకుండానూ,

గణనీయమైన మేరకు బ్యూరోక్రసీ లేకుండానూ వుండినప్పుడు ఇది సుబోధకంగా వుండింది. కనుక మార్క్సు బ్రిటన్‌ను మినహాయించినాడు. అక్కడ, "సిద్ధంగా వున్న రాజ్య యంత్రాన్ని" ధ్వంసం చేయాలనే ప్రాథమిక షరతు **లేకుండానే,** విప్లవం, ప్రజా విప్లవం కూడా, అప్పుడు సంభవంగా కనిపించింది, నిజానికి సంభవంగా వుండింది.

ఈనాడు, 1917లో, ప్రథమ సామ్రాజ్యవాద మహా యుద్ధ సమయంలో, మార్క్సు పెట్టిన ఈ పరిమితి ఇక యెంత మాత్రమూ చెల్లదు. వాటికి సైనికవాద ముఠాలూ, బ్యూరోక్రసీ లేవనే అర్థంలో ఆంగ్లో–సాక్సన్ "స్వేచ్ఛ"కు – యావత్ప్రపంచంలోనూ – అత్యంత పెద్ద, చివరి ప్రతినిధులు అయిన బ్రిటన్, అమెరికాలు రెండూ– ప్రతి దాన్నీ తమకు లోబరచుకొని, ప్రతిదాన్నీ అణచివేసే బ్యూరోక్రటిక్ మిలిటరీ సంస్థల అఖిల యూరోపియన్ గలీజు రొచ్చుగుంటలో పూర్తిగా మునిగిపోయాయి. ఈనాడు బ్రిటన్, అమెరికాలలో కూడా, "సిద్ధంగా వున్న రాజ్య యంత్రాన్ని" (ఆ దేశాలలో 1914–1917 సంవత్సరాలలో తయారుచేయబడి, "యూరోపియన్," సాధారణ సామ్రాజ్యవాద, సర్వ సమగ్ర స్థితికి కొనిరాబడిన రాజ్య యంత్రాన్ని) ***తుత్తునియలు చేయడం, ధ్వంసం చేయడం*** "ప్రతి నిజమైన ప్రజా విప్లవానికీ ప్రాథమిక షరతు."

రెండవది, బ్యూరోక్రటిక్ మిలిటరీ రాజ్య యంత్రాన్ని ధ్వంసం చేయడం "ప్రతి నిజమైన ***ప్రజా*** విప్లవానికి ప్రాథమిక షరతు" అనే మార్క్సు యొక్క మహా గంభీరమైన అభిప్రాయ ప్రకటనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. "ప్రజా" విప్లవం అనే ఈ భావం మార్క్సు నుండి రావడం విడ్డూరంగా కనిపిస్తుంది. రష్యన్ ప్లెహానొవైట్లూ, మెన్షెవిక్కులూ – మార్క్సిస్టులుగా చలామణి కాగోరే స్ట్రూవె అనుచరులు – అది మార్క్సు నుండి రాత పొరపాటు వల్ల వచ్చిందని ప్రకటించడానికి అవకాశం వుంది. వాళ్లు మార్క్సిజాన్ని ఏ దౌర్భాగ్యపు ఉదారవాద వక్రీకరణకి కుదించారంటే, బూర్జువా విప్లవానికీ, శ్రామికవర్గ విప్లవానికీ మధ్య గల వైరుధ్యంగా మాత్రమే పరిమితం చేశారు. ఈ వైరుధ్యాన్ని కూడా వాళ్ళు పరమ నిర్జీవంగా వ్యాఖ్యానిస్తారు.

20వ శతాబ్దపు విప్లవాలను ఉదాహరణలుగా తీసుకుంటే, పోర్చుగీస్, టర్కిష్ విప్లవాలు[3] రెండూ బూర్జువా విప్లవాలని మనం ఒప్పుకోవలసి వుంటుంది, నిజమే. కానీ, ఆ రెంటిలో యేదీ "ప్రజా" విప్లవం కాదు; ఎందుకంటే, ఆ రెంటిలో దేనిలోనూ ప్రజా బాహుళ్యం, ప్రజలలో అపారమైన మెజారిటీ, క్రియాశీలంగా,

స్వతంత్రంగా, గుర్తించదగిన ఏ మేరకైనా తమ సొంత ఆర్థిక, రాజకీయ డిమాండ్లతో ముందుకు రాలేదు. దీనికి భిన్నంగా, 1905-1907 రష్యన్ బూర్జువా విప్లవం పోర్చుగీస్, టర్కిష్ విప్లవాలకు ఆనాడు లభించినట్టి "ఉజ్వల" విజయాలను ప్రదర్శించకపోయినా, అది "నిజంగా ప్రజా" విప్లవం; ఎందుకంటే, ప్రజా బాహుళ్యం, ప్రజలలో మెజారిటీ, పీడన చేతా, దోపిడీ చేతా నలిగిపోయిన, అత్యంత అట్టడుగు సామాజిక బృందాలు స్వతంత్రంగా తిరగబడ్డారు. **తమ** సొంత డిమాండ్ల ముద్రను, ధ్వంసం చేయబడుతూ వుండిన పాత సమాజం స్థానంలో ఒక కొత్త సమాజాన్ని తమ సొంత పద్ధతిలో నిర్మించుకునే **తమ** ప్రయత్నాల ముద్రను, యావత్తు విప్లవ గమనం మీద ముద్రించారు.

యూరప్‌లో 1871లో, భూఖండంలోని యే దేశంలో శ్రామిక వర్గం ప్రజలలో మెజారిటీగా లేదు. "ప్రజా" విప్లవం, అనగా వాస్తవంగా మెజారిటీని తన ప్రవాహ గమనంలోకి రాబట్టుకునే విప్లవం శ్రామిక వర్గానికీ, రైతులకూ ఉభయులకూ ఆవరిస్తేనే అలాంటి విప్లవం కాగలదు అప్పుడు "ప్రజలు" అంటే ఈ ఉభయవర్గాలు . "బ్యూరోక్రటిక్ మిలిటరీ రాజ్య యంత్రం" వీళ్ళను పీడించి, నులిమి, దోపిడీ చేయడం చేత ఈ ఉభయ వర్గాలూ ఏకం చేయబడ్డాయి. ఈ యంత్రాన్ని ***బద్దలు చేయడం,*** దీన్ని ***తుత్తునియలు చేయడం*** "ప్రజల"కూ, ప్రజలలో మెజారిటీకీ, కార్మికులకూ, కర్షకులలో అత్యధిక భాగానికీ, నిజంగా ప్రయోజనకరం. అది బీద రైతుల, కార్మికుల స్వతంత్ర పొత్తుకు "ప్రాథమిక షరతు"; కాగా, అలాంటి పొత్తు లేకుండా ప్రజాస్వామ్యం స్థిరంగా వుండదు, సోషలిస్టు రూపాంతరం సాధ్యం కాదు.

అందరికీ తెలిసినట్లు, పలు అంతర్గత, బాహ్య పరిస్థితుల మూలంగా అది తన గమ్యాన్ని చేరకపోయినప్పటికీ పారిస్ కమ్యూన్ వాస్తవంగా అలాంటి పొత్తు వైపుకు సాగింది.

కనుక, "నిజమైన ప్రజా విప్లవం" గురించి మాట్లాడడంలో మార్క్స్, పెటీ బూర్జువా వర్గం యొక్క ప్రత్యేక లక్షణాలను యే మాత్రమూ తక్కువ చేయకుండానే (వాటిని గురించి ఆయన చాలా చెప్పినాడు, తరచుగానూ), 1871లో యూరోపియన్ భూఖండంలో అత్యధిక దేశాలలోని వర్గ శక్తుల వాస్తవ బలాబలాలను కచ్చితంగా లెక్కలోకి తీసుకున్నాడు. మరొకవైపున ఆయన రాజ్య యంత్రాన్ని "బద్దలు చేయడం" కార్మిక, కర్షకుల ఉభయుల ప్రయోజనాలకూ అవసరమనీ, అది వాళ్లను ఐక్యం చేసిందనీ, "పరాన్నజీవి"ని తొలగించి, దాని స్థానంలో ఒక కొత్తదాన్ని స్థాపించే సమిష్టి కర్తవ్యాన్ని అది వాళ్ల ముందు వుంచిందనీ చెప్పినాడు.

దాని స్థానంలో స్థాపించేది యేమిటి?

## 2. బద్దలు కొట్టబడిన రాజ్య యంత్రం స్థానంలో స్థాపించేది ఎమిటి ?

1847లో, "కమ్యూనిస్టు ప్రణాళిక"లో ఈ ప్రశ్నకు మార్క్సు ఇచ్చిన జవాబు అప్పటికింకా కేవలం అనిర్దిష్టంగా వుండింది; కచ్చితంగా చెప్పాలంటే, ఆ జవాబు కర్తవ్యాలను సూచించింది గానీ, వాటిని సాధించే మార్గాలను సూచించలేదు. ఈ యంత్రం స్థానంలో"ప్రజాస్వామ్యాన్ని గెలుచుకొని" "పాలక వర్గంగా సంఘటితపడిన శ్రామికవర్గాన్ని, స్థాపించాలన్నది **కమ్యూనిస్టు ప్రణాళిక** లో ఇచ్చిన జవాబు.

మార్క్సు ఊహాజనిత పథకాలలో నిమగ్నం కాలేదు. ఈ పాలక వర్గంగా కార్మికవర్గం సంఘటితపడడం ఏ నిర్దిష్ట రూపాలు ధరిస్తుంది, ఈ సంఘటితపడడం అత్యంత సంపూర్ణమైన, అత్యంత స్థిరమైన "ప్రజాస్వామ్యాన్ని గెలుచుకోవడం"తో కచ్చితంగా ఏ పద్ధతిలో సంయుక్తమవుతుంది అనే ప్రశ్నకు ప్రజా ఉద్యమ **అనుభవం** సమాధానం ఇస్తుందని ఆయన అనుకున్నాడు.

కమ్యూన్ అనుభవాన్ని, అది స్వల్పమే అయినా, మార్క్సు ***ఫ్రాన్సులో అంతర్యుద్ధం*** లో అత్యంత జాగ్రత్తతో కూడిన పరిశీలనకు గురిచేసినాడు. ఈ గ్రంథంలోని అత్యంత ముఖ్యమైన భాగాలను ఉల్లేఖిస్తాను.

"శాశ్వత సైన్యమూ, పోలీసులూ, బ్యూరోక్రసీ, మతగురువులు, న్యాయాధికారి వర్గమూ అనే సార్వత్రిక అంగాలు గల కేంద్రీకృత రాజ్య అధికారం" మధ్య యుగాలలో ప్రారంభమై, 19వ శతాబ్దిలో అభివృద్ధి అయింది. పెట్టుబడికి – శ్రమకి మధ్య వర్గ వైరుధ్యాలు అభివృద్ధి చెందడంతో "రాజ్యాధికారం శ్రామికవర్గాన్ని అణచడానికి వున్న సామాజిక శక్తి స్వభావాన్ని, వర్గ పరిపాలనా యంత్ర స్వభావాన్ని, అంతకంతకూ ఎక్కువగా సంతరించుకుంది. వర్గ పోరాటాన్ని ముందుకు తీసుకుపోతూ ప్రతి విప్లవమూ జరిగిన తర్వాత, రాజ్యాధికారం యొక్క శుద్ధ బలప్రయోగ స్వభావం అంతకంతకూ స్ఫుటంగా కనపడుతుంది." 1848–1849 విప్లవం తర్వాత, రాజ్యాధికారం "శ్రమ మీద పెట్టుబడి యొక్క జాతీయ యుద్ధ పరికరం" అయింది. రెండవ సామ్రాజ్యం[4] దీనిని ధృవీకరించింది.

"సామ్రాజ్యానికి సూటిగా విరుద్ధమైనది. కమ్యూన్." అది "వర్గ పరిపాలన రాజరిక రూపాన్ని మాత్రమే కాక, వర్గ పరిపాలననే తొలగించే రిపబ్లిక్ నిర్దిష్ట రూపం...."

కార్మిక వర్గం, సోషలిస్టు, రిపబ్లిక్ యొక్క ఈ "నిర్దిష్ట" రూపం ఏమిటి? అది సృష్టించ నారంభించిన రాజ్యం ఏమిటి?

"కమ్యూన్ మొదటి శాసనం... శాశ్వత సైన్యాన్ని రద్దు చేసి, దాని స్థానంలో సాయుధ ప్రజలను ప్రవేశ పెట్టడం ...."

ఈ డిమాండు సోషలిస్టు పార్టీనని చెప్పుకునే ప్రతి పార్టీ కార్యక్రమంలోనూ ఇప్పుడు కనిపిస్తుంది. కానీ ఆ పార్టీల కార్యక్రమాల నిజమైన విలువను అత్యుత్తమంగా తెలియజేసేది మన సోషలిస్టు రివల్యూషనరీల, మెన్షెవిక్కుల ప్రవర్తన ; వాళ్ళు ఫిబ్రవరి 27 విప్లవం జరిగిన వెంటనే ఈ డిమాండ్‌ను అమలుపరచడానికి ఆచరణలో నిరాకరించారు!

"...మున్సిపల్ కౌన్సిలర్లతో కమ్యూన్ ఏర్పడింది. ఈ కౌన్సిలర్లు వివిధ వార్డులలో సార్వజనీన ఓట్ హక్కు ద్వారా ఎన్నుకోబడిన వారు. వీరు తమను ఎన్నుకొన్న వారికి బాధ్యులుగా ఉంటారు. ఆ ఎన్నుకొన్నవారు వారిని ఎప్పుడైనా తొలగించే అధికారం కలిగి ఉంటారు. కమ్యూన్ సభ్యులలో మెజారిటీ, సహజంగా శ్రమజీవులు, అంగీకరించబడిన కార్మికవర్గ ప్రతినిధులు ఉంటారు....

"...అప్పటి వరకు ప్రభుత్వ పరికరంగా వుండిన పోలీసు శాఖ రాజకీయ హోదాలు వెనువెంటనే తొలగించబడ్డాయి, కమ్యూన్‌కు బాధ్యత వహించే సంస్థగా, ఎప్పుడంటే అప్పుడు దింపబడే సంస్థగా అది మార్చబడింది.... ఇతర పరిపాలన శాఖలన్నింటిలోని ఉద్యోగులూ అలాగే వున్నారు.... కమ్యూన్ సభ్యులు మొదలుకొని, పై నుండి కిందివరకు అందరూ ***శ్రమజీవుల వేతనాలకు*** ప్రభుత్వోద్యోగం చేయాలి. ప్రభుత్వ ఉన్నత అధికార్ల అధిక సౌకర్యాలు, ప్రాతినిధ్యపు అలవెన్సులూ ఆ అధికార్లతో సహా అదృశ్యమైనాయి.... పాత ప్రభుత్వపు భౌతిక బలప్రయోగ పరికరాలైన శాశ్వత సైన్యాన్ని, పోలీసు శాఖనూ తొలగించుకున్న తర్వాత, కమ్యూన్ వెంటనే ఆధ్యాత్మిక పీడన పరికరాన్ని, మతగురువుల అధికారాన్ని తుత్తునియలు చేయడానికి పూనుకుంది... న్యాయశాఖ ఉద్యోగులు తమ బూటకపు స్వాతంత్ర్యాన్ని కోల్పోయారు... అప్పటినుండి వాళ్లు బాహాటంగా ఎన్నుకోబడేవాళ్లుగా, బాధ్యులుగా, దింపబడేవాళ్లుగా ఉండవలసి వచ్చింది...."[5]

శాశ్వత సైన్యాన్ని రద్దు చేయడం, ఉద్యోగులందరూ ఎన్నికై, దింపబడేటట్లు చేయడం ద్వారా, కమ్యూన్ బ్రద్దలైన రాజ్యయంత్రం స్థానంలో మరింత పరిపూర్ణమైన ప్రజాస్వామ్యాన్ని "మాత్రం" ప్రవేశ పెట్టినట్లు కనపడుతుంది : కానీ, వాస్తవంలో

ఈ "మాత్రం"కు అర్థమేమిటంటే, కొన్ని కొన్ని సంస్థల స్థానాన్ని మౌలికంగా భిన్నమైన రకానికి చెందిన ఇతర సంస్థలు ఆక్రమించుకొనే బ్రహ్మాండమైన కార్యం. సరిగ్గా ఇది. "పరిమాణం గుణాత్మకంగా మారడానికి" ఉదాహరణ : ప్రజాస్వామ్యం ఊహింప సాధ్యమైనంత మేరకు పూర్తిగా, స్థిరంగా ప్రవేశపెట్టబడి, బూర్జువా ప్రజాస్వామ్యం నుండి శ్రామికవర్గ ప్రజాస్వామ్యానికి రూపాంతరం చెందింది; రాజ్యం (ఒక నిర్దిష్ట వర్గాన్ని అణచడానికి వున్న ప్రత్యేక శక్తి ) నుండి సరైన అర్థంలో ఇక ఎంత మాత్రమూ రాజ్యం కానట్టి దానికి రూపాంతరం చెందింది.

బూర్జువా వర్గాన్ని అణచడమూ, దాని ప్రతిఘటనను నులిమి వేయడమూ ఇంకా అవసరమే. కమ్యూన్‌కు ఇది మరీ అవసరంగా వుండింది. ఈ పనిని అది తగినంత దీక్షతో చేయకపోవడం దాని ఓటమికి గల కారణాలలో ఒకటి. కానీ ప్రజానీకంలో మెజారిటీ బానిసత్వంలోనూ, ఫ్యూడల్ దాస్యంలోనూ, వేతన బానిసత్వంలోనూ ఎప్పుడూ వుండినట్లు అణచివేత సంస్థ యిక్కడ మైనారిటీ కాదు. ప్రజలలోని మెజారిటీ ***తానే*** తన పీడకులను అణచి వేస్తుంది గనుక, అణచివేతకు "ప్రత్యేక శక్తి" ఇక ***ఎంత మాత్రమూ అవసరం లేదు! ఈ అర్థంలో, రాజ్యం దుల్లిపోవడం మొదలవుతుంది.*** అధిక సౌకర్యాలు గల మైనారిటీ యొక్క ప్రత్యేక సంస్థలకు (అధిక సౌకర్యాలు గల ఉద్యోగి వర్గానికీ, శాశ్వత సైన్యపు అధిపతులకూ) బదులు, మెజారిటీ తానే ఈ విధులనన్నిటినీ నేరుగా నిర్వహించగలదు; రాజ్యాధికారపు కార్యాలను మొత్తం ప్రజలు యెంత ఎక్కువగా నిర్వహిస్తే ఈ అధికారం వుండవలసిన అవసరం అంత తక్కువగా వుంటుంది.

ఈ సందర్భంలో కమ్యూన్ తీసుకున్న ఈ క్రింది చర్యలు మార్క్సు నొక్కి చెప్పినట్టివి ప్రత్యేకంగా గమనార్హం : ఉద్యోగులకు సమస్త ప్రాతినిధ్యపు అలవెన్సులు, డబ్బు విషయంలో సమస్త అధిక సౌకర్యాల రద్దూ, రాజ్యంలో **సమస్త** ప్రభుత్వోద్యోగుల జీతాన్ని **"కార్మికుల** వేతనాల" స్థాయికి తగ్గించడమూ. బూర్జువా ప్రజాస్వామ్యం నుండి కార్మికవర్గ ప్రజాస్వామ్యానికీ, పీడకుల ప్రజాస్వామ్యం నుండి పీడిత వర్గాల ప్రజాస్వామ్యానికీ, ఒక నిర్దిష్ట వర్గాన్ని అణచడానికి ***"ప్రత్యేక శక్తి"*** గా వున్న రాజ్యం నుండి ప్రజానీకపు మెజారిటీ, కార్మిక కర్షకుల ***సమస్త శక్తి చేత*** పీడకుల అణచివేతకూ జరిగిన ***మలుపును*** మరేదీ తెలియజేయనంత స్పష్టంగా ఇది తెలియజేస్తుంది. ప్రత్యేకంగా దృష్టి నాకర్షించే ఈ అంశం మీదనే, రాజ్య సమస్యకు సంబంధించినంత వరకు బహుశా అత్యంత ముఖ్యమైన దీని మీదనే, మార్క్సు భావాలు అత్యంత సంపూర్ణంగా నిర్లక్ష్యం చేయబడినాయి! అసంఖ్యాక జనరంజక వ్యాఖ్యానాలలో ఇది ప్రస్తావనకు నోచుకోదు. జరిగేది యేమిటంటే, దీన్ని గురించి మౌనం వహించడం, ఇదేదో పాతకాలపు "అమాయకత్వం" అయినట్లు – తమ మతం అధికారిక మతం

అయిన తర్వాత క్రిస్టియన్లు ప్రజాతంత్ర విప్లవకర తత్వం గల ఆదిమ క్రిస్టియన్ మతపు "అమాయకత్వాన్ని" "మరచిపోయినట్లు".

ఉన్నత ప్రభుత్వోద్యోగుల జీతాల తగ్గింపు "కేవలం" అమాయక, ఆదిమ ప్రజాస్వామ్యపు డిమాండు లాగ కనిపిస్తుంది. ఆధునిక అవకాశవాదపు "స్థాపకుల"లో ఒకడైన మాజీ సోషల్ డెమొక్రట్ ఎడువార్డ్ బెర్న్‌స్టైన్ "ఆదిమ" ప్రజాస్వామ్యం పట్ల వెకిలి బూర్జువా వెక్కిరింపులను పలుమార్లు పునశ్చరణ చేశాడు. అవకాశవాదులందరిలాగే, ప్రస్తుత కౌట్స్కీయైట్ల లాగే, అతనికి బొత్తిగా అర్థంకానిది ఏమిటంటే, మొట్టమొదటిది, "ఆదిమ" ప్రజాస్వామ్యానికి కొంత "తిరోగమనం" లేకుండా, పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి సోషలిజంకు పరివర్తన అసాధ్యం (అలా కాకపోతే మరెలా మెజారిటీ ప్రజలూ, ఆ తరువాత మినహాయింపు లేకుండా యావత్తు ప్రజలూ రాజ్య విధులను నిర్వహించడానికి పూనుకుంటారు?); రెండవది, పెట్టుబడిదారీ వ్యవస్థ మీదా, పెట్టుబడిదారీ సంస్కృతి మీదా ఆధారపడిన "ఆదిమ ప్రజాస్వామ్యమూ" చరిత్ర పూర్వ కాలంలోనూ, పెట్టుబడిదారీ పూర్వ కాలంలోనూ వుండిన ఆదిమ ప్రజాస్వామ్యమూ ఒకటి కాదు. పెట్టుబడిదారీ సంస్కృతి భారీ ఉత్పత్తి, ఫాక్టరీలు, రైల్వేలు, తపాలా శాఖ, టెలిఫోన్లు వగైరాలనూ ***సృష్టించింది ; ఈ ప్రాతిపదిక మీద*** పాత ''రాజ్యాధికారపు'' కార్యాలలో గొప్ప మెజారిటీ కార్యాలు యెంత సరళీకరింపబడినాయంటే, రిజిస్టర్ చేసుకోవడమూ, ఫైల్ చేసుకోవడమూ, సరిచూసుకోవడమూ లాంటి ఎంత మహా సరళమైన చర్యలుగా వాటిని కుదించవచ్చునంటే, ఆ విధులను ప్రతి అక్షరాస్యుడూ సులభంగా నిర్వహించగలడు, వాటిని మామూలు "కార్మికుల వేతనాల"కు అతి సులభంగా నిర్వహించవచ్చు, ప్రతి అధిక సౌకర్యాన్నీ ఛాయామాత్రంగా కూడా మిగలకుండా, ప్రతి "అధికార దర్పాన్నీ" రేఖామాత్రంగా కూడా మిగలకుండా ఆ విధుల నుండి లాగి పారవేయవచ్చు (లాగిపారవేసి తీరాలి కూడా).

మినహాయింపు లేకుండా సకల ఉద్యోగులూ ఎన్నుకోబడడమూ, **ఎప్పుడంటే అప్పుడు** దించబడేటట్లు వుండడమూ, వాళ్ళ జీతాలను మామూలు "కార్మికుల వేతనాల" స్థాయికి తగ్గించడమూ – ఈ సరళ, "స్వయంవ్యక్త" ప్రజాతంత్ర చర్యలు, ఒకవైపున కార్మికుల యొక్కా, రైతులలో మెజారిటీ యొక్కా ప్రయోజనాలను పూర్తిగా ఏకం చేస్తూ, అదే సమయంలో పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి సోషలిజంకు తీసుకపోయే వంతెనగా పనిచేస్తాయి. ఈ చర్యలు రాజ్య పునర్నిర్మాణానికి, శుద్ధ రాజకీయమైన సమాజ పునర్నిర్మాణానికీ, సంబంధించినవి; కానీ, ఇవి తమ పూర్తి అర్థాన్నీ, ప్రాముఖ్యాన్ని సంపాయించుకొనేది యెప్పుడంటే, "ఆస్తి హరించిన వారి – ఆస్తి

హరించబడటం" సాధింపబడుతూ గానీ, సన్నాహంలో గానీ వున్న సందర్భంలో మాత్రమే; అనగా, ఉత్పత్తి సాధనాల మీద వున్న పెట్టుబడిదారీ సొంత యాజమాన్యం సామాజిక యాజమాన్యంగా రూపాంతరం చెందినప్పుడు.

"అత్యంత వ్యయ మూలాలైన సైన్యాన్నీ, ప్రభుత్వోద్యోగుల వర్గాన్నీ – రద్దు చేయడం ద్వారా కమ్యూన్ సకల బూర్జువా విప్లవాల పడికట్టు మాట అయిన చౌక ప్రభుత్వాన్ని వాస్తవం చేసింది" అని మార్క్సు రాసివాడు.

పెటీ బూర్జువా వర్గంలోని ఇతర భాగాలలో లాగే రైతులలో అతి కొద్దిమంది మాత్రమే బూర్జువా అర్థంలో "పైకి పోతారు," "సుఖపడతారు," అనగా ధనవంతులో, బూర్జువాలో, సుస్థిరమైన, అధిక సౌకర్యయుతమైన స్థానాలలోని ఉద్యోగులో అవుతారు. రైతులున్న ప్రతి పెట్టుబడిదారీ దేశంలోనూ (పెట్టుబడిదారీ దేశాలలో అత్యధిక భాగం అలాంటివి), వాళ్లలో అపారమైన మెజారిటీ ప్రభుత్వంచేత పీడింపబడుతూ, ప్రభుత్వ పతనాన్ని కాంక్షిస్తారు, "చౌక" ప్రభుత్వాన్ని కాంక్షిస్తారు. కార్మికవర్గం **మాత్రమే** దీనిని సాధించగలదు; దీనిని సాధించడం ద్వారా కార్మికవర్గం అదే సమయంలో రాజ్యపు సోషలిస్టు పునర్నిర్మాణంవైపుకు ఒక అడుగు వేస్తుంది.

## 3. పార్లమెంటరీ తత్వాన్ని రద్దు చేయడం

మార్క్సు ఇలా రాసినాడు :

"కమ్యూన్ పార్లమెంటరీ సంస్థగా కాక, కార్యాచరణ సంస్థగా ఉండాలి. ఒకే సమయంలో కార్యనిర్వాహక సంస్థ గానూ, శాసన సంస్థ గానూ....

> "... పార్లమెంటులో ప్రజలకు ప్రాతినిధ్యం వహించి, తమను అణగదొక్కవలసింది (ver - und zertreten) పాలక వర్గంలోని ఏ సభ్యుడు అనేదాన్ని మూడేండ్లకో, ఆరేండ్లకో ఒకసారి నిర్ణయించుకునేందుకు ఉపయోగించిన మాదిరిగా కాకుండా – ఒక యజమాని తన వ్యాపారానికి కార్మికులను, ఫోర్‌మన్‌లను, అకౌంటెంట్లనూ ఎన్నుకొనే మాదిరిగా, కమ్యూన్లుగా ఏర్పడిన ప్రజలకు ఉపకరించాలని సార్వజనీన ఓటు హక్కు ఉద్దేశించబడింది."

పార్లమెంటరీతత్వం మీద 1871లో చేసిన ఈ గమనార్హమైన విమర్శ కూడా, సోషల్ జాతీయ దురహంకారమూ, అవకాశవాదమూ చలామణిలో వున్న కారణంగా ఇప్పుడు మార్క్సిజంలోని "మర్చిపోయిన పదాల"కూ వర్తిస్తుంది. కార్మికవర్గ ద్రోహులూ, మన కాలపు "ఆచరణవాద" సోషలిస్టులు అయిన వృత్తి క్యాబినెట్ మంత్రులూ, పార్లమెంటేరియన్లూ పార్లమెంటరీతత్వం మీద విమర్శ నంతటినీ అరాజకవాదులకు వదిలేసినారు; అద్భుతంగా సమంజసమైన ఈ ఆధారం మీద వాళ్ళు పార్లమెంటరీతత్వం మీద **విమర్శ నంతటినీ** "అరాజకవాదం"గా నిరసించారు!! షైడెమన్లూ, డేవిడ్‌లూ, లెగిన్‌లూ, సెంబాలూ, రెనౌడెల్‌లూ, హెండర్సన్‌లూ, వాండెర్ వెల్డెలూ, స్టానింగ్‌లూ, బ్రాంటింగ్‌లూ, బిస్సొలాతి ప్రభృతుల వంటి "సోషలిస్టుల"తో విసుగెత్తిపోయి, "పురోగామి" పార్లమెంటరీ దేశాలలోని కార్మికవర్గం తన సానుభూతిని అంతకంతకూ తరచుగా అరాజకవాద సిండికలిజంకు[6] అందిస్తున్నది. అరాచకవాద సిండిలిజం, అవకాశవాదాలు కేవలం కవలలే అయినప్పటికీ ఇది ఆశ్చర్యం కలిగించదు.

కానీ విప్లవ గతితర్కం అనేది ప్లెహనొవ్, కౌట్స్కీ ప్రభృతులకు మాదిరి మార్క్సుకు నిస్సారపు ఫాషనబుల్ నుడికారం కాదు, పిల్లల గిలక లాంటి ఆటవస్తువు కాదు. బూర్జువా పార్లమెంటరీతత్వం అనే "పందుల దొడ్డి"ని కూడా. ముఖ్యంగా పరిస్థితి విప్లవకరంగా లేదని స్పష్టమైనప్పుడు ఉపయోగించుకోలేని అరాజకవాదపు అసమర్థతకు గాను దానితో నిర్దాక్షిణ్యంగా తెగతెంపులు చేసుకోవడం మార్క్సుకు తెలుసు; అదే సమయంలో, పార్లమెంటరీతత్వాన్ని నిజంగా విప్లవకరమైన కార్మికవర్గ విమర్శకు గురిచేయడమూ ఆయనకు తెలుసు.

పార్లమెంటరీ రాజ్యాంగబద్ధ రాజరిక దేశాలలో మాత్రమే కాదు, అత్యంత ప్రజాస్వామిక రిపబ్లిక్కులలో కూడా– పాలక వర్గంలోని ఏ సభ్యుడు పార్లమెంటు ద్వారా ప్రజలను అణగదొక్కవలసిందీ, నులిమివేయవలసిందీ ప్రతి కొద్ది యేండ్లకొకసారి నిర్ణయించడం అనేది బూర్జువా పార్లమెంటరీతత్వం యొక్క నిజమైన సారం, .

కానీ పార్లమెంటరీతత్వాన్ని రాజ్య సంస్థలలో ఒకటిగా మనం పరిగణిస్తే, ఈ రంగంలో కార్మికవర్గ కర్తవ్యాల దృష్ట్యా మనం రాజ్య సమస్యను పరిశీలించినప్పుడు పార్లమెంటరీతత్వం నుండి బయటపడే మార్గం యేమిటి? దానిని ఎలా విసర్జించగలగడం?

కమ్యూన్‌ను, అధ్యయనం చేసి మార్క్సు చెప్పిన పాఠాలు ఎంత పూర్తిగా మర్చిపోబడినాయంటే, ఈనాటి "సోషల్ డెమోక్రట్" (అనగా, సోషలిజంకు ఈనాటి ద్రోహి) పార్లమెంటరీతత్వం మీద అరాజకవాద విమర్శనో, ప్రగతి వ్యతిరేక విమర్శనో తప్ప యే విమర్శనూ అర్థం చేసుకోజాలడని మళ్ళీ చెప్పక తప్పదు.

పార్లమెంటరీతత్వం నుండి బయటపడే మార్గం, సహజంగానే, ప్రాతినిధ్యపు సంస్థలనూ, ఎన్నిక సూత్రాన్ని రద్దు చేయడం కాదు, ప్రాతినిధ్యపు సంస్థలను రచ్చ చావళ్ళ నుండి "కార్యాచరణ" సంస్థలుగా మార్చడం. "కమ్యూన్ పార్లమెంటరీ సంస్థగా కాక, కార్యాచరణ సంస్థగా ఏక సమయంలో పరిపాలన నిర్వాహక సంస్థగానూ, శాసన సంస్థగానూ పనిచేయాలి."

"పార్లమెంటరీ సంస్థగా కాక, కార్యాచరణ సంస్థగా" – ఇది ఈనాటి పార్లమెంటేరియన్ల మీదా, సోషల్ డెమోక్రసీకి చెందిన పార్లమెంటరీ "పెంపుడు కుక్కల" మీదా సూటి దెబ్బ! అమెరికా నుండి స్విట్జర్లాండు దాకా, ఫ్రాన్సు నుండి బ్రిటన్, నార్వే, వగైరాల దాకా ఏ పార్లమెంటరీ దేశాన్నైనా తీసుకోండి – ఈ దేశాలలో "రాజ్యం" యొక్క అసలు వ్యవహారం తెర వెనుక నిర్వహించబడుతుంది. ప్రభుత్వ శాఖలూ, ఆఫీసులూ, సైనికాధికార మండలులూ నిర్వహిస్తాయి. సామాన్య జనాన్ని పిచ్చివాళ్లను చేసి మోసపుచ్చే ప్రత్యేక కార్యానికి పార్లమెంట్ అంకితం చేయబడింది. ఇది ఎంత నిజమంటే, బూర్జువా ప్రజాతంత్ర రిపబ్లిక్ అయిన రష్యన్ రిపబ్లిక్‌లో కూడా, పార్లమెంటరీతత్వం యొక్క ఈ పాపాలన్నీ ఒక్కుమ్మడిగా బయటపడ్డాయి. అదీ నిజమైన పార్లమెంటును నెలకొల్పక ముందే కూడా. కుళ్ళిపోయిన అల్పబుద్ధి వీరులు – స్కోబెలెవ్, త్సెరెతేలి, చెర్నోవ్, అవ్‌క్సేన్‌త్యెవ్ లాంటి వాళ్ళు – సోవియట్లను వట్టి బాతాఖానీ హాళ్ళుగా మార్చి, అత్యంత వెగటైన బూర్జువా పార్లమెంటరీ పద్ధతిలో వాటిని కలుషితం చేయడంలో కూడా కృతకృత్యులయ్యారు. సోవియట్లలో "సోషలిస్టు" మంత్రులు పదాడంబరంతోనూ, తీర్మానాలతోనూ అమాయక జనాన్ని మోసపుచ్చుతున్నారు. ఒకవైపున వీలైనంతమంది సోషలిస్టు రివల్యూషనరీలూ, మెన్షెవిక్కులూ "వడ్డించిన విస్తరి"ని, అనగా లాభదాయకమైన, గౌరవప్రదమైన పదవులను, వంతుల ప్రకారం పొందేటట్లు గానూ, మరొకవైపున ప్రజల "దృష్టిని కట్టివేసేటట్లు"గానూ ప్రభుత్వంలోనే యెడతెగని పదవీ మార్పులు జరుగుతున్నాయి . ఈ మధ్యలో ఆఫీసులూ, సైనికాధికార మండలులూ "రాజ్యం" యొక్క వ్యవహారాలను నిర్వహిస్తాయి!"

పాలక సోషలిస్టు రివల్యూషనరీ పార్టీ పత్రిక "దేలొ నరోద"[7] ఇటీవల ఒక ప్రధాన వ్యాసంలో, "ఉత్తమ సమాజపు" మనుషుల పాటిలేని నిర్మొహమాటత్వంతో ఒక విషయాన్ని ఒప్పుకుంది. ఏ సమాజంలో "అందరూ" రాజకీయ వ్యభిచారంలో నిమగ్నులై వుంటారో ఆ – "సోషలిస్టుల" (అమంగళం శమించుగాక!) కింద వున్న మంత్రిత్వ శాఖలలో కూడా మొత్తం ప్రభుత్వోద్యోగుల వర్గ యంత్రం వాస్తవంలో యథాతథంగా వుందనీ, పాత పద్ధతిలోనే పనిచేస్తున్నదనీ, విప్లవ చర్యలకు "స్వేచ్ఛగా" తూట్లు పొడుస్తున్నదనీ పేర్కొంది. ఈ ఒప్పుదల లేకున్నా కూడా, ప్రభుత్వంలో సోషలిస్టు రివల్యూషనరీల, మెన్షెవిక్కుల భాగస్వామ్యపు వాస్తవ చరిత్ర దీనిని రుజువు చేయదా? అయినా, ఇందులో గమనించదగినది ఏమిటంటే, కాడెట్ మంత్రుల సాహచర్యంలో చెర్నోవ్‌లూ, రుసానొవ్‌లూ, జెన్‌జీనొవ్‌లూ, "దేలొ నరోద" ఇతర సంపాదకులూ ఎంత పూర్తిగా మానాభిమానాలు కోల్పోయినారంటే, వాళ్ళు "తమ" మంత్రిత్వ శాఖలలో ప్రతిదీ యథాతథంగా వుందని, అదేదో కేవలం చిల్లర విషయమైనట్లు, లజ్జారహితంగా ఉద్ఘాటిస్తారు!! పల్లెటూరి బోళా శంకరులను మోసగించేందుకు విప్లవ ప్రజాతంత్ర నుడికారాలూ, పెట్టుబడిదార్లకు "హృదయానందం కలిగించడానికి" ఉద్యోగస్వామ్యం, తెధికార జాప్యం – అదీ "నిజాయితీ గల" మిశ్రమ మంత్రివర్గపు ***సారం.***

బూర్జువా సమాజపు అమ్ముడుపోయే, రోత పార్లమెంటరిజం స్థానంలో కమ్యూన్ ఎలాంటి సంస్థలను నెలకొల్పుతుందంటే, వాటిలో అభిప్రాయ స్వాతంత్ర్యమూ, చర్చా స్వాతంత్ర్యమూ వంచనగా దిగజారిపోవు; ఎందుకంటే, పార్లమెంటేరియన్లు తామే పని చేయవలసి వుంటుంది, తమ సొంత చట్టాలను తామే అమలు పరచవలసి వుంటుంది, యథార్థంగా సాధింపబడిన ఫలితాలను తామే పరీక్షించి చూడవలసి వుంటుంది, నేరుగా తమ ఓటర్లకు జవాబు చెప్పుకోవలసి వుంటుంది. ప్రాతినిధ్యపు సంస్థలు నిలిచి వుంటాయి; కానీ ఒక ప్రత్యేక వ్యవస్థగా, శాసన నిర్మాణ అంగానికీ, పరిపాలన నిర్వహణ అంగానికీ మధ్య శ్రమ విభజనగా, పార్లమెంటు సభ్యులకు అధిక సౌకర్యయుత స్థానంగా పార్లమెంటరిజం అనేది ***లేదు.*** ప్రాతినిధ్యపు సంస్థలు లేకుండా మనం ప్రజాస్వామ్యాన్ని, కార్మికవర్గ ప్రజాస్యామ్యాన్ని కూడా ఊహించుకోలేము; కానీ పార్లమెంటరీతత్వం లేకుండా మనం ప్రజాస్వామ్యాన్ని ఊహించుకోగలం, ఊహించుకొని ***తీరాలి*** – బూర్జువా సమాజం మీద విమర్శ మనకు వట్టి మాటలు కాకుండా వుంటే, బూర్జువా వర్గ పరిపాలనను కూలదోయాలనే కోరిక మెన్షెవిక్కులకూ, సోషలిస్టు రివల్యూషనరీలకూ, అలాగే షైడెమన్‌లకూ, లెగీన్‌లకూ, సెంబాలకూ, వాండెర్ వెల్డెలకూ అయినట్లు శ్రామికుల ఓట్లు సంపాయించడానికి

వేసే వట్టి "ఎన్నికల" కేక కాక, మన మనఃపూర్వకమైన, హృదయపూర్వకమైన కోరిక అయితే.

ఒక విషయం గమనించడం మహా విజ్ఞానదాయకం; ఏమిటంటే, కమ్యూన్‌కూ, కార్మికవర్గ ప్రజాస్వామ్యానికి అవసరమైన ఆ ఉద్యోగుల విధులను గురించి మాట్లాడడంలో మార్క్సు వాళ్లను "ప్రతి ఇతర యజమాని" యొక్క – అనగా, "కార్మికులూ, ఫోర్‌మన్‌లూ, అకౌంటెంట్లూ" గల మామూలు పెట్టుబడిదారీ వ్యాపార సంస్థ యజమాని యొక్క ఉద్యోగులతో పోలుస్తాడు.

మార్క్సు "కొత్త" సమాజాన్ని కల్పించినాడనే లేదా సృష్టించినాడనే అర్థంలో, ఆయనలో ఊహాజనిత ఛాయ ఏమీ లేదు. పాత సమాజం నుండి కొత్త సమాజపు **పుట్టుకనూ,** జరిగే పరివర్తన యొక్క రూపాలనూ సహజ చారిత్రక క్రమంగా ఆయన అధ్యయనం చేశాడు. ఆయన సామూహిక కార్మికవర్గ ఉద్యమం యొక్క వాస్తవ అనుభవాన్ని పరిశీలించి, దాని నుండి ఆచరణాత్మకమైన గుణపాఠాలను లాగడానికి ప్రయత్నించాడు. పీడిత వర్గాల మహోద్యమాల అనుభవం నుండి విప్లవ మహా యోచనాపరులందరూ తటపటాయించకుండా నేర్చుకున్నట్లుగానే, ఆయన కమ్యూన్ నుండి "నేర్చుకున్నాడు" గానీ, వాళ్లకు ఎప్పుడూ వ్యర్థ పాండిత్య "ధర్మపన్నాలు" వల్లించలేదు. ("వాళ్లు ఆయుధ ధారణకు దిగి వుండకూడదు" అని ప్లెహానొవూ, "ఏ వర్గమైనా పరిమితమై వుండాలి" అని త్సెరెతేలీ చెప్పినట్లు).

ప్రభుత్వోద్యోగుల వర్గాన్ని తక్షణమే, సర్వత్రా, సంపూర్ణంగా రద్దు చేయడం అనే సమస్యే లేదు. అది ఊహాజనితం పాత ప్రభుత్వోద్యోగుల వర్గ యంత్రాన్ని తక్షణమే ***బ్రద్దలు చేసి,*** బ్యూరోక్రసీని క్రమక్రమంగా రద్దు పరచడాన్ని సాధ్యపరచే కొత్త యంత్రాన్ని వెంటనే నిర్మించనారంభించడం – ఇది ఊహాజనితం **కాదు,** ఇది కమ్యూన్ అనుభవం, విప్లవ కార్మికవర్గపు సూటి, తక్షణ కర్తవ్యం.

పెట్టుబడిదారీ వ్యవస్థ "రాజ్య" నిర్వహణ విధులను సరళతరం చేస్తుంది; "పెత్తందారీతనానికి" స్వస్తి చెప్పడానికీ, మొత్తం వ్యవహారాన్ని సమాజం తరపున "కార్మికులనూ, ఫోర్‌మన్‌లనూ, అకౌంటెంట్లనూ" జీతానికి పెట్టుకొనే (పాలకవర్గమైన) శ్రామికవర్గ సంస్థకు పరిమితం చేయడానికీ అది వీలు కలిగిస్తుంది.

మనం ఊహాజనిత వాదులం కాదు. పరిపాలన నిర్వహణ అంతటినీ, పై అధికార్లకు అణిగి వుండటం అంతటినీ **తక్షణమే** విసర్జించాలని మనం "కలలు

గనం". శ్రామికవర్గ నియంతృత్వ కర్తవ్యాల అనవగాహన మీద ఆధారపడిన ఈ అరాజకవాదపు కలలు మార్క్సిజంకు పూర్తిగా పరాయివి; వాస్తవంలో, ప్రజలు భిన్నంగా వుండే కాలం వరకూ సోషలిస్టు విప్లవాన్ని వాయిదా వెయ్యడానికి మాత్రమే ఇవి పనికి వస్తాయి. ఇప్పుడున్నట్లు వున్న ప్రజలతోనే, పై అధికార్లకు అణిగి వుండడాన్నీ, అజమాయిషీనీ, "ఫోర్‌మన్‌లనూ, అకౌంటెంట్లనూ" విసర్జించలేని ప్రజలతోనే సోషలిస్టు విప్లవాన్ని మనం కోరుతాం.

కానీ లోబడి వుండడం అనేది దోపిడీకి గురయ్యే శ్రామిక ప్రజలందరి సాయుధ అగ్రగామి దళానికి, అనగా, కార్మికవర్గానికి అణిగి వుండడంగా వుండాలి. ప్రభుత్వ అధికార్ల నిర్దిష్ట "పెత్తనాన్ని" తొలగించి, దాని స్థానంలో "ఫోర్‌మన్‌ల, అకౌంటెంట్ల" తేలికయిన పనులను – ఇప్పటికే సగటు పట్టణవాసి సామర్థ్యానికి పూర్తిగా లోబడినట్టివీ, "కార్మికుల వేతనాల"కు నిర్వహించబడగలిగినట్టివీ అయిన పనులను – తక్షణమే, తెల్లవారే లోపల ప్రారంభించవచ్చు, ప్రారంభించి తీరాలి.

***మనం,*** కార్మికులం, పెట్టుబడిదారీ వ్యవస్థ ఇప్పటికే సృష్టించిన ప్రాతిపదిక మీద, కార్మికులంగా మన సొంత అనుభవం మీద ఆధారపడి, సాయుధ కార్మికుల రాజ్యాధికారపు ఆసరాతో కఠినమైన ఉక్కు క్రమశిక్షణను నెలకొల్పి, భారీ ఉత్పత్తిని ఏర్పాటుచేసి తీరుతాం. మనం ప్రభుత్వోద్యోగుల పాత్రను బాధ్యులైన, తొలగించబడగలిగిన, మితమైన జీతాలు గల "ఫోర్‌మన్‌లు, అకౌంటెంట్లు"గా (సహజంగానే, అన్ని రకాల, జాతుల, స్థాయిల సాంకేతిక నిపుణుల సాయంతో) కేవలం మన ఆదేశాలను నిర్వహించే పాత్రకు కుదించి తీరుతాం. ఇది ***మన*** శ్రామికవర్గ కర్తవ్యం; శ్రామికవర్గ విప్లవాన్ని సాధించిన మనం దీనితో ***ప్రారంభించగలం,*** ప్రారంభించి తీరాలి. అలాంటి ప్రారంభం భారీ ఉత్పత్తి ప్రాతిపదిక మీద, తనంతకు తానే, సమస్త బ్యూరోక్రసీ క్రమక్రమంగా "దుల్లిపోవడా"నికి దారితీస్తుంది, ఒక సువ్యవస్థ క్రమ క్రమంగా సృష్టి కావడానికి దారితీస్తుంది – కొటేషన్ మార్కులు లేని సువ్యవస్థ, వేతన బానిసత్వంతో ఎలాంటి పోలికా లేని సువ్యవస్థ – అజమాయిషీ, లెక్కలూ అనే పనులు అంతకంతకూ సరళమై, వంతు ప్రకారం ప్రతి ఒక్కరి చేతా నిర్వహింపబడి తరువాత అలవాటు అయి చివరకు, ప్రజానీకంలో ఒక ప్రత్యేక భాగం యొక్క ***ప్రత్యేక విధులుగా*** అంతరించిపోతాయో ఆ సువ్యవస్థ.

ఒక చమత్కారపు జర్మన్ సోషల్ డెమోక్రట్ గత శతాబ్దపు డెబ్బైల నాటి ***తపాలా శాఖను*** సోషలిస్టు ఆర్థిక వ్యవస్థకు ఒక ఉదాహరణ అన్నాడు. ఇది ఎంతైనా నిజం. ప్రస్తుతం తపాలా శాఖ ప్రభుత్వ ***పెట్టుబడిదారీ*** గుత్త పద్ధతులలో ఏర్పాటు

చేయబడిన వ్యాపారం, సామ్రాజ్యవాదం క్రమక్రమంగా అన్ని ట్రస్టులనూ అలాంటి రకానికే చెందిన సంస్థలుగా మారుస్తున్నది. అర్థాకలితో, అమిత కష్టం చేసే "సాధారణ" జనం కంటే ఎత్తున నిలబడి వుండే బూర్జునా బ్యూరోక్రసీ వీటిలో కనపడుతుంది. కానీ, ఇక్కడ సామాజిక నిర్వహణ యంత్రాంగం ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. మనం పెట్టుబడిదార్లను కూలదోసి, సాయుధ కార్మికుల నిర్దాక్షిణ్యపు చేతితో ఈ దోపిడీదార్ల ప్రతిఘటనను నలిపివేసి, ఆధునిక రాజ్యం యొక్క బ్యూరోక్రటిక్ యంత్రాన్ని తుత్తునియలు చేసినామంటే, "పరాన్న జీవి" నుండి విముక్తమైన, అద్భుతమైన సాంకేతిక సాధన సంపద గల యంత్రాంగం మనకు వుంటుంది – సాంకేతిక నిపుణులనూ, ఫోర్‌మన్‌లనూ, అకౌంటెంట్లనూ జీతానికి పెట్టుకొని, ***వాళ్లకందరికీ,*** నిజానికి స్థూలంగా "రాజ్య" ఉద్యోగులు ***అందరికీ*** ఇచ్చినట్లే, కార్మికుల జీతాలు ఇచ్చే సమైక్య కార్మికులు తామే భేషుగ్గా నడిపించగల యంత్రాంగం. ఇక్కడ, అన్ని ట్రస్టుల విషయంలోనూ వెంటనే నిర్వర్తించగల నిర్దిష్టమైన, ఆచరణాత్మకమైన కర్తవ్యం వుంది, దేన్ని నిర్వర్తిస్తే శ్రామిక ప్రజలకు దోపిడీ తొలగిపోతుందో ఆ కర్తవ్యం, కమ్యూన్ అప్పటికే (ముఖ్యంగా రాజ్యాన్ని నిర్మించడంలో ఆచరించడం ప్రారంభించినదాన్ని లెక్కలోకి తీసుకునే కర్తవ్యం.

సాంకేతిక నిపుణులూ, ఫోర్‌మన్‌లూ, అకౌంటెంట్లూ, అలాగే ***ఉద్యోగులందరూ*** "కార్మికుల వేతనం" కంటె ఏమీ ఎక్కువ కాని జీతాలు పొందేటట్లుగా, అందరూ సాయుధ కార్మికవర్గపు అజమాయిషీ కిందా, నాయకత్వం కిందా వుండేటట్టుగా, <u>**మొత్తం**</u> ఆర్థిక వ్యవస్థను తపాలా శాఖ పద్ధతులలో ఏర్పాటుచేయడం – ఇదీ మన తక్షణ లక్ష్యం. ఇదీ రాజ్యం. ఇదీ మనకు అవసరమైన ఆర్థిక పునాది. ఇదీ పార్లమెంటరీతత్వాన్ని రద్దు చేసి, ప్రాతినిధ్యపు సంస్థలను నిలిపేది, ఇదీ బూర్జువా వర్గం సాగించే ఈ సంస్థల దుర్వినియోగం శ్రామికవర్గాలకు లేకుండా చేసేది.

## 4. జాతీయ ఐక్యతా నిర్మాణం

"తాను అభివృద్ధి చేయడానికి వ్యవధి లేనట్టి జాతీయ నిర్మాణానికి సంబంధించిన సంక్షిప్త రేఖాచిత్రంలో అత్యంత చిన్న గ్రామమైనాసరే, కమ్యూన్ దాని రాజకీయ రూపంగా వుంటుందని కమ్యూన్ స్పష్టంగా చెపుతుంది, " కమ్యూన్‌లు పారిస్‌లోని "జాతీయ ప్రతినిధి వర్గాన్ని" ఎన్నుకోవలసి వుంది. ...

> "... కేంద్ర ప్రభుత్వానికి ఇంకా మిగిలే కొద్దిపాటి, అయినా ముఖ్యమైన కర్తవ్యాలు, ఉద్దేశపూర్వకంగా తప్పుగా చెప్పబడినట్లు, రద్దు

చేయబడాలని కాక, కమ్యూన్ ఉద్యోగులకు, అనగా కచ్చితంగా బాధ్యులైన ఉద్యోగులకు, బదలాయించబడవలసి వున్నాయి....

"...జాతీయ ఐక్యత భగ్నం చేయబడాలని కాక, తద్వ్యతిరేకంగా, కమ్యూన్ సూత్రానికి అనుగుణంగా నిర్మించబడవలసి వుంది. యే రాజ్యాధికారం జాతీయ ఐక్యతా మూర్తిగా నటిస్తూ, జాతి శరీరంమీద పరాన్నజీవనం చేసే చెడు మాంసంగా వుంటూ, జాతి నుండి స్వతంత్రంగా , జాతికి అతీతంగా వుండగోరిందో, ఆ రాజ్యాధికారాన్ని ధ్వంసం చేయడం ద్వారా జాతీయ ఐక్యత వాస్తవం కావలసి వుంది.... పాత ప్రభుత్వ అధికారపు కేవల అణచివేత అంగాలు తొలగించబడవలసి వుంది; సమాజానికి అతీతంగా వుండే హక్కు తనకు వుందనే అధికార సంస్థ నుండి లాక్కోబడి, దాని న్యాయమైన విధులు బాధ్యులైన సమాజ సేవకులకు తిరిగి అప్పగించబడవలసి వుంది."

ఈ మార్క్స్ వాదనలను ఈనాటి సోషల్ డెమోక్రటిక్ అవకాశవాదులు యెంతగా అర్థం చేసుకోలేకపోయిందీ – అర్థం చేసుకోడానికి నిరాకరించిందీ అంటే సత్యానికి మరింత దగ్గరగా వుండవచ్చు – స్వపక్ష ద్రోహి బెర్న్‌స్టైన్ రచించిన, **హెరొస్ట్రాటస్**[8] లాంటి అపకీర్తి వహించిన ***సోషలిజం తార్కిక ఆధారాలూ, సోషల్ డెమోక్రట్ల కర్తవ్యాలూ*** అనే పుస్తకం అత్యంత స్పష్టంగా తెలియజేస్తుంది. మార్క్స్ నుండి ఉల్లేఖించిన పై భాగాలను పురస్కరించుకొనే బెర్న్‌స్టైన్ ఇలా రాశాడు : ఈ కార్యక్రమం "దాని రాజకీయ సారానికి సంబంధించినంతవరకు, దాని ముఖ్య లక్షణాలన్నింటిలోనూ, ప్రౌధన్ ఫెడరలిజంతో చాలా ఎక్కువ పోలిక కలిగివుంది.... మార్క్స్‌కూ 'పెటీ బూర్జువా' ప్రౌధన్‌కూ మధ్య" (వ్యంగ్యం స్ఫురించడానికి బెర్న్‌స్టైన్ "పెటీబూర్జువా" అనే పదాన్ని కొటేషన్ మార్కులలో పెట్టినాడు). "ఎన్ని భిన్నాంశాలు వున్నప్పటికీ, ఈ అంశాల మీద వాళ్ల తర్క మార్గాలు ఎంత సన్నిహితంగా వుండగలవో అంత సన్నిహితంగా వున్నాయి." బెర్న్‌స్టైన్ ఇంకా ఇలా కొనసాగిస్తాడు : నిజమే, మునిసిపాలిటీల ప్రాముఖ్యం పెరుగుతున్నది, కానీ, "ప్రజాస్వామ్యపు ప్రథమ కర్తవ్యం, మార్క్స్, ప్రౌధన్‌లు ఊహించినట్లు, మునుపు వుండిన జాతీయ ప్రాతినిధ్యపు పద్ధతి అదృశ్యమయ్యే పర్యవసానం కలిగేటట్లుగా, ఆధునిక రాజ్యాల విచ్ఛిత్తి (Auflosung - అక్షరాలా – రద్దు), వాటి నిర్మాణం పూర్తిగా రూపాంతరం చెందడమూ (Umwandlung) – కమ్యూన్‌ల ప్రతినిధులతో రాష్ట్ర, జిల్లా అసెంబ్లీలూ, వాటి

ప్రతినిధులతో జాతీయ అసెంబ్లీ ఏర్పడడం - అనేది నాకు సందేహాస్పదంగా కనపడుతున్నది" (బెర్న్‌స్టైన్, ***"తార్కిక ఆధారాలు,"*** జర్మన్ కూర్పు, 1899. పేజీలు 134, 136).

"పరాన్నజీవనం చేసే చెడు మాంసం అయిన రాజ్యాధికారాన్ని ధ్వంసం చేయడం" మీద మార్క్సు అభిప్రాయాలనూ, ప్రౌధన్ ఫెడరలిజంనూ ఒకటిగా పొరబడడం నిశ్చయంగా రాక్షసం! అయినా, అది యాదృచ్ఛికం కాదు; ఎందుకంటే, మార్క్సు ఇక్కడ కేంద్రీకృత వ్యవస్థ (centralism)కు వ్యతిరేకమైన ఫెడరలిజం గురించి మాట్లాడలేదు, సకల బూర్జువా దేశాలలోనూ వున్న పాత, బూర్జువా రాజ్య యంత్రాన్ని బ్రద్దలు చెయ్యడం గురించి మాట్లాడుతున్నాడు అని అవకాశవాదికి ఎప్పుడూ తోచదు.

అవకాశవాదికి తోచే ఒకే ఒక విషయం ఏమిటంటే, పెటీ బూర్జువా అల్పబుద్ధితత్వపు, "సంస్కరణవాద" నిర్జీవత్వపు పరిసరాలలో తన చుట్టూ అతనికి కనిపించేదే; అదేమిటంటే, "మునిసిపాలిటీలు"! అవకాశవాదికి శ్రామికవర్గ విప్లవం గురించి ఆలోచించే అలవాటు కూడా తప్పిపోయింది.

ఇది పరిహాసాస్పదం. కానీ అసాధారణ విషయం ఏమిటంటే, ఆ అంశం మీద బెర్న్‌స్టైన్‌తో ఎవ్వరూ వాదించలేదు. బెర్న్‌స్టైన్‌ను చాలామంది పూర్వపక్షం చేశారు, ముఖ్యంగా రష్యన్ సాహిత్యంలో ప్లెహానొవ్, యూరోపియన్ సాహిత్యంలో కౌట్స్కీ, కానీ ఆ ఇద్దరిలో ఎవ్వరూ బెర్న్‌స్టైన్ మార్క్సుకు కల్పించిన ఈ వక్రీకరణ మీద **ఏమీ** చెప్పలేదు.

విప్లవాత్మకంగా ఆలోచించడమూ, విప్లవం గురించి మాట్లాడడమూ అవకాశవాది ఎంతగా మరచిపోయినాడంటే, అతను "ఫెడరలిజం"ను మార్క్సుకు ఆపాదించి, మార్క్సునూ, అరాజకవాద స్థాపకుడైన ప్రౌధన్‌నూ ఒకటిగా పొరబడతాడు. నిష్టకలిగిన మార్క్సిస్టులమనీ, విప్లవ మార్క్సిస్టు సిద్ధాంత పరిరక్షకులమనీ చెప్పుకునే కౌట్స్కీ, ప్లెహానొవ్‌ల విషయం ఏమిటంటే, వాళ్ళు ఈ అంశం మీద మౌనం వహిస్తారు. మార్క్సిజంకూ, అరాజక వాదానికి మధ్య వున్న భేదం మీద గల అభిప్రాయాలను తీవ్రంగా అపభ్రంశం చేసే ధోరణికి ఒక మూలం ఇక్కడ వుంది. అది కౌట్స్కీయైట్లకూ, అవకాశవాదులకూ, ఉభయులకూ విలక్షణమైనట్టిది; దీన్ని తర్వాత మళ్లీ చర్చిద్దాం.

కమ్యూన్ అనుభవం మీద పైన ఉల్లేఖించిన మార్క్సు పరిశీలనలలో ఫెడరలిజం ఛాయ కూడా లేదు. ఏ అంశాన్ని అవకాశవాది బెర్న్‌స్టైన్ చూడడో,

సరిగ్గా ఆ అంశం మీద ప్రౌధన్‌తో మార్క్సు ఏకీభవిస్తాడు. ఏ అంశం మీద బెర్న్‌స్టైన్‌కు వాళ్ళిద్దరి మధ్యా సామ్యం కనపడిందో, సరిగ్గా ఆ అంశం మీద ప్రౌధన్‌తో మార్క్సు విభేదిస్తాడు.

ప్రౌధన్‌తో మార్క్సు ఎక్కడ ఏకీభవిస్తాడంటే, ఆధునిక రాజ్య యంత్రాన్ని "బద్దలు చేయడానికి" ఇద్దరూ అనుకూలం. అవకాశవాదులు గానీ... కౌట్స్కీయైట్లు గానీ ఈ అంశం మీద మార్క్సిజంకూ, అరాజకవాదానికి (ప్రౌధన్, బకూనిన్ – ఈ ఉభయుల అరాజకవాదానికీ) మధ్య గల అభిప్రాయ సామ్యాన్ని చూడాలనుకోరు; ఎందుకంటే వాళ్లు మార్క్సిజం నుండి విడిపోయింది ఇక్కడే.

ప్రౌధన్, బకూనిన్‌లతో మార్క్సు విభేదించేది సరిగ్గా ఫెడరలిజం సమస్య మీదనే (కార్మికవర్గ నియంతృత్వం సంగతి చెప్పనక్కర లేదు). ఒక సూత్రంగా ఫెడరలిజం, అరాజకవాదుల పెటీ బూర్జువా అభిప్రాయాల నుండి తార్కికంగా ఏర్పడుతుంది. మార్క్సు కేంద్రీకరణవాది. పైన ఉల్లేఖించిన ఆయన పరిశీలనలలో కేంద్రీకరణవాదం నుండి వైదొలగడం ఏమీ లేదు. రాజ్యంలో అల్పబుద్ధి తత్వపు "మూఢ నమ్మకం" తమలో జీర్ణమైన వాళ్ళు మాత్రమే బూర్జువా రాజ్య యంత్ర విధ్వంసాన్ని కేంద్రీకృత వ్యవస్థ విధ్వంసంగా పొరబడగలరు!

శ్రామికవర్గమూ, బీద రైతులు రాజ్యాధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకొని, కమ్యూన్‌లుగా తమను తామే స్వేచ్ఛగా సంఘటితం చేసుకొని, పెట్టుబడిమీద దెబ్బతీయడంలోనూ, పెట్టుబడిదార్ల ప్రతిఘటనను నులిమి వేయడంలోనూ, సొంత ఆస్తిగా వున్న రైల్వేలు, ఫ్యాక్టరీలు, భూమి మొదలైనవాటిని **యావత్తు** జాతికి, మొత్తం సమాజానికి బదలాయించడంలోనూ సకల కమ్యూన్ల చర్యలనూ **సమైక్యం చేస్తే,** అది కేంద్రీకృత వ్యవస్థ కాదా? అది అత్యంత స్థిరమైన ప్రజాతంత్ర కేంద్రీకృత వ్యవస్థ కాదా? అంతేకాక, శ్రామికవర్గ కేంద్రీకృత వ్యవస్థ కాదా?

బూర్జువా పరిపాలననూ, బూర్జువా రాజ్య యంత్రాన్ని ధ్వంసం చేయడంలో స్వచ్ఛంద కేంద్రీకృత వ్యవస్థ, ఒక జాతిగా కమ్యూన్ల స్వచ్ఛంద సమ్మేళనం, కార్మికవర్గ కమ్యూన్ల స్వచ్ఛంద సంలీనం సాధ్యమనే భావం అసలు బెర్న్‌స్టైన్ బుద్ధికి అందదు. కేంద్రీకృత వ్యవస్థను కేవలం బ్యూరోక్రసీ చేతా, మిలిటరీ ముఠా చేతా కేవలం పై నుండి రుద్దబడి, సాగించబడగలిగేదిగా బెర్న్‌స్టైన్ ఊహించుకుంటాడు, అల్పబుద్ధులందరిలాగే.

"జాతీయ ఐక్యతను ధ్వంసం చేయాలని, కేంద్ర అధికారాన్ని రద్దు చేయాలనీ కమ్యూన్ కోరిందనే అభియోగం ఉద్దేశపూర్వకమైన దగా అని మార్క్సు, తన అభిప్రాయాలు వక్రీకరింబడవచ్చునని ఆయన భవిష్యద్దర్శనం చేశాడా అన్నట్లు, ప్రత్యేకంగా నొక్కి చెప్పాడు. చైతన్యయుతమైన, ప్రజాస్వామికమైన, శ్రామికవర్గ కేంద్రీకృత వ్యవస్థను బూర్జువా, మిలిటరీ, బ్యూరోక్రటిక్ కేంద్రీకృత వ్యవస్థకు వ్యతిరేకంగా పెట్టడానికి "జాతీయ ఐక్యత నిర్మించబడవలసి వుండింది" అనే మాటలు మార్క్సు ఉద్దేశపూర్వకంగా ఉపయోగించాడు.

కానీ, వినదలచుకోనివాళ్లకున్నంత చెవుడు యెవరికీ వుండదు గదా. మరి రాజ్యాధికార విధ్వంసమూ, పరాన్నజీవి అయిన చెడు మాంసాన్ని కోసివేయడమూ – సరిగ్గా దీన్ని గురించే ఈనాటి సోషల్ డెమోక్రటిక్ పార్టీకి చెందిన అవకాశవాదులు వినదలచుకోనిది.

## 5. పరాన్న జీవి అయిన రాజ్యాన్ని రద్దు చేయడం

ఈ విషయం మీద మార్క్సు మాటలను నేను ఇదివరకే ఉల్లేఖించాను, ఇప్పుడు మనం వాటికి కొంత చేర్చాల్సిఉంది.

ఆయన ఇలా రాశాడు :

> "....కొత్త చారిత్రక సృజనకు సాధారణంగా పట్టే గతి ఏమిటంటే, దానితో కొంత పోలిక కలిగినట్టి, సమాజ జీవితపు పాత రూపాలకు, మృత రూపాలకు కూడా చెందినట్టి ప్రతి రూప సంస్థలనూ దానినీ ఒకటిగా పొరబడతారు. ఆ విధంగా, ఆధునిక రాజ్యాధికారాన్ని ధ్వంసం చేసే (bricht – తుత్తునియలు చేసే) ఈ కొత్త కమ్యూన్ మధ్య యుగాల కమ్యూన్‌ల పునరుద్ధరణగా... (మాంటెన్‌క్యూ, జిరోండిస్టులూ[9] ఊహించినట్లు) చిన్న రాజ్యాల ఫెడరేషన్‌గా... అమిత కేంద్రీకరణ మీద జరిగిన పాత పోరాటపు అతిశయ రూపంగా పరిగణించబడింది.....
>
> "...సమాజం మీద పడి బతుకుతూ, సమాజం యొక్క స్వేచ్ఛా చలనానికి ఆటంకం కలిగించే 'రాజ్యం' అనే ఆ పరాన్న జీవి అయిన

> చెడు మాంసం ఇంతకు మునుపు తనలో లీనం చేసుకొన్న శక్తులనన్నిటినీ కమ్యూన్ రాజ్య నిర్మాణం సమాజ సంస్థకు తిరిగి అప్పగించి వుండేది. ఈ ఒక్క విషయమే ఫ్రాన్సు పునరుజ్జీవనాన్ని ప్రారంభించి వుండేది....
>
> "...కమ్యూనల్ రాజ్య నిర్మాణం గ్రామీణ ఉత్పత్తిదార్లను వాళ్ల జిల్లా కేంద్ర పట్టణాల బౌద్ధిక నాయకత్వం కిందికి తెచ్చి, వాళ్ల ప్రయోజనాల సహజ ధర్మకర్తలైన పట్టణ శ్రమజీవులను వాళ్లతో బంధించి వుండేది. కమ్యూన్ ఉనికిలోనే స్థానిక స్వపరిపాలన సహజ విషయంగా ఇమిడివుంది, కానీ రాజ్యాధికారానికి, ఇప్పుడు అనవసరమైనదానికి, సరితూగగలిగినదిగా కాదు."

"పరాన్న జీవి అయిన చెడు మాంసం" వంటి "రాజ్యాధికారాన్ని ధ్వంసం చేయడం"; దాన్ని "కోసివేయడమూ," "బ్రద్దలు చేయడమూ"; "రాజ్యాధికారం ఇప్పుడు అననవసరంగా మారింది'' – కమ్యూన్ అనుభవాన్ని అంచనా కట్టుతూ, పరిశీలించేటప్పుడు రాజ్యం విషయంలో మార్క్సు ఉపయోగించిన వ్యక్తీకరణలు ఇవి.

ఇదంతా రాసి అర్ధ శతాబ్దికి కాస్త తక్కువ అయింది; ఇప్పుడు వక్రీకరించబడని మార్క్సిజాన్ని ప్రజా బాహుళ్యానికి తెలియజేయడానికి త్రవ్వకాలు చేసినంత పని చేయవలసి వుంది. మార్క్సు జీవించిన కాలంనాటి గత మహా విప్లవ పరిశీలన నుండి తీసిన నిర్ధారణలు సరిగ్గా మళ్లీ శ్రామికవర్గ మహా విప్లవాల సమయం ఆసన్నమైనపుడు విస్మరించబడినాయి.

> "...కమ్యూన్‌కు ఇవ్వబడిన పలు వ్యాఖ్యానాలను బట్టి, దానిలో వ్యక్తమైన పలువురి బహుళ ప్రయోజనాలను బట్టి అది పూర్తిగా పట్టు విడుపులు గల రాజకీయ రూపమని తెలుస్తుంది; కాగా గత ప్రభుత్వ రూపాలన్నీ తప్పనిసరిగా అణచివేత స్వభావం కలిగినవి. దాని అసలు రహస్యం ఇది : అది ***కార్మికవర్గ ప్రభుత్వం,*** ఉత్పత్తి వర్గాలు, ఉత్పత్తిని స్వంతం చేసుకునే వర్గంపై చేసిన పోరాటపు ఫలితం, శ్రమ యొక్క ఆర్థిక విమోచన ఎందులో సాధింపబడగలదో చిట్ట చివరకు ఆవిష్కరించబడిన రాజకీయ రూపం అది...
>
> "ఈ చివరి షరతు లేకుండా కమ్యూనల్ రాజ్య నిర్మాణం అసంభవ విషయమూ, భ్రమా అయి వుండేది..."

ఏ రాజకీయ రూపాలలో సమాజపు సోషలిస్టు రూపాంతరం జరగవలసి వుందో ఆ రాజకీయ రూపాలను "ఆవిష్కరించే" పనిలో ఊహాస్వర్గవాదులు కాలం గడిపారు. అరాజకవాదులు రాజకీయ రూపాల సమస్యను పూర్తిగా కొట్టిపారేశారు. ఈనాటి సోషల్ డెమోక్రసీకి చెందిన అవకాశవాదులు పార్లమెంటరీ ప్రజాతంత్ర రాజ్యపు బూర్జువా రాజకీయ రూపాలను అధిగమించకూడని హద్దుగా పరిగణించినారు. వాళ్లు ఈ "నమూనా" ముందర సాష్టాంగపడి నొసళ్లు పగలగొట్టుకొని, ఈ రూపాలను ***బ్రద్దలు చేయాలనే*** ప్రతి కోరికనూ, అరాజకవాదంగా ఖండించినారు.

రాజ్యం అదృశ్యం కాక తప్పదనీ, దాని అదృశ్యపు పరివర్తన రూపం (రాజ్యం నుండి రాజ్య రహితానికి పరివర్తన చెందే రూపం) "పాలక వర్గంగా సంఘటితపడిన శ్రామికవర్గం"గా వుంటుందని సోషలిజము, రాజకీయ పోరాటాల సమస్త చరిత్ర నుండి మార్క్సు నిర్ధారించాడు. కానీ, ఆయన ఈ భావి దశ యొక్క రాజకీయ ***రూపాలను ఆవిష్కరించడానికి*** పూనుకోలేదు. ఆయన ఫ్రెంచి చరిత్రను జాగ్రత్తగా గమనించడానికీ, పరిశీలించడానికి, 1851వ సంవత్సరం ఏ నిర్ధారణకు దారితీసిందో ఆ నిర్ధారణకు, బూర్జువా రాజ్య యంత్ర ***విధ్వంసం*** వైపు పరిస్థితులు పురోగమిస్తున్నాయనే నిర్ధారణకు పరిమితమైనాడు.

మరి శ్రామికవర్గ ప్రజా విప్లవోద్యమం ప్రజ్వరిల్లినప్పుడు, అది విఫలమైనప్పటికీ, దాని జీవిత కాలం స్వల్పమే అయినప్పటికీ, స్పష్టమైన బలహీనతలూ వుండినప్పటికీ, అది ***ఆవిష్కరించిన*** రూపాలను మార్క్సు అధ్యయనం చేయనారంభించాడు.

కమ్యూన్ అనేది శ్రమ ఆర్థిక విమోచన దేనిలో జరగగలదో ఆ రూపం, శ్రామికవర్గ విప్లవం చేత "చిట్టచివరకు ఆవిష్కరింపబడిన" రూపం.

కమ్యూన్ అనేది బూర్జువా రాజ్య యంత్రాన్ని ***తుత్తునియలు చేయడానికి*** కార్మికవర్గ విప్లవం చేసిన మొదటి ప్రయత్నం; అది తుత్తునియలైన రాజ్య యంత్రం స్థానం ***ఆక్రమించగలదీ ,*** తప్పక ***ఆక్రమించవలసిందీ*** అయిన "చిట్టచివరకు ఆవిష్కరింపబడిన" రాజకీయ రూపం.

భిన్న సందర్భాలలో, భిన్న పరిస్థితులలో జరిగిన 1905, 1917 రష్యన్ విప్లవాలు కమ్యూన్ పనిని ముందుకు కొనసాగిస్తూ మార్క్సు యొక్క ఉజ్వలమైన చారిత్రక పరిశీలనను ధృవీకరిస్తాయని ముందు చూస్తాము.

# వివరణలు

1. "ఫ్రాంకో– ప్రష్యన్ యుద్ధం గురించి అంతర్జాతీయ కార్మికుల సంస్థ జనరల్ కౌన్సిల్ యొక్క రెండవ విజ్ఞప్తి"కి ప్రస్తావన. యూరప్, సంయుక్త రాష్ట్రాలలోని అంతర్జాతీయ కార్మికుల సంఘు సభ్యులకు మార్క్స్ లండన్‌లో, 1870 సెప్టెంబరు 6, 9 మధ్యలో రాశాడు.

2. చూ : ఎల్. కూగెల్‌మన్‌కు 1871, ఏప్రిల్ 12న కార్ల్ మార్క్స్ రాసిన ఉత్తరం (K. Marx, F. Engels, Selected Works, in three volumes, v. 2. p. 421).

3. పోర్చుగల్‌లో జరిగిన 1910 విప్లవానికి ఇది ప్రస్తావన. 1910, అక్టోబర్ 5న అక్కడ రాజరికం కూలదోయబడి, రిపబ్లిక్ ప్రకటింపబడింది; టర్కీలో 1908 వాటి విప్లవం రాజ్యాంగాన్ని పునర్నిర్మించి పార్లమెంటును స్థాపించింది.

4. ఫ్రాన్సులో **రెండవ సామ్రాజ్యం –** మూడవ నెపోలియన్ పాలన కాలం (1852, డిసెంబరు 2వ తేదీ నుంచి 1870, సెప్టెంబరు 4వ తేదీ వరకు).

5. చూ : కె. మార్క్స్, ***"ఫ్రాన్సులో అంతర్యుద్ధం"*** (K. Marx, ***The Civil War in France.*** - K. Marx, F. Engels, Selected Works, in three volumes, v. 2, p. 486). 57–58, 63–64 పేజీల్లో లెనిన్ ఇదే గ్రంథం నుండి ఉల్లేఖిస్తున్నాడు (ఇంగ్లీషులో పేజీలు 339 – 343, 345 – 346).

6. ***అరాజకవాద సిండికలిజం –*** కార్మికవర్గ ఉద్యమంలో ఒక అవకాశవాద ధోరణి. అది అరాజకవాదం చేత ప్రభావితమైంది. అది రాజకీయ

పోరాటాన్నీ, రాజకీయ కార్మిక పార్టీల నాయకత్వ పాత్రనీ తిరస్కరిస్తుంది. ట్రేడ్ యూనియన్లనే (ఫ్రెంచి భాషలో పిండికాటు అనే మాట నుంచి ఈ ధోరణికి ఆ పేరు వచ్చింది) ఉత్పత్తి సాధనాల మీద స్వామ్యం కలిగి వుండవలసిన కార్మికవర్గపు అత్యున్నత సంఘటన రూపంగానూ, సార్వత్రిక ఆర్థిక సమ్మెచే అత్యున్నత పోరాట రూపంగానూ అది పరిగణిస్తుంది.

7. ***"దేలొ నరోద"*** ("ప్రజా కార్యం") - 1917 మార్చి నుండి 1918 జూలై దాకా పెట్రోగ్రాడ్‌లో సోషలిస్టు రివల్యూషనరీ పార్టీ చేత ప్రచురింపబడిన దినపత్రిక. కొన్నిసార్లు దాని పేరు మారింది. ఇది రక్షణవాద, రాజీ వైఖరి వహించి, బూర్జువా తాత్కాలిక ప్రభుత్వాన్ని బలపరచింది.

8. ***హెరొస్ట్రాటస్*** - ఒక గ్రీకు, క్రీ.పూ. 356లో తన పేరును ప్రసిద్ధం చేసుకోవాలన్న కోర్కెతో ఏథెన్సులోని అర్టెమిస్ దేవాలయాన్ని తగలబెట్టాడు. - 64.

9. ***జిరోండిస్టులు*** - 18వ శతాబ్దపు అంతంలో ఫ్రెంచి బూర్జువా విప్లవంలోని రాజకీయ పక్షం. జిరోండిస్టులు ఉదారవాద బూర్జువావర్గ ప్రయోజనాలను వ్యక్తంచేశారు. విప్లవానికీ, ప్రతీఘాత విప్లవానికీ మధ్య ఊగిసలాడి, రాజరికంతో రాజీ చేసుకొన్నారు.


O crime de rico a lei o cobre. O Estado esmaga o oprimido
Não há direitos para o pobre. Ao rico tudo é permitido
À opressão não mais sujeitos! Somos iguais todos os seres
Não mais deveres sem direitos. Não mais direitos sem deveres!
Su, lottiamo! l'ideale nostro alfine sarà l'Internazionale futura umanità!
Su, lottiamo! l'ideale nostro alfine sarà
l'Internazionale futura umanità!

# పారిస్ కమ్యూన్ ఆర్టిస్టుల ఫెడరేషన్ ప్రణాళిక

పారిస్ కమ్యూన్ ఆర్టిస్టుల ఫెడరేషన్ ఈ ప్రణాళికను రచించింది. ఈ ఫెడరేషన్ అతివాద ఆర్టిస్టులు, పెయింటర్లు, స్కల్ప్టర్లు, ఆభరణ తయారీదార్లతో ఏర్పడిన కళాకారుల బృందం. ఇది పారిస్ కమ్యూన్ ఉధృతంగా కొనసాగుతున్న సమయంలో 1871 ఏప్రిల్‌లో కళాకారుల పాత్రను పునరంచనా వేయడానికి ఏర్పడింది.

## పారిస్ కమ్యూన్ ఆర్టిస్టుల ఫెడరేషన్

కమ్యూనల్ రిపబ్లిక్ ఆశయాలకు కట్టుబడిన పారిస్ ఆర్టిస్టులతో ఈ పెడరేషన్ ఏర్పాటు చేయబడింది.

అందరి ఆర్టిస్టుల మేధస్సులను కలిపిన ఈ ఫెడరేషన్ ఈ క్రింది ప్రాతిపదికలు కలిగి ఉంది :

'అన్ని రకాల ప్రభుత్వ అజమాయిషీలు, ప్రభుత్వ విశేష సదుపాయాలకు అతీతంగా కళను స్వేచ్ఛగా విస్తరింపచేయడం.'

'ఫెడరేషన్ సభ్యులందరికి సమాన హక్కులు'

'సభ్యుల సార్వజనీన ఓటు హక్కు ద్వారా ఏర్పడిన కమిటీ ద్వారా ప్రతి ఒక్క ఆర్టిస్టు స్వేచ్ఛను, హుందాతనాన్ని కాపాడటం'

ఈ కమిటీ సభ్యుల మధ్య సంఘీభావాన్ని పటిష్టం చేసింది, ఐక్య కార్యాచరణను సాధించింది.

## కమిటీ పొందిక

- 16 మంది పెయింటర్లు,
- 10 మంది స్కల్ప్టర్లు,
- 5 మంది ఆర్కిటెక్టులు,
- 6 మంది ఎన్‌గ్రేవర్లు,
- 10 మంది అలంకరణ కళకు ప్రాతినిధ్యం వహించేవారు (వీరి కళను పారిశ్రామిక కళ అని తప్పుగా పిలిచారు).

వీరు జాబితా పద్ధతి ద్వారా, రహస్య ఓటింగ్‌తో నియమించబడతారు.

కమిటీ సభ్యులు ఏడాది కాలానికి ఎన్నుకోబడతారు.

గడువు ముగిసిన తర్వాత కమిటీ రహస్య ఓటింగ్ ద్వారా ఎన్నుకోబడిన 15 మంది కమిటీ సభ్యులు ఆ తర్వాతి ఏడాదిలో కూడ కమిటీలో కొనసాగుతారు. మిగతా 32 మందిని తిరిగి ఎన్నుకుంటారు.

తప్పుకునే సభ్యులు తిరిగి ఏడాది వ్యవధి తర్వాతనే మళ్లీ ఎన్నుకోబడవచ్చు.

తన విధులను సక్రమంగా నిర్వర్తించని కమిటీ సభ్యులను తొలగించే హక్కుటుంది. అలా తొలగించాలన్న డిమాండ్ వచ్చిన నెల తర్వాత నెల రోజులకు సభ్యుల జనరల్ బాడీలో మూడింట రెడువంతుల మెజారిటీతో అంగీకరించబడినపుడు ఆ తొలగింపు ప్రకటించబడుతుంది.

## కర్తవ్య నిర్దేశం

కళాకారులతో ఏర్పడిన ఈ కళాప్రపంచపు ప్రభుత్వం ఈ క్రింది కర్తవ్యాలను కలిగి ఉంటుంది :

- గత కాలపు కళా సంపదను కాపాడటం,
- వర్తమాన అంశాలన్నింటినీ అమలుచేయడం, వెలుగులోకి తేవడం,
- విద్య ద్వారా భవిష్యత్తును పునరుజ్జీవింపచేయడం.

## స్మారక చిహ్నాలు, మ్యూజియంలు

స్మారక చిహ్నాలు, మ్యూజియంలు, ప్రైవేటు వ్యక్తులకు చెందని పారిస్ లోని ఆర్ట్ గ్యాలరీలు, కళా ఖండాల సేకరణలు, వాటికి సంబంధించిన లైబ్రరీలు

కలిగి ఉన్న సంస్థల నిర్వహణ, అజమాయిషీ బాధ్యతలు కళాత్మక దృష్టితో ఈ కమిటీ నిర్వర్తిస్తుంది.

ఆ కళా ఖండాలను ఈ కమిటీ నిలబెడుతుంది, పరిరక్షిస్తుంది, సర్దుబాటు చేస్తుంది, ప్రణాళికలను, జాబితాలను, విషయసూచికలను, కేటలాగ్‌లను సిద్ధం చేస్తుంది.

వీటికి సంబంధించిన అధ్యయనాలను ప్రోత్సహించడానికి, సందర్శకుల ఆసక్తిని సంతృప్తిపరచడానికి వీటన్నింటినీ అందరికీ అందుబాటులో ఉంచుతుంది.

ఈ కమిటీ భవనాల పరిస్థితిని గమనిస్తుంటుంది, తక్షణ మరమ్మత్తులను సూచిస్తుంది, తన పని గురించిన వివరాలను కమ్యూన్‌కు తరచు అందిస్తుంటుంది.

వారి వారి శక్తి సామర్థ్యాలను, నైతిక పరిస్థితిని పరిశీలించిన తర్వాత ఈ సంస్థలకు అవసరమైన సేవలందించడానికి, ఎగ్జిబిషన్లు (వీటి గురించి తర్వాత చెప్పబడుతుంది) ఏర్పాటు చేయడానికి అడ్మినిస్ట్రేటర్లను, ఒక కార్యదర్శిని, ఆర్కైవిస్టులను, వార్డెన్లను కమిటీ నియమిస్తుంది.

## ఎగ్జిబిషన్లు

పారిస్‌లో కమ్యూనల్, జాతీయ, అంతర్జాతీయ ఎగ్జిబిషన్లను కమిటీ నిర్వహిస్తుంది.

పారిస్‌లో కాకుండా ఇతర చోట్ల జరిగే జాతీయ, అంతర్జాతీయ ఎగ్జిబిషన్లకు పారిస్ ఆర్టిస్టులకు ప్రాతినిధ్యం వహించే ప్రతినిధి బృందాన్ని కమిటీ పంపిస్తుంది.

కళాకారుల సంతకాలు ఉన్న వాటిని, ఒరిజినల్ వాటిని, లేదా ఒక కళారూపం నుండి మరొక కళారూపానికి అనువదించబడిన వాటిని, ఉదాహరణకు ఎన్‌గ్రేవింగ్‌లకు పెయింటింగులు మొదలైన వాటిని మాత్రమే అనుమతిస్తుంది.

వాటి అసలు సృష్టికర్తల పేర్లకు బదులు సంపాదకుల, లేదా మాన్యుఫాక్చరర్ల పేర్లను ఉంచిన కళారూపాలను ఎట్టి పరిస్థితిలోను కమిటీ ఆనుమతించదు.

వాటికి  అవార్డులు ఏమీ ప్రదానం చేయదు.

కమ్యూన్‌చే నియమించబడిన సాధారణ కళారూపాలను ఆర్టిస్టులకు పంపిణీ చేస్తుంది. ఎగ్జిబిటర్ల ఓట్లను పరిగణనలోకి తీసుకుంటుంది.

అసాధారణ కళాఖండాలను పోటీలక పంపుతుంది.

## విద్య

కమ్యూన్ ప్రాథమిక, వృత్తిపరమైన స్కూళ్ళలో డ్రాయింగ్, మోడలింగ్ బోధనలను కమిటీ పర్యవేక్షిస్తుంది. వాటికి టీచర్లు పోటీ ద్వారా ఎంపిక చేసి నియమించబడతారు. ఆకర్షణీయమైన, తార్కికమైన పద్ధతుల ప్రవేశాన్ని కమిటీ ప్రోత్సహిస్తుంది. మోడల్స్‌కు ఆమోదముద్ర వేస్తుంది. ఉన్నత స్ఫూర్తిని వ్యక్తం చేసే ఇతివృత్తాలను కమిటీ రూపొందిస్తుంది. విద్యా శిక్షణలన్నీ కూడ కమ్యూన్ ఖర్చుతో అందచేయబడాలి.

ఉన్నత విద్య కోసం, సౌందర్యశాస్త్ర అంశాలపైన, కళా చరిత్ర, తాత్వికతలపైన కాన్ఫరెన్సులు నిర్వహించడం కోసం పెద్ద పెద్ద భవనాల నిర్మాణాన్ని సూచిస్తుంది, ప్రోత్సహిస్తుంది.

## ప్రచారం

ప్రచారం కోసం  అఫిషియల్ డెస్ ఆర్ట్స్  అనే పత్రికను కమిటీ ప్రారంభిస్తుంది. కమిటీ అదుపులో, బాధ్యతలోఉండే ఈ జర్నల్ కళా ప్రపంచ కార్యక్రమాలను, కళాకారులకు  ఉపయోగపడే సమాచారాన్ని ప్రచురిస్తుంది.

కమిటీ కార్యకలాపాలను, కమిటీ మీటింగుల మినిట్స్‌ను, కమిటీకి అందిన నిధులు, వాటి ఖర్చుల వివరాలను, అన్ని గణాంక వివరాలను ప్రచురిస్తుంది.

సాహిత్య సెక్షనులో సౌందర్య శాస్త్రంపైన వ్యాసాలు ప్రచురించబడతాయి. వీటిపట్ల కమిటీ తటస్థంగా ఉంటుంది, అన్ని అభిప్రాయాలను, పద్ధతులను ప్రచురిస్తుంది.

ఈ అఫిషియల్ డెస్ ఆర్ట్స్ మన పునరుజ్జీవానానికి సంబంధించిన పురోగామి, స్వతంత్ర, హుందాఅయిన, చిత్తశుద్ధితో కూడిన అత్యంత గంభీరమైన ప్రకటనగా  ఉంటుంది.

## మధ్యవర్తిత్వం

సంబంధిత పక్షాలు (ఆర్టిస్టులు లేదా ఇతరులు) కోరినట్లయితే కళలకు సంబంధించిన అన్ని వివాదాలలో పరిష్కారం కోసం కమిటీ మధ్యవర్తిత్వం వహిస్తుంది.

సూత్రబద్ధతకు సంబంధించిన అంశాలు, లేదా సాధారణ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలు అయితే, కమిటీ మధ్యవర్తిత్వ కౌన్సిల్‌ను ఏర్పాటు చేస్తుంది. దాని తీర్పును కళలకు సంబంధించిన అధికారిక నిబంధనలలో చేరుస్తుంది.

## వ్యక్తిగత చొరవ

కళా ప్రగతి, కళాకారుల నైతిక, మేథోపరమైన అభివృద్ధి లేదా కళాకారుల స్థితిగతుల మెరుగుదల లక్ష్యంగా కలిగిన అన్ని ప్రతిపాదనలు, ప్రాజెక్టులు, రిపోర్టులు, అభిప్రాయాలను పౌరులదరి వద్ద నుండి కమిటీ ఆహ్వానిస్తుంది.

వీటి వివరాలను కమిటీ కమ్యూన్‌కు నివేదిస్తుంది, సాధ్యమవుతాయని తాను భావించిన వాటి అమలు కోసం తన నైతిక మద్దతును, సహకారాన్ని అందచేస్తుంది.

ఈ ప్రతిపాదనలకు ప్రాచుర్యం కల్పిస్తూ, వీటికి ఆమోదం తెలపాల్సిందిగా ప్రజాభిప్రాయానికి పిలుపునిస్తుంది.

చివరిగా, ప్రామాణిక కళాఖండాలకు (మాస్టర్‌పీసెస్) రచనలద్వారాను, పెన్ను, పెన్సిలు ద్వారాను నకళ్ళను తయారు చేసి, అద్భుతమైన ఆ చిత్రాలను ఫ్రాన్సులోని ప్రతి గ్రామంలోని టౌను హాళ్ళలో ఏర్పాటు చేయడం ద్వారా ఆ కళా ఖండాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకు కమిటీ కృషి చేస్తుంది. పునరుజ్జీవనం కోసం, సమిష్టి సంపద పెరుగుదల కోసం, భవిష్యత్తును తేజోవంతం చేయడం కోసం, సార్వజనీన రిపబ్లిక్ కోసం కమిటీ పాటుపడుతుంది.

జి. కోర్బె, మౌలినె, స్టీఫెన్ మార్టిన్, అలెగ్జాండర్ జోస్, రోజెనెక్, ట్రికోన్, డాలో, జూల్స్ హీరో, సి. చాబెర్ట్, హెచ్. డుబోయిస్, ఎ. ఫాలెనీరె, యూగెన్ పాటియర్, పెరిన్, ఎ. మౌలియర్డ్.


Mi vse ustvarjamo na svetu, zato naj vse bo naša last;
zato naj delavcu in kmetu pripada tudi vsa oblast.
Ko vse lenuhe in tirane uniči naša trda pest,
krivice bodo vse pregnane, svoboden rod vasi in mest.
ہے جنگ ہماری اخری جس پر ہے فیصلہ
گاو انٹرناسیونال اٹھو کے وقت ایا ہے جنگ ہماری اخری جس پر
ہے فیصلہ گاو انٹرناسیونال اٹھو کے وقت ایا

# కమ్యూనార్డుల తీర్మానం

## బెర్టోల్ట్ బ్రెక్ట్

మేం గుర్తించాం మా బలహీనతను
అదే మీచట్టాల్ని  చేయనిస్తోందని
మేం నిశ్చయించుకున్నాం ముమ్ముందు ఆ మెతకదనం వదిలించుకోవాలని
ఇక మీదట చట్టాలు మా వైపే ఉంటాయి

గుర్తించాం మమ్మల్ని బందీలు చేశారని
తూటాలు నింపిన పిస్తోళ్ళు మా తలలపైకి గురిపెట్టి
మేం నిశ్చయించుకున్నాం మున్నుందు మీ చిత్రహింసలకు భయపడొద్దని
బానిసత్వం చావుకన్నా హీనం

గుర్తించాం మీరు మమ్మల్ని పస్తులతో మాడ్చారని
అందుకే మీరు అపార సంపద కూడబెట్టారని
మేం నిశ్చయించుకున్నాం మమ్మల్ని భోజనశాలకు దూరంపెట్టడాన్ని
గుమ్మాన్ని బ్రద్దలు కొట్టడంతోనే అధిగమించాలని

గుర్తించాం మమ్మల్ని బందీలు చేశారని
తూటాలు నింపిన పిస్తోళ్ళు మా తలలపైకి గురిపెట్టి
మేం నిశ్చయించుకున్నాం మున్ముందు మీ చిత్రహింసలకు భయపడొద్దని
బానిసత్వం చావుకన్నా హీనం

మేం గుర్తించాం మీరు మాకు ఇళ్ళు లేకుండా చేశారని
మా చుట్టూ ఎన్నెన్నో ఇళ్ళు ఖాళీగా పడున్నా
మేం నిశ్చయించుకున్నాం ఇప్పుడు ఆ ఆంక్షలకు అంతం పలకాలని
ఇక మీదట ప్రతి కార్మికునికీ ఇల్లుంటుంది

గుర్తించాం మమ్మల్ని బందీలు చేశారని
తూటాలు నింపిన పిస్తోళ్ళు మా తలలపైకి గురిపెట్టి
మేం నిశ్చయించుకున్నాం మున్ముందు మీ చిత్రహింసలకు భయపడొద్దని
బానిసత్వం చావుకన్నా హీనం

గుర్తించాం మేం మిమ్మల్ని ఒప్పించలేమని
మాకు బతికే వేతనం చెల్లించమని
నిశ్చయించుకున్నాం మీ నుండి ఫ్యాక్టరీలు లాక్కోవాలని
గుర్తించాం మీ నష్టం మా లాభమని

గుర్తించాం మమ్మల్ని బందీలు చేశారని
తూటాలు నింపిన పిస్తోళ్ళు మా తలలపైకి గురిపెట్టి
మేం నిశ్చయించుకున్నాం మున్ముందు మీ చిత్రహింసలకు భయపడొద్దని
బానిసత్వం చావుకన్నా హీనం

గుర్తించాం మేం ఆధారపడలేమని
మా పాలకులు చేసే అన్ని వాగ్దానాలపైనా
నిశ్చయించుకున్నాం మంచి జీవితం స్వేచ్ఛతోనే మొదలవుతుందని
మా ఫర్మానాలతోనే మా భవిష్యత్తు నిర్మితమవుతుందని

గుర్తించాం మమ్మల్ని బందీలు చేశారని
తూటాలు నింపిన పిస్తోళ్ళు మా తలలపైకి గురిపెట్టి
మేం నిశ్చయించుకున్నాం మున్ముందు మీ చిత్రహింసలకు భయపడొద్దని
బానిసత్వం చావుకన్నా హీనం

గుర్తించాం ఫిరంగి గర్జనలే
మీతో మాట్లాడే మాటలని
నిరూపిస్తాం మీకు మేం మా పాఠాలు నేర్చుకున్నామని
మున్ముందు తుపాకీలు మీపై గురిపెడతాం.

కమ్యూన్ లక్ష్యం.. సామాజిక విప్లవం, కార్మికుల రాజకీయ,
ఆర్థిక విముక్తి. అది మొత్తం ప్రపంచ కార్మికవర్గ లక్ష్యం.
ఆ విధంగా చూసినప్పుడు అది అమరమైనది.

– వి. ఐ. లెనిన్

1871లో డెబ్బై రెండు రోజుల పాటు పారిస్ ప్రజలు ఒక ఆదర్శ ప్రపంచానికి ద్వారాలు తెరిచారు. వారు తమ స్వంత ప్రజాస్వామ్య సూత్రాల ఆధారంగా స్వంత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ పారిస్ కార్మికులు 1789 ఫ్రెంచ్ విప్లవ వారసులు, 1848 ప్రజా తిరుగుబాటుకు వారసులు. ఈ సంఘటనలన్నిటిలోనూ వారి తిరుగుబాట్లను వారి నుండి కొల్లగొట్టారు. 1871లో జరిగిన పోరాటం కూడా వారి ఓటమితో అంతమైంది. ఈ సందర్భంగా క్రూరమైన ఫ్రెంచ్ బూర్జువా వర్గం లక్ష మంది స్త్రీ, పురుషులను చంపింది. ఈ 72 రోజుల ప్రయోగాన్నే పారిస్ కమ్యూన్ అని పిలుస్తున్నారు.

సోషలిజం కోసం జరిగిన ఈ ప్రయోగం గురించి కారల్ మార్క్స్, లెనిన్, బ్రెక్ట్‌లు రాసిన విషయాలను, వాటితోపాటు సందర్భాన్ని వివరిస్తూ ఒక పరిచయం కూడా ఈ పుస్తకంలో ఇవ్వడం జరిగింది.



పారిస్ కమ్యూన్ 150 కారల్ మార్క్స్ | వి.ఐ. లెనిన్ | బెర్టోల్ట్ బ్రెక్ట్ పరిచయం : విజయ ప్రసాద్